మార్చి
2015

107

సంపుటి : 9 సంచిక : 11

వెల రు. 10/-

## ఈ సంచికలో........

గత అనుభవాల నుండి నూతన రాజకీయ ఎత్తుగడల రూపకల్పన

పెట్టుబడి సేవలో రాజ్యం

కేంద్రం బాటలోనే టిఆర్ఎస్ పాలన

సంస్కృతం ఎవరి భాష?

మోడీ అసలు కథ

వ్యవసాయేతర అవసరాలకు మళ్లుతున్న సాగుభూమి

ప్రశ్నిద్దామా వద్దా అనేదే అసలు ప్రశ్న

'ఆప్' విజయానికి జాతీయ ప్రాధాన్యత ఉంది


జైలుపై ఎర్రజెండా ఎగుర వేసిన ధీశాలి చిర్రావూరి లక్ష్మీనరసయ్య

**శత జయంతి నివాళి**

# జైలుపై ఎర్రజెండా ఎగుర వేసిన ధీశాలి

# చిర్రావూరి లక్ష్మీనరసయ్య

యు. రామకృష్ణ



తెలంగాణా సాయుధ రైతాంగ పోరాటం సందర్భంగా ఇద్దరు సహచరులతో కలిసి జైలుపైనే అరుణపతాకం ఎగురవేసిన ధీశాలి ఆయన. జైలు బారకాసుల్లో బంధించబడిన వారందరికీ రహస్యంగా సందేశాలు పంపి, జైలు ప్రతిధ్వనించేలా నినాదాలు చేయించిన విప్లవకారుడాయన. ప్రపంచ కార్మికుల దీక్షా దినమైన 'మే దినోత్సవం' రోజున ఆ జైలు 'ప్రపంచ కార్మికులారా, ఏకంకండు!' నినాదాలతో మార్మోగిపోయింది. తన కళ్ళుగప్పి జైలుపై ఎర్రజెండా ఎగురవేయడంతో జైల్లో ఖైదీల కదలికలను అనుక్షణం డేగ కళ్ళతో పరిశీలించే సిఐడి నిర్ఘాంతపోయాడు. జైలు సూపరింటెండెంటు చెమటతో తడిసి ముద్దయిపోయాడు. సిఐడి ఇది తనకు అవమానంగా భావించాడు. వెంటనే ఎస్‌పికి చెప్పి జైలుకు పోలీసులను పిలిపించాడు. జెండా ఎవరు ఎగురవేశారని అడిగారు. తానే ఎగురవేశానంటూ ముందుకు వచ్చాడో యువకుడు. సిఐడి, జైలు సూపరింటెండెంటు, పోలీసులు ప్రాన్పడిపోయారు. కొద్దిసేపు వారికి నోట మాట రాలేదు. అంతకు కొద్దికాలం కిందట ఆ యువకుణ్ణి జైల్లో ఒళ్ళు హూనమయ్యేలా చిత్రహింసలు పెట్టారు. రెండేళ్ళపాటు చేతులకూ, కాళ్ళకూ సంకెళ్ళు వేశారు. చేతి గోళ్ళ వెనుక గుండు సూదులు గుచ్చి నరకాన్ని చూపారు. జైలు వెలుపల ఆయన ఆస్తులనూ, ఇంటిని జప్తు చేశారు. ఆయన ఇంటినే పోలీసు స్టేషనుగా మార్చివేశారు. అయినా ఆయన పట్టుదల కొద్దిగా కూడా సడల లేదు. తన ఆచూకీ కోసం కన్నతల్లినీ, భార్యనూ జైల్లో పెట్టినా చలించలేదా యువకుడు. ఎన్ని చేసినా కమ్యూనిస్టు పార్టీ పట్ల ఆయన ధృడదీక్ష ఏ మాత్రం సన్నగిల్లలేదు. జైలు నుంచే ఖమ్మం మున్సిపల్ కౌన్సిలరుగా పోటీ చేసి గెలుపొందారు. ఆయనను పురపాలక సంఘ ఛైర్మను కాకుండా ప్రభుత్వం ఎంతగా ప్రయత్నించినా సఫలం కాలేకపోయింది. దాదాపు మూడు దశాబ్దాల పాటు ఖమ్మం మున్సిపల్ ఛైర్మన్‌గా వ్యవహరించిన ఆ తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటయోధుడే చిర్రావూరి లక్ష్మీనరసయ్య. ప్రస్తుతం ఆయన శత జయంతి సంవత్సరం జరుగుతున్నది.

సనాతన సంప్రదాయ కుటుంబంలో జన్మించిన చిర్రావూరి నమ్మిన సిద్ధాంతాన్ని అంతిమ శ్వాస విడిచేవరకూ విడనాడని ధీరుడు. తల్లితండ్రులకు చిర్రావూరి ఒక్కరే సంతానం. 15-3-1915వ తేదీన ఆయన జన్మించాడు. తనకు ఊహ వచ్చేనాటికి, అంటే 1930వ సంవత్సరంలో ప్రజలపై పెత్తందారుల దౌర్జన్యాలు, పటేల్ పట్వారీల దుర్మార్గాలు, వెట్టి చాకిరీ చేయించుకోవడం, తెలుగుకు ప్రాధాన్యత ఇవ్వకుండా నిర్బంధంగా ఉర్దూ చదివించడం, అన్నీ ఉర్దూ పాఠశాలలే ఏర్పాటు చేయడం చిర్రావూరిలో నైజాము పట్ల అసహ్యాన్ని కలుగజేశాయి. దీంతో ఆయన బెజవాడ వెళ్ళిపోయారు. అక్కడ స్వాతంత్ర్య సమరయోధుడు అయ్యదేవర కాళేశ్వరరావు వంటి నేతల ఉపన్యాసాలు విన్నారు. గాంధీ పిలుపు మేరకు కొనసాగుతున్న ఉద్యమాలకు ఆకర్షితులయ్యారు. అక్కడ విద్యార్థులు సమ్మె చేస్తుండటంతో ఆయన తిరిగి ఖమ్మం చేరుకున్నారు. బెజవాడలో కలిగిన చైతన్యంతో ఖమ్మం హైస్కూల్లో 200 మంది విద్యార్థులను సమీకరించి విద్యార్థి సంఘాన్ని ఏర్పాటు చేశారు. ఆ సంఘానికి ఆయన కార్యదర్శిగా ఉన్నారు. హైస్కూల్లో విద్యార్థి ఉద్యమాలు జరక్కుండా చిర్రావూరిని ప్రధానోపాధ్యాయుడు తరచూ బెదిరిస్తుండేవాడు. దీంతో ఆయనలో పట్టుదల మరింత హెచ్చింది. అదే సమయంలో హిందూ-ముస్లిం తగాదాలూ పెచ్చరిల్లాయి. ఇవి ఉపాధ్యాయుల్లోనూ ఉండేవి. దీంతో చదువు పట్ల ఆసక్తి సన్నగిల్లింది. విద్యార్థుల్లో మాత్రం నాయకుడుగా గౌరవం ఉండేది. దాన్ని ఉపయోగించి విద్యార్థి ఉద్యమాలు నిర్మిస్తుండేవాడు.

ఆ సమయంలోనే ఆంధ్ర మహాసభ కార్యక్రమాలకు ఆకర్షితుడయ్యాడు. 1934లో ఖమ్మంలో జరిగిన మూడో ఆంధ్ర మహాసభ జరగకుండా అడ్డుకునేందుకు ప్రయత్నాలు జరిగాయి. స్థానికంగా ఉన్న అభ్యుదయ శక్తుల మధ్య ఘర్షణకు మహాసభ వేదికగా మారింది. వక్తలు బయట నుంచి వచ్చారంటూ సభలో కొందరు విమర్శలు చేశారు. ప్రభుత్వ వ్యతిరేక కార్యకలాపాలపై చర్చలు లేవు. సహపంక్తి భోజనాలు, వితంతు వివాహాలు, గ్రంథాలయాల పునరుద్ధరణ వంటి సాంఘిక కార్యక్రమాలపై చర్చలు జరిగాయి. దేవాలయాల్లో హరిజనుల ప్రవేశంపై నిషేధం ఉంది. దానిపైనా చర్చ లేదు. అయినప్పటికీ సభను నిలిపివేయాలని కొందరు చేసిన ప్రయత్నాన్ని చిర్రావూరి నిరోధించారు. అప్పటికి ఆయన కాంగ్రెసు అభిమాని. దీనిని అడ్డుపెట్టుకొని ఆయనను హైస్కూలు నుంచి పంపించేందుకు ప్రయత్నాలు జరిగాయి. దీన్ని ఆయన పెద్దగా పట్టించుకోలేదు. 1935లో ఖమ్మంలోని జీర్ణ గ్రంథాలయాన్ని పునరుద్ధరించి 1939 వరకూ దానికి కార్యదర్శిగా పనిచేశారు. ఆ తరువాత గ్రంథాలయ కమిటీకి ఎన్నికలు జరిపించి ప్రజలకు అప్పగించారు. 1938లో త్రిపురలో జరిగిన కాంగ్రెసు మహాసభకు హాజరైనప్పుడు కమ్యూనిస్టు నాయకులతో పరిచయమేర్పడింది. ఖమ్మంలో రాజకీయ తరగతులు జరిగితే హాజరయ్యారు. ఆ తరగతుల్లోనే చంద్ర రాజేశ్వరరావుతో పరిచయమేర్పడింది. ఆయన ద్వారా కమ్యూనిస్టు పార్టీతో సంబంధాలేర్పడ్డాయి.

1939లో హైదరాబాద్ స్టేట్ కాంగ్రెసు ఆధ్వర్యంలో సత్యాగ్రహం జరిగింది. అప్పుడున్న ఆంధ్రమహాసభ నాయకులు సత్యాగ్రహ వాలంటీర్లను రిక్రూట్ చేస్తున్నారు. చిర్రావూరి స్థానికంగానే సత్యాగ్రహం జరగాలంటూ రిక్రూట్‌మెంట్‌ను ప్రతిఘటించారు. దీనికి సంప్రదాయవాదులు అంగీకరించలేదు. ఏమైనా సరే ఇక్కడే

(మిగతా 35వ పేజీలో)

# ఈ సంచికలో...


1. జైలుపై ఎర్రజెండా ఎగుర వేసిన ధీశాలి చిర్రావూరి లక్ష్మీనరసయ్య – యు. రామకృష్ణ 2

2. గత అనుభవాల నుండి నూతన రాజకీయ ఎత్తుగడల రూపకల్పన – వి. శ్రీనివాసరావు 4

3. పెట్టుబడి సేవలో రాజ్యం – ప్రభాత్ పట్నాయక్ 7

4. కేంద్రం బాటలోనే టిఆర్ఎస్ పాలన – ఎస్. వీరయ్య 10

5. సంస్కృతం ఎవరి భాష? – ఎం.వి. ఆంజనేయులు 12

6. మోడీ అసలు కథ – ఎం. నిర్మల్ కుమార్ 19

7. వ్యవసాయేతర అవసరాలకు మళ్లుతున్న సాగుభూమి – కొండూరి వీరయ్య 22

8. ప్రశ్నిద్దామా వద్దా అనేదే అసలు ప్రశ్న – రొమిల్లా థాపర్ 26

9. 'ఆప్' విజయానికి జాతీయ ప్రాధాన్యత ఉంది – బివి రాఘవులు 33



సంపాదకుడు:
ఎస్. వెంకట్రావు

సంపాదక వర్గం:
పాటూరు రామయ్య
బి.వి. రాఘవులు
తమ్మినేని వీరభద్రం
ఎస్. వీరయ్య
తెలకపల్లి రవి



భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరుపున
ప్రచురణ కర్త, ముద్రాపకుడు: బి.వి.రాఘవులు
సంపాదకుడు : ఎస్. వెంకట్రావు
ముద్రణ : ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్,
ప్లాట్ నెం 21/1, అజామాబాద్, హైదరాబాద్–20
ఫోన్: ఎడిటోరియల్ 0866–2573822
మేనేజర్: 040–27673787
EMail: svenkatarao_1958@yahoo.com
Visit cpi(m) site at : cpim.org


# సాంస్కృతికోద్యమం

భారత కమ్యూనిస్టుపార్టీ మార్క్సిస్టు ఆంధ్రప్రదేశ్ మహాసభలు ఫిబ్రవరి 8, 9 తేదీల్లో విజయవాడలో జరిగాయి. తెలంగాణా రాష్ట్ర మహాసభలు మార్చి 1, 2, 3 తేదీల్లో హైదరాబాద్‌లో జరుగుతున్నాయి. పార్టీ 21వ అఖిల భారత మహాసభలు కూడా ఈసారి మన తెలుగు నేలపైనే జరుగుతున్నాయి. తెలుగు జాతి రెండు రాష్ట్రాలుగా విడిపోయినా, పార్టీ రెండు కమిటీలుగా ఏర్పడినా రెండు మహాసభల్లో ఒక ఉమ్మడి అంశం కనిపిస్తోంది. అది ప్రజాసమస్యలపై పోరాటాలతో పాటు ప్రజా సాంస్కృతికోద్యమంపై కేంద్రీకరణ. ప్రజా సంస్కృతి అంటే కేవలం కళలు, సాహిత్యం మాత్రమేనన్న సంకుచిత అర్థంలో కాకుండా విస్తృతార్థంలో తీసుకుని కృషి చేయాలని రెండు పార్టీలు నిర్ణయించాయి. పార్టీ మహాసభల సందర్భంగా ఈసారి నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యకలాపాల విస్తృతిని చూస్తేనే రెండు రాష్ట్ర కమిటీలు దీనికి ఎంతటి ప్రాధాన్యత ఇస్తున్నాయో, భవిష్యత్తులో ఈ రంగంపై ఎంతగా కేంద్రీకరించదలుచుకున్నాయో అర్థమవుతుంది.

కమ్యూనిస్టు పార్టీకి ఆర్థిక, సైద్ధాంతిక రంగాల్లో పోరాటం ఎంతముఖ్యమో సాంస్కృతిక రంగంలో పోరాటం కూడా అంతే ముఖ్యమైనది. బూర్జువా–భూస్వామ్య పార్టీలకు సమాజ మార్పుపై ఆసక్తి లేదు. ఈ సామాజిక వ్యవస్థ ఇలా కొనసాగడమే వాటికి కావాలి. వాటి దృష్టిలో మార్పు అంటే సమాజానికి పైపై మెరుగులు చేసే కొన్ని సంస్కరణలు మాత్రమే. కానీ మార్క్సిస్టు పార్టీ బూర్జువా–భూస్వామ్య సమాజాన్ని సమూలంగా మార్చి కొత్త సమాజిక వ్యవస్థను – జనతా ప్రజాతంత్ర సామాజిక వ్యవస్థను – నిర్మించదలచుకుంది. పైపై మార్పులు కాకుండా సామాజిక ఆర్థిక మూలాల్లో మార్పులు వచ్చినప్పుడు మాత్రమే సమాజం మారుతుంది. అయితే ఆ ఆర్థిక మూలాలను రక్షించే ఉపరితల అంశాలు కొన్ని ఉన్నాయి. వాటిలో సంస్కృతి ప్రధానమైనది. కళలు, సాహిత్యం, సంప్రదాయాలు, నమ్మకాలు, భావజాలం, నీతి–నియమాలు ఇవన్నీ కూడా సమాజ మూలలను రక్షించే సాంస్కృతిక అంశాలు. వీటిని ఛేదించకుండా, అంటే ఈ రంగంలో పోరాటం చేయకుండా సమాజ మూలలను ఛేదించడం అసాధ్యం. అందుకనే సాంస్కృతిక రంగంలో వర్గపోరాటానికి మార్క్సిస్టు పార్టీ అత్యంత ప్రాధాన్యతనిస్తుంది.

ప్రపంచీకరణ యుగంలో సర్వం సరుకు మయంగా మారిపోతోంది. వినిమయదారీ సంస్కృతి ద్వారా సమాజంపై సరుకు ఆధిపత్యం వహిస్తోంది. అందువల్ల ప్రపంచీకరణకు వ్యతిరేకంగా పోరాడాలంటే వినిమయదారీ సంస్కృతికి వ్యతిరేకంగా తిరుగులేని పోరాటం చేయాల్సిన అవసరం ఏర్పడింది. వినిమయ దారీ సంస్కృతికి వ్యతిరేకంగా పోరాడటం అంటే దాన్ని విమర్శిస్తే సరిపోదు, దానికి ప్రత్యామ్నాయమైన సంస్కృతి ఎక్కడున్నా ప్రోత్సహించాలి. వ్యష్టి సంస్కృతి స్థానంలో సమిష్టి సంస్కృతిని పెంపొందించాలి. అందుకే నిర్లక్ష్యానికి గురియవుతున్న, మరుగున పడిపోతున్న, మారుమూలల్లో దాగి ఉన్న సమిష్టి సాంస్కృతిక రూపాలన్నిటినీ వెలికితీసి, ఆధునీకరించి వర్గపోరాటంలో వినియోగించుకోడానికి విశాలమైన సాంస్కృతికోద్యమాన్ని నిర్మించాల్సిన కర్తవ్యం ఈ రోజు మనముందుకు వచ్చింది. ఆ కర్తవ్య నిర్వహణ బాధ్యత కేవలం కళాకారులది మాత్రమే కాదు, మార్క్సిస్టులందరిదీ.


**చందా వివరాలు**

విడిపత్రిక: రూ.10, సంవత్సర చందా: రూ.100, పోస్టు ద్వారా రూ. 120

పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు.
లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి.
ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.




**చిరునామా**

మేనేజర్,
మార్క్సిస్టు
(సైద్ధాంతిక మాసపత్రిక),
ఎం.హెచ్ భవన్ (ప్రజాశక్తి కార్యాలయం),
అజామాబాద్, హైదరాబాద్- 20

**సిపిఐ(ఎం) 21వ మహాసభలు**

### వామపక్ష ప్రజాతంత్ర సంఘటన నిర్మాణమే తక్షణ రాజకీయ దిక్సూచి

# గత అనుభవాల నుండి నూతన రాజకీయ ఎత్తుగడల రూపకల్పన



రచయిత భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) కేంద్ర కార్యదర్శివర్గ సభ్యులు

**వి. శ్రీనివాసరావు**

విశాఖలో జరగనున్న సిపిఐ(ఎం) 21వ మహాసభల చర్చ నిమిత్తం రాజకీయ ఎత్తుగడల పంథా ముసాయిదా నివేదికనూ, రాజకీయ తీర్మాన ముసాయిదానూ పార్టీ కేంద్ర కమిటీ విడుదల చేసింది. కొంతకాలంగా పార్టీలో స్తబ్ధత నెలకొని ఉండటం, అనేక రాష్ట్రాల్లో ప్రజా పునాది తరిగిపోవడం, అంతిమంగా 2009 ఆ తర్వాత 2014 సాధారణ పార్లమెంటు ఎన్నికల్లో పార్టీ ఓట్లు, సీట్లు తగ్గిపోవడంతో ఎత్తుగడల పంథా సమీక్ష అనివార్యమయ్యింది. 2014 ఎన్నికల సమీక్షలో నాలుగు కర్తవ్యాలను పార్టీ కేంద్ర కమిటీ నిర్ణయించింది. అవి 1. రాజకీయ ఎత్తుగడల పంథాను పునః పరిశీలించడం, 2. పార్టీ నిర్మాణాన్ని, ప్రజల్లో పనిని సమీక్షించడం, 3. ప్రజాసంఘాల కార్యకలాపాలు వాటి స్వతంత్ర పని- పార్టీ నిర్మాణాన్ని సమీక్షించడం, 4. వివిధ వర్గాలపై సరళీకరణ ప్రభావాలను నిర్దిష్టంగా అధ్యయనం చేయడం. ఈ నాలుగు అంశాలూ ఒకదానితో ఒకటి సంబంధం కలిగినవి, విడదీయడానికి వీలులేనివి. ఈ మహాసభల్లో ఎత్తుగడల సమీక్షపై ఒక నిర్ణయానికి వచ్చాక, దాని ఆధారంగా ఆ తర్వాత పార్టీ నిర్మాణంపై ప్రత్యేక ప్లీనం నిర్వహించాలని కేంద్ర కమిటీ నిర్ణయించింది. దాని విధివిధానాలను మహాసభ రూపొందిస్తుంది. ఇప్పటికే కేంద్ర కమిటీ నియమించిన 3 అధ్యయన కమిటీలు (కార్మిక, వ్యవసాయ, మధ్యతరగతి రంగాలపై) వాటి నివేదికలను పొలిట్‌బ్యూరోకు సమర్పించాయి. ఈ చర్యలన్నీ పార్టీ అవగాహనలోనూ, ఆచరణలోనూ ఉన్న లోపాలను సరిదిద్దుకుని మరింత వేగంగా, సమర్ధవంతంగా పని చేయడానికీ, బలపడటానికీ, ప్రజా పునాదిని పెంచుకోవడానికీ తోడ్పడుతుందని కేంద్ర కమిటీ భావిస్తోంది. పార్టీ సభ్యులు, శాఖలు, కమిటీలు ఈ పత్రాలను చర్చించి తమ సవరణలనూ, అభిప్రాయాలనూ పంపవచ్చు. తమ అనుభవాల ఆధారంగా వీటిని మరింత పరిపుష్టం చేయాల్సిన అవసరం ఉంది.

**పూర్వరంగం**

1975ల్లో ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా ప్రజల్లో వెల్లువెత్తిన ప్రజాస్వామిక వాంఛ, కాంగ్రెస్ గుత్తాధిపత్యం బద్దలు కావడం, తదితర పరిణామాల నేపథ్యంలో దేశంలో కొత్త రాజకీయ వాతావరణం ఏర్పడింది. కేరళ, పశ్చిమ బెంగాల్, త్రిపురల్లో వామపక్షాల నాయకత్వంలో ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. 1980ల్లో కేంద్ర గుత్తాధిపత్యానికి వ్యతిరేకంగా అనేక రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలు పుట్టుకొచ్చాయి. జాతీయస్థాయిలో కాంగ్రెస్ బలహీనపడే కొద్దీ బిజెపి మరొక ప్రధాన రాజకీయ శక్తిగా పరిణామం చెందుతూ వచ్చింది. 1990ల్లో కాంగ్రెస్, బిజెపిలకు వ్యతిరేకంగా వామపక్షాలు, వివిధ ప్రాంతీయ పార్టీలూ రాజకీయ ప్రత్యామ్నాయంగా ముందుకు రావడానికి పలు ప్రయత్నాలు చేశాయి. 21వ శతాబ్దం ఆరంభం నుండి మతోన్మాద శక్తులు విజృంభించాయి. నివారించడానికి ఎంత కృషి చేసినప్పటికీ 1999లో అధికారాన్ని కూడా చేజిక్కించుకున్నాయి. ఈ కాలంలో అనేక ప్రాంతీయపార్టీలు స్వతంత్ర శక్తిగా నిలబడటానికి బదులుగా అటు కాంగ్రెస్ పంచనో ఇటు బిజెపి సరసనో చేరాయి. ప్రజలపై పెను భారాలు మోపుతున్న సరళీకరణ ఆర్థిక విధానాలను అమలు చేయడంలో కాంగ్రెస్, బిజెపి, ఇతర బూర్జువా-భూస్వామ్య ప్రాంతీయ పార్టీల మధ్య తేడాలేమీ లేవు. అధికారంలో లేనప్పుడు ఏమి చెప్పినప్పటికీ ఆచరణలో ఇవి వామపక్షాలతో కలిసి ప్రజల పక్షాన నిలబడలేదు. ఆఖరికి 2009, 2014 ఎన్నికల్లో ఈ శక్తులన్నీ వామపక్షాలను ఒంటరిపాటు చేయాలని కూడా ప్రయత్నం చేశాయి. ఇలా గత 25 సంవత్సరాల కాలంలో రాజకీయ పరిణామాలు రకరకాల మలుపులు తిరిగాయి. వాటికనుగుణంగా సిపిఐ(ఎం) స్థూలంగా ఎప్పటికప్పుడు ఎత్తుగడలను నిర్ణయించుకుంటూ వచ్చింది. కాంగ్రెస్, బిజెపిలను అధికారంలోకి రానీయకుండా ఒకమేరకు నిరోధించడానికి లేదా కనీసం వెనక్కినెట్టడానికీ, కాంగ్రేసేతర సెక్యులర్ పార్టీలను ఒక తాటిపైకి తీసుకురావడానికీ ఈ కృషి కొంతవరకూ తోడ్పడింది. 2004 తర్వాత యుపిఎ-1ను బలపర్చిన కాలంలో ఉపాధి హామీ పథకం, అటవీ హక్కుల చట్టం వంటి కొన్ని ప్రజానుకూల నిర్ణయాలు చేయడానికి కృషి చేసింది. అయితే అంతిమంగా పార్టీ స్వతంత్ర బలాన్ని పెంచుకోడానికి ఇవి దోహదపడలేదు.

**ఎత్తుగడల అమలు-**
**అనుభవాలు-ఆత్మవిమర్శ**

ఈ ఎత్తుగడలను అమలు పరిచే క్రమంలో కొన్ని లోపాలు కూడా జరిగాయి. 1999లో ఎన్నికలు ముందే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బలపరుస్తామన్న భావనకు చోటిచ్చాం. ఆ తరువాత 2004లో ఆంధ్రప్రదేశ్‌సహా కొన్ని రాష్ట్రాల్లో కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకున్నాం. 1996-98 మధ్య యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వానికి మద్దతిచ్చిన సమయంలో ప్రజా ఉద్యమాలను నిర్లక్ష్యం చేశాము. 2004లో బిజెపిని నిరోధించడానికి యుపిఎ-1 ప్రభుత్వాన్ని సమర్థించడం స్థూలంగా సరైనదే అయినప్పటికీ, 2008లో అణు ఒప్పందానికి వ్యతిరేకంగా మద్దతు ఉపసంహరించుకున్నాము. అయితే అప్పటికే ప్రభుత్వాన్ని ఐఎఇఎ (అంతర్జాతీయ అణుసంస్థ)కు పోవడానికి అనుమతించిన కారణంగా మన ప్రయత్నం ఫలించలేదు. ఆనాడు కాంగ్రెస్ నాయకుల మాటలను నమ్మడం తప్పు. ఐఎఇఎకు పోవడానికి ముందే మద్దతు ఉపసంహరించుకోవాల్సిందని కేంద్ర కమిటీ అభిప్రాయపడింది. అలాగే 2009లో మూడో ప్రత్యామ్నాయ ప్రభుత్వ ఏర్పాటుకు పిలుపునివ్వడం కూడా తప్పని

కేంద్ర కమిటీ భావించింది. బెంగాల్ నందిగ్రాం, సింగూరుల్లో జరిగిన పరిణామాలు పార్టీ ప్రతిష్ట ను బాగా దెబ్బతీశాయి. మతోన్మాద శక్తుల్ని ఎదుర్కోవాలన్న మన లక్ష్యానికి కూడా ఈ ఎత్తు గడలు తోడ్పడలేదు. పైగా ఈ కాలంలో అవి మరింతగా బలపడుతూ వచ్చాయి. అయితే మతోన్మాద వ్యతిరేక పోరాటం పేరుతో మనం వివిధ బూర్జువాపార్టీలతో కలిసి కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వాల ఏర్పాటుకు ప్రయత్నం చేశాం. వాటిని బలపరిచాం. ఆ క్రమంలో సరళీకరణ విధానాలను గట్టిగా ప్రతిఘటించ లేకపోయాం. పరోక్షంగా మనం కూడా వాటికి అనుకూలంగా ఉన్నామన్న సంకేతాలు ప్రజల్లోకి వెళ్లాయి. బిజెపిని నిరోధించే పేరుతో సరళీకరణ విధానాలకు వ్యతిరేకంగా చేసే పోరాటాలకు ప్రాధాన్యత తగ్గింది.

ఐతే మొత్తంమీద ఎత్తుగడల ఫలితాలూ –మంచీ చెడూ – ఎలా ఉన్నప్పటికీ పార్టీ ఈ కాలంలో ఎదగకపోగా, బాగా బలహీనపడింది. దీనికి కారణం ఎత్తుగడల పంథాను అమలు చేయడంలోనో లేదా అమలు చేసే క్రమంలో జరిగిన పొరపాట్ల వల్లనో కాదు. ఎత్తుగడల పంథాలోనే అసలు లోపం ఉందని కేంద్ర కమిటీ గుర్తించింది. జరిగిన లోపాలపై ఆత్మవిమర్శనా పూర్వకంగా పరిశీలన చేసుకుంది. అందువల్ల దీనిని పునఃపరిశీలించాల్సిన అవసరం ఏర్ప డింది. ఈ కాలంలో మన ఎత్తుగడలు ప్రధా నంగా ఎన్నికల ఎత్తుగడలకే పరిమితమయ్యాయి. ప్రజా ఉద్యమాలు పూర్తిగా నిర్లక్ష్యానికి గుర య్యాయి. కొన్ని జాతీయ స్థాయి సమ్మెలు, మరికొన్ని చిన్నాచితకా ఉద్యమాలు జరిగినప్పటికీ అవి ప్రజలను రాజకీయంగా ప్రభావితం చేసేంతగా లేవు. ఐక్య సంఘటనా ఎత్తుగడలన్నీ ఎన్నికలకే పరిమితమయ్యాయి. ప్రాంతీయ బూర్జువా పార్టీలతో కలిసి ఐక్య ఉద్యమాలు నిర్మించాలన్న ఆలోచన ఆచరణకు నోచుకోలేదు. సరళీకరణ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా వారు ఉద్యమాల్లోకి వస్తారన్న మన అంచనా తప్పయ్యింది.

### ఎత్తుగడల పరిణామక్రమం

ఎమర్జెన్సీ అనంతరం 1977లో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో జనతా పార్టీతో కలిసి కాంగ్రెస్ గుత్తాధిపత్యాన్ని దెబ్బతీయగలిగాం. ఈ రాజకీయ నేపథ్యంలో 1978 జలంధర్‌లో జరిగిన 10వ మహాసభ అప్పటివరకూ అనుస రించిన ఎత్తుగడలను సమీక్షించి, కొత్త ఎత్తు గడలను నిర్ణయించింది. దాని ప్రకారం రెండు ప్రధాన బూర్జువా పక్షాలైన కాంగ్రెస్, జనతా పార్టీలకు ప్రత్యామ్నాయంగా వామపక్ష ప్రజా

“ 15వ మహాసభ నాటికే వామపక్ష ప్రజా తంత్ర సంఘటన తక్షణ రాజకీయ ప్రత్యామ్నాయంగా కాకుండా ప్రచారాంశం గానే మిగిలిపోయింది. ఆ తర్వాత ప్రతీ మహాసభ తీర్మానా ల్లోనూ వామపక్ష ప్రజాతంత్ర సంఘటన అనేది ప్రచారాంశంగా కొనసాగుతూ వచ్చింది. ఈ కాలంలో ఎత్తుగడలన్నీ ప్రధానంగా ఎన్నికల చుట్టూ తిరుగుతూ వచ్చినందున మన కృషి కూడా ప్రధానంగా పార్లమెంటరీ రంగానికే పరిమితమయ్యింది. ”




తంత్ర సంఘటనను నిర్మించాలని పిలుపు నిచ్చింది. ఈ సంఘటన బూర్జువా పార్టీల కార్యక్రమానికి భిన్నంగా ఉంటుంది. పార్టీ వ్యూహాత్మక కార్యక్రమమైన జనతా ప్రజాస్వామిక విప్లవ లక్ష్యాన్ని చేరుకోవడానికి తోడ్పడుతుంది. ఇది ఎన్నికల సంఘటన కాదు. ప్రజా ఉద్యమాల సంఘటన. 11వ మహాసభ ఈ సంఘటన కార్యక్రమానికి నిర్దిష్ట రూపం ఇచ్చింది. ఐతే ఈ అవగాహన అమలయ్యే తొలి దశలోనే ఆటంకాలు కూడా ఎదురయ్యాయి. 13వ మహా సభ నాటికి మతోన్మాద శక్తులు ముందుకు తోసుకొచ్చాయి. దాంతో ఆ మహాసభ వామపక్ష, ప్రజాతంత్ర, సెక్యులర్ శక్తుల ఐక్యతకు పిలుపు నిచ్చింది. దీని తర్వాత సెక్యులర్ పార్టీల ఐక్యత ముందుకొచ్చి, వామపక్ష ప్రజాతంత్ర శక్తుల ఐక్యత వెనక్కుపోయింది. 1996లో వామపక్షాల మద్దతుతో యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం ఏర్పడిన నేపథ్యంలో పార్టీ 15వ మహాసభ మూడో ఫ్రంట్‌కు పిలుపునిచ్చింది. 1998లో యునైటెడ్ ఫ్రంట్ విచ్ఛిన్నమయ్యాక 16వ మహాసభలో తృతీయ ప్రత్యామ్నాయం నినాదం తీసుకున్నాం. ఆ తర్వాత రాష్ట్రపతి ఎన్నికల్లో ములాయం అడ్డం తిరగడంతో ఆ ప్రయత్నం కూడా బెడిసి కొట్టింది. కేవలం ఎన్నికల కోసం ప్రత్యామ్నాం కాకుండా ఒక కార్యక్రమం ఆధారంగా మూడో ఫ్రంట్ నిర్మించాలని 17వ మహాసభ పిలుపు నిచ్చింది. దీన్ని నిర్మించాలంటే ఉమ్మడిగా ప్రజా ఉద్యమాలు నిర్వహించడమే మార్గమని 18వ మహాసభ భావించింది. ఐతే ఆచరణలో ఈ పోరాటాలకు కూడా సెక్యులర్ పార్టీలు కలిసి రాలేదు. తృతీయ ప్రత్యామ్నాయాన్ని ఎన్నికల ఎత్తుగడల నుండి వేరు చేసి చూడాలని 19వ మహాసభ చెప్పింది. ఈ క్రమంలో తృతీయ ప్రత్యామ్నాయం దాని తర్వాత తృతీయ ఫ్రంట్, ఆ తర్వాత సెక్యులర్ శక్తుల ఐక్యత ముందు కొచ్చి, వామపక్ష, ప్రజాతంత్ర సంఘటన నిర్మా ణం ప్రాధాన్యతా క్రమంలో మూడో స్థానానికి వెళ్లిపోయింది. వివిధ బూర్జువాపార్టీలతో ఎన్ని కల అవగాహన మొదటి ప్రాధాన్యతను సంతరించుకోగా, దాని తర్వాత స్థానం ఒక ఉమ్మడి కార్యక్రమం ఆధారంగా ప్రజా ఉద్యమాల ద్వారా మూడో ప్రత్యామ్నాయం నిర్మించాలన్న నినాదం చోటు చేసుకుంది. మూడో స్థానంలోకి వామపక్ష ప్రజాతంత్ర సంఘటన నెట్టబడింది. తిరిగి 20వ మహాసభ తృతయ ప్రత్యామ్నాయాన్ని వదిలేసి వామపక్ష ప్రజాతంత్ర సంఘటనకు పిలుపు నిచ్చింది. అయితే ఎన్నికల ఎత్తుగడలను దీన్నుం డి వేరు చేసి ప్రాంతీయ పార్టీలతో ఎన్నికల అవగాహనను ఇది కూడా కొనసాగించింది. రకరకాలుగా మలుపులు తిరుగుతూ వచ్చిన ఈ నినాదాలేవీ పార్టీ స్వతంత్ర పునాదిని పెంచు కోడానికి తోడ్పడలేదు. పైగా ప్రజా ఉద్యమాలను వెనక్కునెట్టాయి.

### ప్రచారాంశంగానే మిగిలిపోయిన వామపక్ష ప్రజాతంత్ర సంఘటన నిర్మాణం

15వ మహాసభ నాటికే వామపక్ష ప్రజా తంత్ర సంఘటన తక్షణ రాజకీయ ప్రత్యామ్నా యంగా కాకుండా ప్రచారాంశంగానే మిగిలిపో యింది. ఆ తర్వాత ప్రతీ మహాసభ తీర్మానా ల్లోనూ వామపక్ష ప్రజాతంత్ర సంఘటన అనేది ప్రచారాంశంగా కొనసాగుతూ వచ్చింది. ఈ కాలంలో ఎత్తుగడలన్నీ ప్రధానంగా ఎన్నికల చుట్టూ తిరుగుతూ వచ్చినందున మన కృషి కూడా ప్రధానంగా పార్లమెంటరీ రంగానికే పరిమితమయ్యింది. వర్గ, ప్రజా ఉద్యమాలకూ, దేశవ్యాప్త ఉద్యమాలకూ ప్రాధాన్యత తగ్గిపో

> **"సరళీకరణ ఆర్థిక విధానాల వ్యతిరేక పోరాటంలో ప్రాంతీయ బూర్జువా పార్టీలకు ఆసక్తి లేదు. అందువల్ల అవి కలిసిరావు, కలుపుకోలేము. ఈ పార్టీలు అధికారంలో ఉండే రాష్ట్రాలలో వారనుసరించే ప్రజా వ్యతిరేక విధానాలపై పెద్ద ఎత్తున ప్రజల్ని కదిలించి ఉద్యమాలు నిర్మించాలి. అదే సమయంలో లౌకికవాద పరిరక్షణ కోసం అనేక పార్టీలు, శక్తులు, వ్యక్తులతో అవసరమైతే విశాల వేదికను ఏర్పాటు చేయాలి. ఐతే ఈ వేదికలకు ఎన్నికలతో ఎలాంటి సంబంధమూ లేదు."**

యింది. సామాజిక అంశాలను తీసుకోవాలని అనుకున్నప్పటికీ అంతగా పట్టించుకోలేదు. కొత్త తరంలో పార్టీ రాజకీయ ప్రభావం బాగా తగ్గింది. పార్టీ నిర్మాణంపై కూడా దీని ప్రభావం తీవ్రంగానే పడింది. పార్లమెంటరీ పెడ ధోరణులు చాలా తీవ్రస్థాయిలో ప్రవేశించాయి. ప్రమాణాలు సడలిపోయి ప్రజలతో సంబంధాలు బలహీనపడ్డాయి. ఈ పరిస్థితుల్లో వామపక్ష ప్రజాతంత్ర సంఘటనను తక్షణ రాజకీయ ప్రత్యామ్నాయంగా చేపట్టాలని ఎత్తుగడల సమీక్ష మార్గనిర్దేశకత్వం చేసింది. దీనికి అనుగుణంగానే 21వ మహాసభ రాజకీయ తీర్మానం రూపుదిద్దుకుంది.

### బూర్జువా పార్టీలతో పొత్తులు తరిగిపోయిన ప్రజా పునాది

పార్టీ జాతీయ రాజకీయాల్లో కీలకపాత్ర పోషిస్తున్న తరుణంలో 15వ పార్టీ మహాసభ జరిగింది. అందులో పార్టీ దేశవ్యాప్తంగా విస్తరించకపోవడాన్ని గమనించింది. 1977కు ముందు నాడు ఉన్న పార్టీతో పోల్చుకుంటే కేరళ, బెంగాల్, త్రిపుర మినహా పెద్దగా ఎక్కడా కొత్తగా బలపడలేదు. పార్టీ పెరగకపోవడానికి ఎత్తుగడల్లో ఏమైనా లోపాలున్నాయో పరిశీలించాలని ఆ మహాసభ నిర్ణయించింది. అప్పుడు జాతీయ రాజకీయాల్లో వచ్చిన ఒడిదుడుకుల నేపథ్యంలో ఆ పనిని పార్టీ వెంటనే చేయలేకపోయింది. 17వ మహాసభలో బూర్జువా పార్టీలతో మన సంబంధాలు, పార్టీ పెరుగుదలపై వాటి ప్రభావాన్ని సమీక్షించింది. ప్రాంతీయ బూర్జువాపార్టీలు కూడా సరళీకరణ విధానాలను బలపర్చడాన్ని ఈ మహాసభ గుర్తించింది. విధానాలపై ఉమ్మడి అవగాహన, మార్కెట్‌లో ఉమ్మడి ప్రయోజనాలతో బడాబూర్జువావర్గంతో ప్రాంతీయ బూర్జువాలకు వైరుధ్యం తగ్గుముఖం పట్టింది. ఇలాంటి బూర్జువా పార్టీలతో ఎన్నికల పొత్తుల వల్ల ఆయా రాష్ట్రాల్లో నష్టపోయామని 17వ మహాసభ గుర్తించింది. ఆ పార్టీలతో వ్యవహరించేటప్పుడు మన ప్రత్యేకతను కాపాడుకోవాలనీ, వాటికి మనకూ మధ్య స్పష్టమైన గీత ఉండాలనీ మహాసభ ఆదేశించింది. ఆ తర్వాత కూడా బూర్జువా పార్టీలతో పొత్తులు కొనసాగించడం వల్ల ఆచరణలో దీనిని అమలు చేయడం సాధ్యం కాలేదు. 2014 ఎన్నికల వరకూ ఇది కొనసాగింది. అయితే ఈసారి చాలా రాష్ట్రాల్లో బూర్జువా ప్రాంతీయ పార్టీలు వామపక్షాలతో పొత్తులకు సిద్ధం కాలేదు. తరిగిపోతున్న ప్రజా పునాది దీనికి కారణం. ఈ మొత్తం అనుభవాలను పరిశీలించినప్పుడు ఆంధ్ర, తమిళనాడు సహా అనేక బలహీనమయిన రాష్ట్రాల్లో బూర్జువా పార్టీలతో పొత్తులు మనకు నష్టం చేశాయని అర్ధమవుతుంది. మన వెనకనున్న ప్రజా శ్రేణులు చాలా వరకూ అటు కొట్టుకుపోయాయి. మన కార్యకర్తలపై బూర్జువా పార్టీల ప్రభావం తీవ్రంగా పడింది. కొత్త రాజకీయ ఎత్తుగడల పంథా ఈ బలహీనతల నుండి బయట పడటానికి తోడ్పడుతుంది.

### లౌకికవాద పరిరక్షణ కోసం విశాల వేదికలు

ప్రస్తుత పరిస్థితుల్లో కాంగ్రెస్ పూర్తిగా ప్రజల్లో అప్రతిష్ట పాలయ్యింది. బాగా బలహీనపడిపోయింది. కాంగ్రెస్ వ్యతిరేకతను ఉపయోగించుకుని మోడీ నాయకత్వంలో బిజెపి అధికారాన్ని చేపట్టింది. గత 9 మాసాల బిజెపి పాలనను గమనిస్తే క్రమంగా వాళ్లు నియంతృత్వం దిశగా ప్రయాణం సాగిస్తున్నట్లు అర్ధమవుతోంది. అభివృద్ధి-మతోన్మాదం రెంటినీ జతకలిపి ముందుకు తీసుకెళ్లాలని ప్రయత్నిస్తున్నారు. మతోన్మాద వ్యతిరేక పోరాటాన్ని విడిగా చూడలేము. సరళీకరణ ఆర్థిక విధానాలతో అది గట్టిగా పెనవేసుకుపోయింది. ఈ ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా పోరాడకుండా మతోన్మాదాన్ని ప్రతిఘటించలేము. సరళీకరణ ఆర్థిక విధానాల వ్యతిరేక పోరాటంలో ప్రాంతీయ బూర్జువా పార్టీలకు ఆసక్తి లేదు. అందువల్ల అవి కలిసిరావు, కలుపుకోలేము. ఈ పార్టీలు అధికారంలో ఉండే రాష్ట్రాలలో వారనుసరించే ప్రజా వ్యతిరేక విధానాలపై పెద్ద ఎత్తున ప్రజల్ని కదిలించి ఉద్యమాలు నిర్మించాలి. అదే సమయంలో లౌకికవాద పరిరక్షణ కోసం అనేక పార్టీలు, శక్తులు, వ్యక్తులతో అవసరమైతే విశాల వేదికను ఏర్పాటు చేయాలి. ఐతే ఈ వేదికలకు ఎన్నికలతో ఎలాంటి సంబంధమూ లేదు. ఎన్నికల్లో కాంగ్రెస్‌తో ఎలాంటి అవగాహనా ఉండదు. జాతీయస్థాయిలో ప్రాంతీయ బూర్జువా పార్టీలతోనూ ఎలాంటి అవగాహన ఉండదు. అయితే రాష్ట్ర స్థాయిలో ఎక్కడైనా వామపక్ష ప్రజాతంత్ర సంఘటన, పార్టీని బలపర్చడానికి ఉపయోగపడుతుంది అనుకుంటే అలాంటి పార్టీలతో ఎన్నికల అవగాహన కుదుర్చుకోవచ్చు. అయితే వారు జాతీయ స్థాయిలో వామపక్ష ప్రజాతంత్ర సంఘటనలో భాగస్వాములు కారు.

### వామపక్ష ప్రజాతంత్ర సంఘటన నిర్మాణం

వామపక్ష ప్రజాతంత్ర సంఘటన నిర్మాణంలో ప్రధాన పాత్ర ప్రజా ఉద్యమాలది. ప్రజా ఉద్యమాల ద్వారానే ఈ సంఘటన నిర్మించడం సాధ్యం. ఈ సంఘటనలో వామపక్ష పార్టీలు ప్రధాన శక్తిగా ఉంటాయి. గతంలో నాలుగు పార్టీలకే పరిమితమైన వామపక్ష కూటమి ప్రస్తుతం సిపిఐ(ఎంఎల్-లిబరేషన్), ఎస్‌యుసిఐ(సి)తో కలిసి ఆరు పార్టీలకు చేరింది. రానున్న కాలంలో దీనిని మరింత విస్తృత పర్చుకోవాలి. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్, తెలంగాణాల్లో 10-11 వామపక్ష పార్టీలు కలిసి పనిచేస్తున్నాయి. మహారాష్ట్ర, బీహార్, జార్ఖండ్, ఢిల్లీ తదితర చోట్ల వామపక్ష పార్టీల మధ్య అవగాహన ఉంది. ఇతర రాష్ట్రాలు కూడా దీనిని మరింత బలపర్చుకోవాలి. ఈ పార్టీలతో పాటు వాటి నాయకత్వంలో ఉన్న ప్రజా సంఘాలు ఈ సంఘటనలో ముఖ్య భూమిక పోషిస్తాయి. పాత సోషలిస్టులు అనేక పార్టీల్లో చీలి ఉన్నారు. అలాంటి వారందరినీ కలుపుకుని రావాలి. రానున్న కాలంలో జాతీయస్థాయిలో వివిధ పార్టీల మధ్య సమీకరణలు మారచ్చు. కలయికలు, విడిపోవడాలు ఉండొచ్చు. కొత్త పార్టీలు పుట్టుకురావచ్చు. జరిగే పరిణామాలకు అనుగుణంగా మన ఎత్తుగడలు కూడా మార్చుకునే విధంగా పట్టువిడుపులతో ఉండాలి. వివిధ వర్గాలు, తరగతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు వాటి పట్ల మార్క్సిస్టు పార్టీ అవగాహన రాజకీయ ముసాయిదా తీర్మానంలో పొందుపరచబడి ఉన్నాయి. కార్యకర్తలు ఈ రెండు పత్రాలనూ లోతుగా అధ్యయనం చేయాలి. వాటిని అర్ధం చేసుకోవడానికి వీలుగా పార్టీ కార్యక్రమంతో పాటు పదో మహాసభ నుండి 20వ మహాసభ వరకూ రాజకీయ, నిర్మాణ నివేదికలను అధ్యయనం చేయాలి. దీనికి ఆచరణలో మన అనుభవాలను జోడించి ఆలోచించాలి. వాటి ఆధారంగా ఈ తీర్మానాలను మరింత పరిపుష్టం చేయాల్సిన బాధ్యత పార్టీ శ్రేణులపై ఉంది. ●

# పెట్టుబడి సేవలో రాజ్యం

**ప్రభాత్ పట్నాయక్**

వర్గాలకు అతీతంగా ఉన్నట్లు కనిపించే రాజ్యం నయా–ఉదారవాద విధానాల అమలు కాలంలో ఇతర వర్గాలకు నష్టం కలిగిస్తూ, బడా పెట్టుబడిదారుల ప్రయోజనాలను మాత్రమే కాపాడటానికీ, ముందుకు తీసుకుపోవటానికీ కృషి చేస్తుంది.

భారతదేశపు తాజా ఆర్థికాభివృద్ధి అనుభవం ఒక చిక్కుముడిలా కనిపిస్తుంది. ఈ సంవత్సరం ఆర్థికాభివృద్ధి తగ్గింది. దీనికి ముందు సంవత్సరాలలో అసాధారణ అధిక జి.డి.పి. పెరుగుదల సాధించింది. దాంతో దేశం "ఎదురులేని ఆర్థిక శక్తిగా ఆవిర్భవిస్తున్నదనే" ప్రచారం పెద్ద ఎత్తున జరిగింది. ఇదే కాలంలో దేశంలో నికర దారిద్ర్యం కూడా పెరిగింది. రోజువారీ తలసరి తీసుకుంటున్న ఆహారం ఎంత శక్తినిస్తుందన్న ప్రాతిపదికపై భారతదేశంలో "దారిద్ర్యాన్ని" నిర్ణయిస్తున్నారు. పట్టణాలలో రోజుకు తలసరి 2100 కేలరీల శక్తినిచ్చే ఆహారం తీసుకోలేని వారిని, గ్రామాలలో రోజుకు తలసరి 2200 కేలరీల శక్తినిచ్చే ఆహారం తీసుకోలేని వారిని (మొదట్లో 2400 కేలరీలుగా నిర్ణయించి తర్వాత తగ్గించారు.) "దరిద్రులు"గా లెక్కిస్తున్నారు. ఈ ప్రాతిపదికన చూస్తే పట్టణాలలో 1993–94, 2004–05, 2009–10 సంవత్సరాలలో దరిద్రులు వరుస క్రమంలో 57, 65, 73 శాతంగా ఉన్నారు. గ్రామీణ ప్రాంతంలో 59, 70, 76 శాతంగా ఉన్నారు..(ఆయా సంవత్సరాలలో నేషనల్ శాంపుల్ సర్వే రిపోర్టులలోని తలసరి తీసుకుంటున్న పోషకాహారం లెక్కల ప్రాతిపదికగా ఉత్సా పట్నాయక్ విశ్లేషణ చేశారు.) ఆ విధంగా జి.డి.పి. పెరుగుదల అత్యధికంగా ఉన్నకాలంలోనే నికర దారిద్ర్యం సుమారు ఎనిమిది శాతం పెరిగింది.

దారిద్ర్యం "వేగంగా" తగ్గుతున్నదని ప్రణాళికా సంఘం నిరంతరం చేస్తున్న వాదనల రీత్యా చూస్తే ఇది ఆశ్చర్యం అనిపించవచ్చు. ఈ వాదనలు తలసరి రోజువారీ ఖర్చు లెక్కల ఆధారంగా రూపొందించబడ్డ "దారిద్ర్య రేఖ"పై ఆధారపడి నిర్ణయించబడినాయి. తలసరి రోజువారీ ఎన్ని కేలరీల ఆహారం అవసరం అనేది 1973–74లో నిర్ణయించారు. ఆనాడు జీవన వ్యయసూచిక ఆధారంగా నిర్ణయించిన తలసరి ఖర్చు ప్రాతిపదికగా, ఆ ఖర్చును పునర్నిర్ణయిస్తూ ఈ లెక్కలను రూపొందిస్తున్నారు. (తలసరి తీసుకుంటున్న కేలరీలకు సంబంధించిన ప్రస్తుత లెక్కలు లభిస్తున్నపుడు ఈ పద్ధతి అనవసరం.) "దారిద్ర్యరేఖ"కు సంబంధించి అతి తక్కువగా, హాస్యాస్పదంగా నిర్ణయించిన ఈ లెక్కల బండారం ఇపుడందరికీ అర్థమవుతున్నది.

ఒకే సమయంలో అధిక ఆర్థిక పెరుగుదల, నికర దారిద్ర్యం పెరుగుదలకు సంబంధించిన ఈ చిక్కు సమస్యను ఎలా అర్థం చేసుకోవాలి? రాజ్యం నుండి, చిన్న ఉత్పత్తిదారుల నుండి, సామాజిక ఆస్తుల నుండి కొద్దిమందిగా ఉన్న బడా పెట్టుబడిదారులకూ, ద్రవ్య వ్యాపారులకూ ఉచితంగా సంపదను తరలించటంపై ఈ అభివృద్ధి క్రమం ఆధారపడి ఉన్నది. ఈ తరలించటానికి "అప్పగించటం", "ప్రవహించటం" అనే కోణాలున్నాయి. రాజ్యం బడా పెట్టుబడిదారులకు, ద్రవ్య వ్యాపారులకు ఆస్తులను బదిలీ చేసేటపుడు మొదటిది జరుగుతుంది. చిన్న, సన్నకారు ఉత్పత్తిదారుల ఆస్తులను, ఆదాయాలను కాజేస్తూ బడా పెట్టుబడిదారులు, ద్రవ్యవ్యాపారులు వారి ఆదాయాలను పెంచుకొంటున్నప్పుడు రెండవది జరుగుతుంది. ఈ బదిలీ చేయటం తరచుగా ఆర్థిక లావాదేవీల చాటున మరుగు పరచబడుతుంది. రాజ్యం 100 రూపాయల విలువైన ఆస్తిని తనకిష్టమైన పెట్టుబడిదారునికి 60 రూపాయలకే "అమ్మితే" అప్పుడు ఈ లావాదేవీలో పైకి కనిపించకుండా ఉచితంగా 40 రూపాయలు ఆ పెట్టుబడిదారునికి బదిలీ చేయబడతాయి.

### పురాతన పెట్టుబడి సంచయం

''ఆస్తులు'' అయినా, లేక "లాభాలు"అయినా, ఈ విధమైన సంపద బదిలీని కారల్ మార్క్స్ "పురాతన పెట్టుబడి సంచయం" అని పిలిచాడు. మొట్టమొదట పెట్టుబడిదారీ విధానం ఈ విధంగానే ఉనికిలోకి వచ్చిందని



రచయిత ప్రఖ్యాత మార్క్సిస్టు ఆర్థిక శాస్త్రవేత్త

మార్క్స్ చెప్పాడు. ఈ విధమైన పురాతన పెట్టుబడి సంచయం పెట్టుబడిదారీ విధానం ప్రారంభానికి ముందు కాలానికే పరిమితం కాలేదు. తన చరిత్ర పొడవునా ఇదే విధానాన్ని కొనసాగిస్తూ (వలస పాలన కాలంలో సంపద "ప్రవాహం" ఇందుకు ఒక ముఖ్యమైన ఉదాహరణ) చిన్న ఉత్పత్తిదారులను నాశనం చేస్తున్నది. పురాతన పెట్టుబడి సంచయానికి బలైపోయిన రైతులు, చేతివృత్తిదారులు, నిపుణులు, మత్స్యకారులు, చిన్న వ్యాపారులు తదితర చిన్న, సన్నకారు ఉత్పత్తిదారులందరినీ సంఘటిత రంగమైన ప్రభుత్వరంగంలోకి కానీ, ప్రైవేటు రంగంలోకి కానీ కార్మికులుగా ఇముడ్చుకున్నట్లయితే నికర దారిద్ర్యంలో ఏమాత్రం పెరుగుదల ఉండేది కాదు. కానీ భారతదేశంలో జి.డి.పి. పెరుగుదల అత్యధికంగా ఉన్నప్పుడు కూడా సంఘటితరంగంలో "ఉద్యోగాలు లేని" (జాబ్‌లెస్) పెరుగుదల మాత్రమే ఉన్నట్లు స్పష్టమౌతున్నది. ఫలితంగా పురాతన సంపద సమీకరణకు బలైపోయినవారు అత్యంత తక్కువ ఆదాయాలతో వారి సాంప్రదాయకమైన వృత్తులలోనే కొనసాగుతున్నారు. లేదా పట్టణాలకు వెళ్ళి అసంఘటితరంగంగా పిలువబడుతున్న, విస్తారంగా ఉన్న నిరుద్యోగులు, అతి తక్కువ వేతనాలకు పని చేసే కార్మికులు, తాత్కాలిక కార్మికులు, "ప్రచ్ఛన్న" నిరుద్యోగులు, పాక్షిక ఉద్యోగులు తదితరులందరూ పనుల కోసం ఎగబడేచోట, వారు గతంలో సంపాదించుకుంటున్న మొత్తం కన్నా అతితక్కువ వేతనాలకు పని చేయాల్సి వస్తున్నది. అందువల్ల ఆర్థిక పెరుగుదల క్రమంతో పాటుగా నికర దారిద్ర్యం పెరుగుదల కూడా ఈ అభివృద్ధి క్రమాన్ని అనుసరించి ఉంటుంది.

అదే సమయంలో నిరుద్యోగ శ్రామికులు

> **"వాస్తవానికి దేశాన్ని కుదిపేసిన "కుంభకోణాలు," 2జి స్పెక్ట్రం, బొగ్గు గనుల కేటాయింపు కుంభకోణాలు పురాతన పెట్టుబడి సంచయానికి ఉదాహరణలు మాత్రమే. ఆ తరువాత అవినీతి కేసులపై దేశంలో పెద్ద ఆందోళన జరిగింది. పురాతన పెట్టుబడి సంచయం క్రమంతో "అవినీతి" కలిసి ఉంటుంది. దేశాన్ని కంపింప చేసిన రైతుల ఆత్మహత్యల ఉధృతి ఈ పురాతన పెట్టుబడి సంచయం ఫలితమే."**

(లేబర్ రిజర్వు) పెరుగుతుండటం సంఘటిత రంగంలోని (అంతర్జాతీయ కార్మిక సంస్థ చెప్పిన "గౌరవప్రదమైన పనులు" చేసే వారిని మినహాయించి) కార్మికుల బేరసారాల శక్తిని తగ్గించి, వారి వేతనాలు పెరగకుండా చేస్తుంది. (తగ్గవచ్చుకూడా.) కార్మికుల ఉత్పాదకత పెరుగుతున్నందున ఉత్పత్తిలో మిగులు పెరిగి, ఆదాయ అసమానతలు మరింత పెరగటానికి ఇది దారితీస్తుంది.

ఈ అంశాలన్నీ సమకాలీన భారతదేశంలో స్పష్టంగా కనిపిస్తున్నాయి. వాస్తవానికి దేశాన్ని కుదిపేసిన "కుంభకోణాలు," 2జి స్పెక్ట్రం, బొగ్గు గనుల కేటాయింపు కుంభకోణాలు పురాతన పెట్టుబడి సంచయానికి ఉదాహరణలు మాత్రమే. ఆ తరువాత అవినీతి కేసులపె దేశంలో పెద్ద ఆందోళన జరిగింది. పురాతన పెట్టుబడి సంచయం క్రమంతో "అవినీతి" కలిసి ఉంటుంది. దేశాన్ని కంపింప చేసిన రైతుల ఆత్మహత్యల ఉధృతి ఈ పురాతన పెట్టుబడి సంచయం ఫలితమే. ఈ విధానాలకు ప్రధానంగా బలవుతున్న రైతాంగం ఎదుర్కొంటున్న విపత్తును, నిరాశానిస్పృహలను ఈ ఆత్మహత్యలు వ్యక్తం చేస్తున్నాయి.

పెట్టుబడిదారీ విధానం పురాతన పెట్టుబడి సంచయం ద్వారా తన చుట్టూ ఉన్న చిన్న, సన్నకారు ఉత్పత్తిదారులను దోపిడీ చేయటానికి రాజ్యాన్ని నిరంతరం వినియోగించుకుంటుంది. ఉదాహరణకు మార్కెట్లో అసమానమైన మారకం ద్వారా పెట్టుబడి సంచయం జరుగుతున్నప్పుడు పెట్టుబడిదారీ రాజ్యం మద్దత్తుతో ఈ క్రమం నిరంతరాయంగా జరిగిపోతుంటుంది. రాజ్యంచిన్న, సన్నకారు ఉత్పత్తిదారులను మార్కెట్‌కు లాగి, పెట్టుబడిదారీ రంగంతో మార్కెట్ సంబంధాలు ఏర్పరచుకొనేలా చేయటం ద్వారా ఈ క్రమం కొనసాగేలా చేస్తుంది. (వలస పాలనా కాలంలోని పన్నుల విధానం పురాతన పెట్టుబడి సంచయానికి ఒక మార్గం. అది రైతాంగాన్ని అంతర్జాతీయ పెట్టుబడిదారీ విధానంతో మార్కెట్ సంబంధాలలోకి లాగి, పురాతన పెట్టుబడి సంచయంలోని ఇతర పద్ధతులకు తేలికగా లొంగిపోయేలా చేసింది.) భారతదేశ రాజ్యం యొక్క స్వభావంలో వచ్చిన మార్పులలో మనం గమనించాల్సిన అతి ముఖ్యమైన అంశాలలో ఇది ఒకటి.

### "జాతీయ" పెట్టుబడిదారి విధానం

ఉదారవాద విధానాల అమలుకు ముందు కాలంలో పురాతన పెట్టుబడి సంచయం వేగం పూర్తిగా తగ్గక పోయినప్పటికీ, కొంతమేరకు అదుపులో ఉంచారు. తన విధానాల ద్వారా రాజ్యం రైతాంగానికీ, వ్యవసాయరంగానికీ మద్దతునిచ్చింది. వ్యవసాయోత్పత్తుల దిగుమతులపై సుంకాలను విధించటం ద్వారా రైతాంగాన్ని అంతర్జాతీయ మార్కెట్ ధరల ఒడిదుడుకుల నుండి కాపాడటమే కాకుండా, వాణిజ్యంపై పరిమాణాత్మక ఆంక్షలను కూడా విధించి, రైతాంగాన్ని రక్షించటానికి చర్యలు తీసుకుంది. వ్యవసాయ సేవల విస్తరణ వ్యవస్థను ఏర్పాటు చేసింది. వ్యవసాయోపకరణాలకూ, రుణాలకు సబ్సిడీ ఇచ్చింది. (బ్యాంకుల జాతీయకరణ తర్వాత) ముందుగా గిట్టుబాటు ధరలను ప్రకటించి, కొన్ని పంటలను కొనుగోలు చేసే వ్యవస్థను ఏర్పాటు చేసింది. నీటిపారుదల, గ్రామీణ మౌలిక సదుపాయాల రంగాలలో పెట్టుబడులు పెట్టింది. విత్తనాలను, వ్యవసాయ పద్ధతులను అభివృద్ధి చేయటం కోసం ప్రభుత్వ పరిశోధనా కేంద్రాలను ఏర్పాటు చేసింది. దీని ఫలితంగానే అధిక దిగుబడులనిచ్చే విత్తనాలు రూపొందాయి. ఈ విధానాల ఫలితాలు రైతాంగంలోని అన్ని తరగతుల మధ్య సమానంగా పంపిణీ కాలేదు. పెట్టుబడిదారీ వ్యవసాయానికి ఆద్యులైన భూస్వాములు, ధనికరైతులు ఎక్కువ ప్రయోజనాన్ని పొందారు. ఈ వ్యవసాయ విధానం బడా కార్పొరేట్, బహుళజాతి సంస్థలు చెపుతున్న వ్యవసాయానికి భిన్నమైనదే కాకుండా, దానికి ప్రత్యామ్నాయంగా కూడా పనిచేసింది. ఇదే విధంగా చేనేతరంగంలో కూడా చేనేత కార్మికులు వృత్తులు కోల్పోకుండా "రిజర్వేషన్లు" కల్పించారు. చిన్న ఉత్పత్తిదారులను బడా పెట్టుబడి మింగివేయకుండా కాపాడటం కోసం తీసుకున్న అనేకమైన చర్యలు "జాతీయ" పెట్టుబడిదారీ విధానాన్ని అభివృద్ధి చేయటానికి ఉద్దేశించినవి. సామ్రాజ్యవాద పెట్టుబడి నుండి తగినంత స్వేచ్ఛగా వ్యవహరించటం, ప్రభుత్వ రంగానికి ప్రధానపాత్ర కల్పించటం, ముఖ్యంగా దేశీయ బడా పెట్టుబడిదారులు ప్రవేశించటానికి ఇష్టపడని రంగాలలో ప్రభుత్వ రంగాన్ని అభివృద్ధి చేయటంపై కేంద్రీకరించారు. ఈ మొత్తం ప్రణాళిక వలసవాద వ్యతిరేక పోరాటపు వారసత్వం. 30వ దశకంలో వచ్చిన మహా సంక్షోభం వల్ల రుణభారం, దుర్భరమైన పరిస్థితులను ఎదుర్కొంటున్నప్పుడు రైతాంగం జాతీయోద్యమాన్ని బలపరచటానికి ముందుకు వచ్చారు. ఫలితంగా 1930వ దశాబ్దంలో జాతీయోద్యమం అత్యంత వేగంగా అభివృద్ధి చెందింది. (దీనికి 1937 అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ విజయం స్పష్టమైన ఉదాహరణ) ఈ మద్దతుకు బదులుగా వలస పాలనలో రైతాంగం ఎదుర్కొంటున్న దురవస్థలనూ, ప్రపంచ మార్కెట్‌లోని ధరల ఒడిదుడుకులనూ స్వతంత్ర భారతదేశంలో ఎదుర్కోవాల్సిన అవసరం ఉండదని జాతీయోద్యమం రైతాంగానికి వాగ్దానం చేసింది. వలస పాలకులు విధించిన ఆంక్షలు దేశీయ బూర్జువావర్గానికి తగిన స్థానాన్ని నిరాకరించిన పరిస్థితుల్లో, సామ్రాజ్యవాద పెట్టుబడి నుండి తగినంత స్వేచ్ఛతో కూడిన "జాతీయ" పెట్టుబడిదారీ విధానాన్ని నిర్మించాలని కోరుకున్నారు. చిన్న ఉత్పత్తిదారులకు రక్షణ కల్పిస్తానని జాతీయోద్యమం చేసిన వాగ్దానాన్ని నెరవేర్చాలంటే వ్యవసాయం అభివృద్ధి చెందుతూ, ప్రజలందరికీ ఆహారధాన్యాలను సరఫరా చేయగలిగి ఉండాలి. ప్రభుత్వానికి సామాజికంగా విస్తృతమైన ప్రజానీకం మద్దతు ఉండాలి. అలా ఉంటేనే ప్రభుత్వం నిలబడగలుగుతుంది. వలస పాలన తర్వాతా, ఉదారవాద విధానాల ప్రారంభానికి ముందూ రాజ్యం పెట్టుబడిదారీ అభివృద్ధి మార్గంలోనే ప్రయాణం చేస్తున్నప్పటికీ, వర్గాలకు అతీతంగా ఉన్నట్లుగా కనిపిస్తూ, వారిమధ్య మధ్యవర్తిగా వ్యవహరిస్తూ, పెట్టుబడిదారుల అధిక దోపిడి, పీడన నుండి కార్మికులకు కొంతమేరకు రక్షణ కల్పిస్తుండేది. పెట్టుబడిదారీ అభివృద్ధి మార్గాన్నే అనుసరిస్తున్నప్పటికీ, రాజ్యం పూర్తిగా పెట్టుబడిదారుల ప్రయోజనాలతోనే మమేకం కాకుండా ఉన్న దశను, భారతదేశం "పెట్టుబడిదారీ యేతర" అభివృద్ధి మార్గాన్ని అనుసరిస్తున్నదని కొంత

మంది భావించారు. భారతదేశం సోషలిస్టు అభివృద్ధి మార్గంలో పయనిస్తున్నదని మరికొందరు భావించారు. ఈ విధమైన చర్చలు సామ్రాజ్యవాదం నుండి తగినంత స్వేచ్ఛతో (పెట్టుబడిదారీ) అభివృద్ధి మార్గంలో పయనిస్తున్న రాజ్యం, ఉదారవాద విధానాల ప్రారంభానికి ముందు తగినంత స్వేచ్ఛతో ఉన్నదనే విషయాన్ని రుజువు చేస్తున్నది. రాజ్యం బూర్జువా భూస్వామ్య వర్గాల రాజ్యమే అయినప్పటికీ అది పూర్తిగా వారి ప్రయోజనాలతో మమేకమై పని చేయలేదు.

### ఉదారవాద విధానాలు

"ఉదారవాద" విధానాలు ఈ పరిస్థితిని మార్చివేశాయి. మారిన ప్రపంచ పరిస్థితులు "ఉదారవాద" విధానాలను ప్రథమ స్థానానికి తెచ్చాయి. స్వతంత్రంగా పెట్టుబడిదారీ విధానాన్ని అభివృద్ధి చేసుకోవటానికి శక్తివంతమైన మద్దతు ఇస్తున్న సోవియట్ యూనియన్ కూలిపోయింది. స్వతంత్రమైన పెట్టుబడిదారీ అభివృద్ధి వ్యూహం (డిరిజిస్టే స్ట్రాటజి) అనుసరిస్తున్న జాతీయ రాజ్యాలు, కీనీషియన్ డిమాండ్ మేనేజ్‌మెంట్ విధానాన్ని అనుసరిస్తున్న అభివృద్ధి చెందిన దేశాలలో సైతం అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడులపై ఆంక్షలను కొనసాగించటం, స్వతంత్రంగా పెట్టుబడిదారీ అభివృద్ధి వ్యూహాన్ని అమలు చేయటం అసంభవంగా మారింది. తమ దేశాలలోకి వస్తున్న విదేశీ పెట్టుబడులపై ఒక దేశం తర్వాత మరో దేశంలో ఆంక్షలను తొలగించాయి. అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి శక్తివంతం అవుతున్నకొద్దీ ద్రవ్య పెట్టుబడి స్వేచ్ఛా రాకపోకలకు తమ ఆర్థికవ్యవస్థలను తెరచి ఉంచాలనే ఒత్తిడిని తట్టుకోవటం జాతీయ ప్రభుత్వాలకు కష్టంగా మారుతున్నది. స్వతంత్ర ఆర్థికాభివృద్ధి వ్యూహం నుండి అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడికి అత్యంత ఇష్టమైన ఉదారవాద విధానాలకు మార్పు చెందటానికి భారతదేశంలో స్వతంత్ర ఆర్థికాభివృద్ధి వ్యూహం ఎదుర్కొన్న ప్రతిష్ఠంభన కూడా అదనపు కారణంగా పని చేసింది. దీనితో భారతదేశంలో తగినంత స్వేచ్ఛగా పెట్టుబడిదారీ విధానాన్ని నిర్మించాలనే ప్రణాళికను విరమించుకొని, దేశంలోని బడా పెట్టుబడిదారులు అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడితో మమేకం అయ్యారు. ఫలితంగా ధనిక రైతాంగంతో పాటు మొత్తం రైతాంగం, చిన్న ఉత్పత్తిదారుల ప్రయోజనాలకు, బడా పెట్టుబడిదారుల ప్రయోజనాలకు మధ్య తీవ్రమైన వైరుధ్యం ఏర్పడింది.

గతంలో రాజ్యం వర్గాలకు అతీతమైనదిగా కనిపిస్తూ, కేవలం పెట్టుబడి యొక్క ప్రయోజనాల కోసం మాత్రమేకాక, ఇతర వర్గాల కోసం కూడా పని చేస్తున్నట్లు కనిపించేది. ఇప్పుడు అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడితో మమేకమవుతున్న, దేశంలోని ఇతర వర్గాల ప్రయోజనాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న బడా పెట్టుబడి ప్రయోజనాల కోసం, దాని అభివృద్ధి కోసం మాత్రమే పని చేయటం నయా–ఉదారవాద రాజ్యపు స్పష్టమైన లక్ష్యంగా ఉన్నది. బహుళ ఉత్పత్తుల చిల్లర వ్యాపారంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి ప్రవేశం కోసం నిరంతర ప్రయత్నం, బీమారంగంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల ప్రవేశం కోసం పట్టువిడవకుండా ప్రయత్నం చేయటం, తాత్కాలికంగా పక్కన పెట్టినా జాతీయ బ్యాంకులను ప్రైవేటీకరించే ప్రయత్నం తదితరాలన్నీ ఈ నూతన ధోరణికి స్పష్టమైన ఉదాహరణలుగా ఉన్నాయి. బొగ్గు గనులను కొద్దిమంది బడా ప్రైవేటు పెట్టుబడిదారులకు ఉచితంగా కేటాయించటం ఈ విధానం "సాధించిన" వాటిలో ఒకటి.

మరోవైపున చిన్న ఉత్పత్తిదారులకు ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని విధాలైన రక్షణలను ఉపసంహరించటం ద్వారా బడా పెట్టుబడి చిన్నపెట్టుబడులను కబళించటాన్ని రాజ్యం ప్రోత్సహిస్తున్నది. పురాతన పెట్టుబడి సంచయానికి ఉన్న ఆటంకాలన్నింటినీ తొలగించటం జరుగుతున్నది. వ్యవసాయోత్పత్తుల దిగుమతులపై ఉన్న పరిమాణాత్మక ఆంక్షలను తొలగిస్తూ, సుంకాల రక్షణను ఉపయోగించకుండా దేశీయ ధరలను అంతర్జాతీయ ధరలతో మరింతగా ముడిపెడుతున్నది. (ప్రస్తుత ప్రభుత్వం రైతులకు కొన్ని రక్షణలను కల్పిస్తున్నప్పుడు కూడా ఇది జరుగుతున్నది.) వ్యవసాయోపకరణాలపై సబ్సిడీలను తగ్గించటం ద్వారా పెట్టుబడుల భారాన్ని పెంచుతున్నది. సంస్థాగత రుణాలను తగ్గిస్తూ (ఇతర అవసరాలకు ఇచ్చిన వాటిని "వ్యవసాయం" కోసం ఇచ్చిన రుణాలుగా చెబుతున్నారు.) రైతులు కొత్తరకం వడ్డీ వ్యాపారులపై ఆధారపడే విధానాలను అమలు చేస్తున్నది. వ్యవసాయ విస్తరణ సేవలు నిర్వీర్యం కావటంతో బహుళజాతి విత్తన, రసాయన, వ్యవసాయ వాణిజ్య సంస్థలు రైతులతో ప్రత్యక్ష సంబంధాలను ఏర్పాటు చేసుకుంటున్నాయి. ప్రభుత్వ పరిశోధనాభివృద్ధి కార్యక్రమాలు తగ్గిపోతున్నాయి. 2008లో పెరిగిన ద్రవ్యోల్బణం వలన తిరిగి సేకరణను పెంచటం తప్పనిసరి అయ్యేవరకు ఆహారధాన్యాల సేకరణను కూడా రద్దు చేయటానికి పూనుకున్నారు. ఇటువంటి ప్రతికూలమైన విధానాల వలన వ్యవసాయం లాభసాటి కాకుండాపోతున్నదని ఎక్కువ మంది గుర్తి స్తున్నారు.

ఆస్తులు, వనరులను చిన్న, సన్నకారు ఉత్పత్తిదారుల నుండి బడా పెట్టుబడిదారులకూ, బహుళజాతి కంపెనీలకూ తరలించే పురాతన పెట్టుబడి సంచయంతో పాటు, ఆస్తులను వినియోగించే విధానంలో, ముఖ్యంగా భూమిని వినియోగించే విధానంలో మార్పులు వస్తు న్నాయి.

సుమారుగా రెండు కోట్ల ఎకరాల భూమిని ఆహారధాన్యాల ఉత్పత్తి నుండి ఇతర పంటలకు మళ్ళించిన ఫలితంగా తలసరి ఆహారధాన్యాల ఉత్పత్తి తగ్గటం ఇందుకు స్పష్టమైన ఉదాహరణ. ఇది దేశంలో పోషకాహార లభ్యత సమస్యను తీవ్రం చేస్తున్నది. ముఖ్యంగా ప్రజల వద్ద తగినంత కొనుగోలు శక్తిలేకపోవటం, ప్రభుత్వం వద్ద పోగుపడిన ఆహారధాన్యాల నిల్వలను ఎగుమతి చేయటానికి పూనుకోవటంతో ఈ సమస్య మరింత తీవ్రం అవుతున్నది.

పెట్టుబడి, రాజ్యం మధ్య సంబంధాల స్వభావంలో వచ్చిన ఈ మార్పు, పెట్టుబడి ప్రయోజనాలతో రాజ్యం మరింత సన్నిహితంగా మమేకం కావటం అనేది నయా–ఉదారవాద విధానాలలో అతి ముఖ్యమైన అంశం. ఈ విధంగా మారిన రాజ్యం యొక్క స్వభావం వలన పురాతన పెట్టుబడి సమీకరణ పెరగటం, అందువలన అధిక ఆర్థిక పెరుగుదలతో పాటు నికర దారిద్ర్యం కూడా పెరుగుతున్నది. దీని నుండి ఆర్థిక పెరుగుదల రేటు తగ్గితే దారిద్ర్య విస్తరణ తగ్గుతుందనే నిర్ధారణకు రాకూడదు. పురాతన పెట్టుబడి సంచయం వివిధ పద్ధతులలో జరుగుతున్నపుడు ఆర్థిక పెరుగుదల ఉన్నా, పెరుగుదల లేకున్నా, పెరుగుదల స్థంభించినా, చిన్న, సన్నకారు ఉత్పత్తిదారులు, కార్మికవర్గంతో పాటు, నయా–ఉదారవాద విధానాల వలన ప్రయోజనం పొందిన మధ్య తరగతి కూడా ఇప్పుడు కష్టాలను ఎదుర్కొంటారు.

మధ్యతరగతి ప్రజానీకానికి ఉద్యోగావకాశాలు తగ్గిపోవటం ద్వారా ఇది ఇప్పటికే జరుగుతున్నది. ప్రస్తుత పెట్టుబడిదారీ సంక్షోభం తీవ్రమౌతున్న స్థితిలో నయా–ఉదారవాద విధానాల చట్రంలో భారతదేశం అధిక ఆర్థిక పెరుగుదల క్రమంలోకి తిరిగిరావటం అసంభవంగా కనిపిస్తున్నది. శ్రామిక ప్రజలందరూ తీవ్రమైన దుష్పరిణామాలను ఎదుర్కోవాల్సిన పరిస్థితి వస్తున్నది. ఇది రాజ్యం యొక్క వర్గ అవగాహనను మార్చటానికి ప్రాతిపదికను ఏర్పరచి, ప్రస్తుత నయా–ఉదారవాద ఆర్థికాభివృద్ధి క్రమం కన్నా మరింత సార్వజనీనమైన, మానవత్వంతో కూడిన అభివృద్ధి క్రమం రూపొందటానికి దారితీస్తుంది.

**(అనువాదం : ఎ.కోటిరెడ్డి)**

రాజకీయ విశ్లేషణ

# కేంద్రం బాటలోనే టిఆర్ఎస్ పాలన



రచయిత భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) కేంద్ర కమిటీ సభ్యులు

**ఎస్. వీరయ్య**

"వెంకయ్యనాయుడు కేంద్రమంత్రి కావడం తెలుగువారి అదృష్టం".

"దత్తాత్రేయ కేంద్రమంత్రివర్గంలో తెలంగాణ ప్రతినిధిగా వ్యవహరిస్తారు."

"విద్యాసాగర్‌రావు మహారాష్ట్ర గవర్నర్ కావడం మనకు గర్వకారణం."

ఈ మాటలన్నది ఎవరో కాదు. సాక్షాత్తు తెలంగాణ ముఖ్యమంత్రి శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖరరావు. ఎన్నికలకు ముందు కరీంనగర్‌లో చేసిన విధాన ప్రకటనలో కాంగ్రెస్, బిజేపీలకు వ్యతిరేకంగా ఉంటామని చెప్పారు. టిఆర్ఎస్ నాయకులే అనేక సార్లు ఇద్దరు నాయుళ్ళు (చంద్రబాబునాయుడు, వెంకయ్యనాయుడు) తెలంగాణకు అన్యాయం చేసారని పదేపదే ఆరోపించారు. "ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ బిల్లు" రాజ్యసభలో ఆమోదం పొందిన సందర్భంగా వెంకయ్యనాయుడు పాత్ర గురించి తీవ్రంగా ధ్వజమెత్తారు. వీటన్నింటికీ పూర్తి భిన్నంగా ఇప్పుడు వ్యవహరించడంలో ఆంతర్యమేమిటి?

హైదరాబాదు శాంతిభద్రతల విషయంలో మినహా, మరే సందర్భంలోనూ కేంద్ర ప్రభుత్వం పట్ల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విమర్శనాత్మకంగా వ్యవహరించలేదు. క్రమంగా మెత్తబడుతూ వచ్చింది. కేంద్రంతో సహకార ధోరణి అనుసరిస్తామన్నారు. కేంద్రం నుండి నిధులు రావాలంటే సహకరించాలన్నారు. ఈ మధ్య మరో అడుగు ముందుకేసి కేంద్రంతో సహకరించడమే చాలదనీ, కేంద్రమంత్రివర్గంలో చేరితేనే నిధులు వస్తాయనీ మీడియాకు లీకులు వదిలారు. ఇవన్నీ ఆషామాషీగా తీసుకోవాల్సిన విషయాలు కావు. రాజ్యాంగానికి సంబంధించిన విషయాలు. రాజకీయ ప్రాధాన్యత కలిగిన విషయాలు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాజ్యాంగ బద్ధంగానే పరస్పరం సహకరించుకోవచ్చు. కేంద్రంలోనూ, రాష్ట్రంలోను వేరువేరు పార్టీలు అధికారంలోకి వస్తున్న నేపథ్యంలో, రాజ్యాంగ ధర్మానికి కేంద్ర ప్రభుత్వాలు అనేక సందర్భాల్లో తిలోదకాలిస్తున్నాయి. నిధులు కేటాయింపులో రాజకీయ వివక్ష ప్రదర్శిస్తున్నారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నా, బిజేపీ ఉన్నా ఇదే జరిగింది. అంతేకాదు, ఎవరు అధికారంలో ఉన్నారనేదానితో నిమిత్తం లేకుండానే స్వాతంత్ర్యానంతరం క్రమంగా ఆర్థిక వనరులు కేంద్రం చేతిలో కేంద్రీకృతమవుతున్నాయి. రాష్ట్రాలను కేంద్రం గుల్ల చేస్తున్నది. నిధులు, అధికారాలు లేకుండా, కేంద్రంపై ఆధారపడే రాష్ట్ర ప్రభుత్వాలుగా మారిపోతున్నాయి. ఫెడరల్ రాజ్యాంగ స్వభావానికి విరుద్ధం. ప్రజాస్వామ్య విరుద్ధం.

కేంద్రంతో సహకరిస్తేనే నిధులు వస్తాయని చెప్పడం సమంజసమా? న్యాయంగా రాష్ట్రానికి ఇవ్వవలసిన నిధులు ఇవ్వనప్పుడు రాజ్యాంగ బద్ధంగానే కేంద్రంమీద ఒత్తిడి చేయవచ్చు. అందుకు భిన్నంగా అడుక్కోవాలనుకోవడం లొంగుబాటు ధోరణి తప్ప మరొకటి కాదు. ఇది ఏ ప్రభుత్వానికైనా గౌరవప్రదమూ కాదు, ప్రజల హక్కులను గౌరవించడమూ కాదు. వ్యక్తిగత లేదా రాజకీయ ప్రయోజనాల కోసం ఆయా ప్రాంతాల, రాష్ట్రాల ప్రజల హక్కులను కేంద్రం చేతుల్లో పెట్టే అధికారం ఎవరికీ లేదు. రాష్ట్రంలో బిజేపీ నాయకులు కూడా ఇవే సన్నాయినొక్కులు నొక్కుతున్నారు. కేంద్రంతో సఖ్యతగా ఉంటేనే నిధులు వస్తాయని చెబుతున్నారు. ఇది రాజ్యాంగ విరుద్ధవాదన. దత్తాత్రేయ రాష్ట్ర ప్రతినిధిగా కేంద్రంలో వ్యవహరిస్తారనడం కూడా సరైంది కాదు. బిజేపీకి దగ్గరవ్వడం కోసం ఒక మంత్రిని ఈ పద్ధతిలో ఆకాశానికెత్తనవసరం లేదు. కేంద్రమంత్రి ఎవరైనా తన శాఖకు సంబంధించినంత వరకు మొత్తం దేశానికి ప్రాతినిధ్యం వహిస్తారు.

ఈ మధ్య ప్రధానితో చర్చించి వచ్చిన తర్వాత కెసిఆర్ మరింత స్పష్టంగా మాట్లాడారు. రాష్ట్రాలకు కేంద్రం నుండి రావాల్సిన నిధులు క్రమంగా కుదిస్తున్నారని చెప్పారు. అందువల్ల కేంద్ర పథకాలకు అనుగుణంగానే రాష్ట్ర పథకాలు రూపొందించాలన్నారు. ఉన్నతాధికారుల సమీక్షా సమావేశంలో ఈ విషయాలు చెప్పారు. రాష్ట్రాలకు కేంద్రం ఇవ్వవలసిన నిధులు కుదిస్తున్నప్పుడు ఇది అన్యాయమని చెప్పడం రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత. రాష్ట్రాలకు నిధులను ఒక హక్కుగా డిమాండ్ చేయాలి. ఇది గౌరవప్రదమైన పద్ధతి. అడుక్కోవడం ప్రజల హక్కును, గౌరవాన్ని పణంగా పెట్టడమే. ఇది ఫెడరల్ స్ఫూర్తికి భిన్నమైంది. రాజ్యాంగంలో భారత దేశమంటే రాష్ట్రాల సమాఖ్యగా అభివర్ణించారు. దీన్ని బట్టే రాష్ట్రాల ప్రాధాన్యతను అర్థం చేసుకోవచ్చు. రాష్ట్రాల హక్కులను, అధికారాలను లాగేసుకుని కేంద్రం పెత్తనం చేయడాన్ని ఏ ప్రభుత్వమూ అంగీకరించ కూడదు. కానీ రాష్ట్ర ప్రభుత్వం, టిఆర్ఎస్ నాయకత్వం ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నాయి.


కేంద్ర మంత్రులు, బిజేపీకి చెందిన పార్లమెంట్ సభ్యులు, ఆర్ఎస్ఎస్ నేతలు వివిధ సందర్భాల్లో రాజ్యాంగ విరుద్ధ వ్యాఖ్యలు చేస్తున్నారు. ఒక మంత్రి ప్రతిపక్షాలకు ఓటేసే వారిని అక్రమ సంతానంగా ప్రకటించారు. మరో మంత్రి భగవద్గీతను జాతీయ గ్రంథంగా గుర్తించాలన్నారు. ఒక పార్లమెంట్ సభ్యుడు ఏకంగా గాంధీజీని హత్య చేసిన హంతకుడు నాథూరాంగాడ్సేను దేశ భక్తుడుగా కొనియాడారు. బిజేపీ కేంద్ర నాయకుడొకరు కమ్యూనిస్టులు, పాశ్చాత్యులు, ముస్లింలు రాసిన చరిత్ర గ్రంథాలను తగులబెట్టాలన్నారు. ఇన్ని ఘటనలు జరుగుతున్నా, ప్రధాని మోడీ మాత్రం మౌనంగానే ఉన్నారు. పైగా ప్రభుత్వమే పాఠశాల సిలబస్‌లో రామాయణం, భారతం బోధించాలని చెబుతున్నది. భారతదేశ చరిత్ర పరిశోధనా సంస్థకు కుల వ్యవస్థను సమర్థించే ఆర్ఎస్ఎస్ వ్యక్తిని అధిపతిగా నియమించింది. సాక్షాత్తు ప్రధానే మాట్లాడుతూ వినాయకుడికి ఆ కాలంలోనే ప్లాస్టిక్ సర్జరీ చేసారని అశాస్త్రీయంగా మాట్లాడారు. ఈ మధ్య కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన వ్యాపార ప్రకటనలో రాజ్యాంగం పీఠికలో పేర్కొనబడిన "సావరిన్ సోషలిస్ట్ సెక్యూలర్ డెమోక్రటిక్ రిపబ్లిక్" అని రాయకుండా "సావరిన్ డెమోక్రటిక్ రిపబ్లిక్" అని ముద్రించారు. ఇది

> **❝ తెలంగాణ రాష్ట్ర సమితి అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలోని టాటా, బిర్లా, అంబానీ వంటి పెద్ద పారిశ్రామికవేత్తలు మొదలు, సత్య నాదెళ్ళ తదితర దేశ, విదేశీ పారిశ్రామికవేత్తలతోనూ, అధికారులతోనూ సంప్రదింపులు జరుపుతూనే ఉన్నారు. వీరు ముఖ్యమంత్రిని కలవడానికి ముందస్తు అనుమతులు ఏమీ అవసరం లేదు. కానీ కార్మిక సంఘాలు, ఇతర ప్రజాసంఘాల ప్రతినిధులు ముఖ్యమంత్రిని కలవడం అంత సులభం కాదు. ❞**

రాజ్యాంగాన్ని ఉల్లంఘించడమే. ఇన్ని జరుగుతున్నా రాష్ట్ర ప్రభుత్వం గాని, టిఆర్ఎస్ పార్టీ గాని స్పందించలేదు. తమ వైఖరి స్పష్టం చేయలేదు. రాజ్యాంగ విరుద్ధమైన ప్రకటనలు వెలువడుతున్నప్పుడు, నిర్ణయాలు జరుగుతున్నప్పుడు స్పందించవలసిన బాధ్యత టిఆర్ఎస్ మీద కూడా ఉన్నది. తెలంగాణ భారతదేశంలో భాగం. లౌకికతత్వం మన విధానమని రాజ్యాంగంలోని పీఠికలోనే నొక్కి చెప్పారు. ఈ లౌకిక విధానానికి విరుద్ధమైన ప్రకటనలు, నిర్ణయాలు మతసామరస్యానికి భంగం కలిగిస్తాయి. అది తెలంగాణ ప్రజలకు కూడా హానికరమే కదా? అయినా టిఆర్ఎస్ నాయకత్వం ఎందుకు స్పందించదు? స్పందించకపోవడమే కాదు, ఛాందసభావాలను సమర్థించే దారిలోనే రెండు తెలుగు రాష్ట్రాల అధినేతలూ ఉన్నారు. మహిళలు నలుగురైదుగురు పిల్లలను కనాలని బిజేపీ ఎంపి చెపితే, అదే మాటను చంద్రబాబు వల్లించారు. ప్రభుత్వ కార్యాలయంలో యోగా పేరుతో ధ్యానం నిర్వహించారు. తెలంగాణలో కేసిఆర్ గారు వాస్తు కారణంగా సచివాలయం మార్చాలని నిర్ణయించారు. తెలంగాణ వచ్చినందుకు ప్రభుత్వ నిధుల నుండి మొక్కులు తీర్చుకుంటామన్నారు. మంత్రులు కూడా అదే బాటలో ఉన్నారు. వేములవాడలో శివరాత్రిరోజు మంత్రి పట్టువస్త్రాలు సమర్పిస్తారని నిర్ణయించారట. కానీ, వేములవాడ సందర్శించిన మంత్రులకు పదవీగండం ఉన్నదన్న భయంతో ఏ మంత్రి వెళ్ళలేదట! సచివాలయంలో రాజయ్య ఉపముఖ్యమంత్రి బాధ్యతలు నిర్వహించిన ఛాంబర్‌లోకి వెళ్ళడానికి మంత్రులు ఎవరూ సిద్ధంగా లేరట! వాస్తు బాగలేకనే రాజయ్య పదవీచ్యుతులయ్యారని వారి నమ్మకం.

ఆర్థిక విధానాల్లో కేంద్రాన్ని అనుసరించడమే కాదు, లౌకిక విలువలకు, ప్రజాస్వామ్యానికీ భంగం కలిగించే ప్రమాదకర నిర్ణయాలను కూడా ప్రశ్నించడం లేదు. పైగా ప్రజల దృష్టి మరలించడానికి ఛాందసభావాలను ప్రచారంలో పెడుతున్నారు.

ఈ మార్పులకు కారణం ఏమిటి? ఒకప్పుడు ప్రాంతీయ బూర్జువాకు ప్రాతినిథ్యం వహించిన పార్టీలే ఇప్పుడు కేంద్రంలో అధికారంలో ఉన్న జాతీయ పార్టీలతో జతకడుతున్నాయి. మరికొన్ని పార్టీలు అంటకాగేందుకు ఆత్రుతపడుతున్నాయి. రాష్ట్రాలకు హక్కులు, అధికారాల కోసం పోరాడిన ప్రాంతీయ పార్టీలే ఇప్పుడు కేంద్రాన్ని అడుక్కునేందుకు, దేబిరించేందుకు సిద్ధపడుతున్నాయి. వాటి స్వభావంలో



టిఆర్ఎస్ నేత కల్వకుంట చంద్రశేఖరరావు

వచ్చిన మార్పులే ఇందుకు కారణం. సరళీకృత ఆర్థిక విధానాల ఫలితంగా అంతర్జాతీయ పెట్టుబడితో సంబంధాలకు వీరికి కూడా అవకాశం వచ్చింది. పెట్టుబడులపై నియంత్రణలు తొలగించిన మేరకు కేంద్రంతో పోరాడవలసిన అవసరం కూడా వీరికి తగ్గింది. ఇక రాష్ట్రాలకు నిధులు, ప్రజాస్వామ్య హక్కులు ప్రధానంగా ప్రజలకు సంబంధించిన విషయాలు. ఈ పార్టీలకు పెట్టుబడిదారుల ప్రయోజనాలే తప్ప, ప్రజా ప్రయోజనాలు పట్టవుకదా! పైగా కేంద్రంలో అధికార పార్టీతో స్నేహం చేస్తే, లేదా మంత్రివర్గంలోచేరితే అంతర్జాతీయ పెట్టుబడితో సంబంధాలు పెంచుకోవడానికి, తమ వ్యాపారాలు విస్తరించుకోవడానికి మరిన్ని అవకాశాలు వస్తాయి. అందువల్ల ఎన్నికల సందర్భంగా ఏమి మాట్లాడినా, అధికారంలోకి వచ్చిన తర్వాత మాత్రం పెట్టుబడిదారుల ప్రయోజనాలే ముందుకు వస్తున్నాయి.

తెలంగాణ రాష్ట్ర సమితి అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలోని టాటా, బిర్లా, అంబానీ వంటి పెద్ద పారిశ్రామికవేత్తలు మొదలు, సత్య నాదెళ్ళ తదితర దేశ, విదేశీ పారిశ్రామికవేత్తలతోనూ, అధికారులతోనూ సంప్రదింపులు జరుపుతూనే ఉన్నారు. వీరు ముఖ్యమంత్రిని కలవడానికి ముందస్తు అనుమతులు ఏమీ అవసరం లేదు. కానీ కార్మిక సంఘాలు, ఇతర ప్రజాసంఘాల ప్రతినిధులు ముఖ్యమంత్రిని కలవడం అంత సులభం కాదు. ప్రపంచంలోనే గొప్పదని చెప్పుకున్న నూతన పారిశ్రామిక విధానంలో పెట్టుబడిదారులకు అన్ని ప్రయోజనాలు చేకూర్చారు. అడగకున్నా ఇచ్చారు. కార్మిక చట్టాల అమలు విషయంలో మాత్రం ఈ పెట్టుబడిదారులను సంతృప్తిపర్చడం కోసం రెండు, మూడు సంవత్సరాలకు ఒకసారి మాత్రమే తనిఖీలు జరుపుతామన్నారు. ఇక కార్మిక చట్టాల అమలు గగనకుసుమమే కదా! దీనికి తోడు ఆదివారాలు కూడా హైదరాబాదు నగరంలో వ్యాపారాలు నడవాలన్నారు. అంటే వారంతపు సెలవుకు కూడా కార్మికులు నోచుకోరన్నమాట. మరోవైపు రైతుల ఆత్మహత్యల విషయంలో కనీస స్పందన లేదు. ఎస్సీ, ఎస్టీలకు ప్రతి కుటుంబానికి మూడెకరాల సాగు భూమి గ్యారెంటీ చేస్తామన్నారు. కాని ఇది మాటల్లోనే తప్ప, ఆచరణకు నోచుకోవడం లేదు. వృద్ధాప్య పెన్షన్లు, రేషన్‌కార్డులు తదితర సంక్షేమ పథకాలు అమలుకు మాత్రం ప్రయత్నిస్తున్నారు. ఇవి ఓట్లను గ్యారెంటీ చేస్తాయి కాబట్టే ఈ మాత్రమైనా చేస్తున్నారు.

మొత్తంమీద కేంద్ర ప్రభుత్వం అమెరికాకు జూనియర్ భాగస్వామి కావాలని తహతహలాడుతుంటే, టిఆర్ఎస్ ప్రభుత్వం కేంద్రంలో స్థానం కోసం ఉబలాటం ప్రదర్శిస్తున్నది. సరళీకృత ఆర్థిక విధానాల నేపథ్యంలో బూర్జువా పార్టీలు ఏవైనా అంతర్జాతీయ పెట్టుబడితో సంబంధాల కోసం, తమ వ్యాపార ప్రయోజనాల కోసం ఆరాట పడుతున్నాయి తప్ప, ప్రజా ప్రయోజనాలతో వీరికి సంబంధం లేదు. ఇందుకు జాతీయ పార్టీలా, ప్రాంతీయ పార్టీలా అన్న తేడా లేదు. బూర్జువా పార్టీలన్నింటిదీ ఒకే దారి. అందుకే వామపక్ష ఉద్యమం ప్రాధాన్యత మరింత పెరిగింది. ప్రజలకు నిజమైన ప్రత్యామ్నాయం చూపించగల సిద్ధాంతం వామపక్ష భావజాలం మాత్రమే. ప్రజా ప్రయోజనం కోసం నికరంగా నిలబడగలిగే శక్తి వామపక్షాలకు మాత్రమే ఉన్నది. ●

సంస్కృతి

# సంస్కృతం ఎవరి భాష?

**ఎం.వి. ఆంజనేయులు**



రచయిత విజయవాడ నగర టాక్స్ పేయర్స్ అసోసియేషన్ నాయకులు

"సంస్కృతం అన్ని భాషలకు మూల భాష. ఆర్యులు ఈ దేశంవారే. ఋషులు విజ్ఞాన ఖనులు" అని ప్రచారం చేయటం ఇటీవలి కాలంలో బాగా పెరిగింది. ఈ ప్రచారం అజ్ఞానంతో చేస్తున్న ప్రచారం కాదు. అన్నీ తెలిసి, కావాలనే పనిగట్టుకొని ఈ ప్రచారం చేస్తున్నారు. కారణ మేమంటే వేదవేదాంగాలు, పురాణాలు అన్నీ సంస్కృతంలో రాసిఉన్నాయి. కాబట్టి ఇతర భాషలమీద ఆధిపత్యం సాధించాలంటే సంస్కృతం అన్ని భాషలకు మూలభాష అని ప్రజలను ఒప్పించాలి. అదేవిధంగా ఈ ప్రజలమీద, పెరుగుతున్న శాస్త్రవిజ్ఞానంమీద ఆధిపత్యం సాధించాలంటే ఋషులు విజ్ఞాన ఖనులు అని ప్రజలచేత ఆమోదింపజేయాలి. ఈ రెండూ ఒప్పుకుంటే ఋషులు సంస్కృతంలో రాసిన వేదవేదాంగాలు, పురాణాలు అన్నీ గొప్పవని ప్రజలు నమ్ముతారు. వేదవేదాంగాలు, పురాణాలు గొప్పవని నమ్మితే వాటిలో అంతర్భాగంగా ఉన్న కుల అంతరాలు, కర్మ సిద్ధాంతం లాంటివన్నీ సరైనవేనని నమ్ముతారు. అప్పుడు ఆధిపత్య కులాలలోని కొందరు, కొన్ని వర్గాలు ఈ సమాజం మీద వారి ఆధిపత్యాన్ని కొనసాగించటం సాధ్యమౌతుంది. కొన్ని వర్గా ల ఆధిపత్యం కోసం జరుగుతున్న ఈ ప్రచార పద్ధతులను, లక్ష్యాలను కూలంకషంగా విశ్లేషిం చాలి.

ముందుగా "సంస్కృతం అన్ని భాషలకు మూలభాష" అన్న విషయాన్ని పరిశీలిద్దాం. సంస్కృతం ఆర్యుల భాషేనన్నది నిర్వివాదాంశం. కనుక ఆర్యులను పరిశీలిస్తేగాని ఈ విషయం తేలదు.

ఆర్యులు భరతఖండం వారేనన్నది మరో వాదన. ఇక్కడ భరతఖండం అంటే ప్రస్తుత పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్ శ్రీలంకను కూడా కలిపితే ఏర్పడే భారత భూభాగం. అసలు ఈ దేశంలో ప్రజలు ఈ దేశంలో జన్మించారా లేక మరెక్కడి నుండైనా వలస వచ్చారా అనే అంశాన్ని కూడా పరిశీలించాలి. మానవులు వానరుల నుండి పరిణామం చెందారని జీవశాస్త్రం ధృవీకరించింది. అయితే అది భరతఖండంలో జరిగినట్లుగా ఎటువంటి ఆధారాలు లేవు.

అనేకమంది చరిత్రకారులు, జీవశాస్త్ర పరిశోధకులు, పురాజీవ శాస్త్రవేత్తలు, జన్యుశాస్త్ర పరిశోధకులు అన్ని దేశాలలో పరిశోధించిన విధంగానే భరత ఖండంలోని మానవులను గురించి కూడా పరిశోధించారు. ఇతర దేశాల భూభాగాల నుండి భారతదేశంలోకి మానవులు వలస వచ్చారని వారి పరిశోధనల్లో తేలింది. వారి పరిశోధనల ప్రకారం మొదట ఆఫ్రికా ప్రాంతం నుంచి నీగ్రటోస్ అనే జాతి ప్రజలు భరత ఖండంలోకి వచ్చారు. ఆ తర్వాత ద్రవిడ జాతి ప్రజలు వచ్చారు. ఆ తర్వాత మంగోలాయిడ్ జాతి ప్రజలు, ఆతర్వాత ఆర్య తెగలు భరత ఖండంలోకి వచ్చారు. వీరిలో నీగ్రటోస్ తెగలు వేటగాళ్ళు. వీరు ప్రధానంగా అండమాన్ నికోబార్ ప్రాంతాల వైపుకు వెళ్ళారు. కొద్దిమంది భారత భూభాగంలో ఉండి పోయారు. యానాది తెగలకు చెందినవారు నీగ్రటోస్ తెగకు చెందిన వారని చరిత్రకారుల అభిప్రాయం. ద్రవిడజాతి ప్రజలు వ్యవసాయం తెలిసినవారు. వీరు ప్రస్తుత ఉత్తర భారత దేశంలోఉన్న సింధు నది ప్రాంతంలో శతాబ్దాలపాటు జీవించారు. అక్కడి నుండి దక్షిణ ప్రాంతాలకు వ్యాపించారు. మంగోలాయిడ్ జాతి ప్రజలు బెంగాల్, ఈశాన్య రాష్ట్రాలు, టిబెట్, చైనా, మంగోలియా, బర్మా , కొరియా, జపాన్‌ల వైపు వెళ్ళారు. ఆర్యుల ప్రధాన వృత్తి పశువుల పెంపకం. వీరు భారత దేశంలోకి వచ్చి, మొదట సింధు పరిసరాల్లోని ద్రావిడ ప్రాంతాలను ఆక్రమించారు. ఆతర్వాత తూర్పు వైపుకు వెళ్ళి యమున, గంగ, సరయూ నదుల మైదాన ప్రాంతానికి వ్యాపించి, అక్కడ స్థిరపడ్డారని పరిశోధనలలో తేలింది.

ఏ జాతి ప్రజలైనా గుంపుగా జీవించాలన్నా, జీవనాధారం కోసం ఒక ప్రాంతం నుండి మరొక ప్రాంతానికి వెళ్ళాలన్నా ఖచ్చితంగా భాష అవసరం. మరి మొదట వచ్చిన నీగ్రటోస్ గాని , ఆత˘ర్వాత వచ్చిన ద్రావిడులు కాని, మంగోలాయిడ్‌లు కాని ఏ భాష లేకుండా ఈ దేశంలోకి రాలేరు కదా! గుంపుగా జీవించడం అంటేనే సామాజిక జీవనాన్ని కలిగి ఉండటం, వ్యవసాయం లాంటి ఉత్పత్తి కార్యక్రమాలను నిర్వహించడం. ఇవి భాష లేకుండా సాధ్యం కావు. ముందు వచ్చిన నీగ్రటోస్ జాతికీ, ఆ తర్వాత వ్యవసాయం చేయటం, పట్టణాలను నిర్మించటం లాంటి నాగరికత కలిగిన ద్రావిడులకూ, వారి వారి భాషలున్నాయి. మరి తర్వాత వచ్చిన ఆర్యుల భాష సంస్కృతం ఎలా ఆది భాష అవుతుంది? కనుక సంస్కృతం ఖచ్చితంగా ఆది భాష కాదు. సంస్కృతం ఈ దేశంలోకి వచ్చే నాటికే ఇక్కడ వివిధ భాషలున్నాయి.

మరి సంస్కృతం మాటేమిటి? వివిధ భాషలలో సంస్కృత పదాలు ఉన్నాయి కదా? అలాంటప్పుడు సంస్కృతం ఈ భాషలన్నింటికీ మూల భాష ఎందుకు కాదు? వేదాలు, పురాణాలు అన్నీ సంస్కృతంలోనే రాసి ఉన్నాయి కదా? మరి సంస్కృతం కన్నా ముందు ఇతర భాషలుంటే వాటిలోనే ముందుగా గ్రంథాలు రాయబడి ఉండాలిగదా?


ఈ ప్రశ్నలకు సమాధానం లభించాలంటే మళ్లీ ఆర్యుల రాకను పరిశీలించాలి. ఇంతకు ముందే చెప్పినట్లు ద్రావిడులు ముందుగా ఈ దేశంలోకి వచ్చారు. వారు వ్యవసాయం ప్రధాన వృత్తిగా కలిగిన వారు. గొప్ప సంస్కృతి కలవారు. వీరు వ్యవసాయంతో బాటుగా పట్టణాల నిర్మాణం, మురుగు నీటిపారుదల (డ్రైనేజి) ఏర్పాటు చేసుకోవటం లాంటివి చేశారని హరప్పా, మొహంజెదారోలలో జరిపిన తవ్వకాలు నిరూపించాయి. దీనినే సింధు నాగరికత అంటున్నాము. ఆ తర్వాత ఆర్యులు వచ్చారు. పశు పెంపకం వీరి ప్రధాన వృత్తి. మొరటు జాతి. యుద్ధ ప్రియులు. భరత ఖండంలోకి వచ్చేనాటికే వీరు గుర్రాలను, ఇనుమును ఉపయోగించడాన్ని నేర్చుకున్నారు. గుర్రాలను, ఇనుమును వినియోగించటం ద్రావిడులకు తెలియదు. ఇది ఆర్యుల ఆధిపత్యానికి దారితీసింది. ఆర్యులు ఒకే గుంపుగా రాలేదు. గుంపులు గుంపులుగా వచ్చారు. అలా వచ్చిన ఆర్యులు ద్రావిడులను ఓడించి, వారు అభివృద్ధి చేసుకున్న వ్యవసాయ క్షేత్రాలను ఆక్రమించుకున్నారు. ద్రావిడులను

దక్షిణం వైపుకు పారదోలారు. ఇదంతా ఒకేసారి జరిగింది కాదు. కొన్ని వందల సంవత్సరాల కాలంలో జరిగింది.

గుంపులు గుంపులుగా వచ్చిన ఆర్యులు ఒక తెగకు చెందినవారు కాదు. వివిధ తెగలకు చెందిన వారు. ఆర్యులందరూ మాట్లాడే భాష సంస్కృతం కాదు. ఆర్యులలోని వివిధ తెగలకు వారివారి భాషలున్నాయి. ఆ తెగలలో ఒక చిన్న ఆర్య తెగ మాట్లాడే భాష సంస్కృతం. ఆర్యులొచ్చేనాటికే భరత ఖండంలో ద్రావిడులకు కొన్ని భాషలున్నాయి. వాటినే దేశభాషలు అంటున్నాము. ఆర్యులు ద్రావిడ జాతులను ఓడించినపుడు మొదట్లో ఓడిపోయిన వారిని చంపేసేవారు. ఆ తర్వాత వారిని బానిసలుగా వాడుకోవటం ప్రారంభించారు. యజమాని, పనివాడు సంబంధంతోనైనా సరే ఆర్యులు ద్రావిడులతో సహజీవనం చేయవలసి వచ్చింది. ఎవరైనా పరాయి ప్రాంతాలకు వెళ్ళి స్థిరపడాలంటే, అనివార్యంగా స్థానిక భాషలను నేర్చుకోవలసిందే. అదేవిధంగా ఆర్యులకు ద్రావిడ భాషలను కూడా ఉపయోగించ వలసిన ఆవశ్యకత ఏర్పడింది. ఫలితంగా ఆర్య భాషలలోకి దేశ భాషల పదాలు (ద్రావిడ తెగలు మాట్లాడే భాషల పదాలు) చేరాయి. అదే విధంగా ఆర్య భాషగా ఉన్న సంస్కృత పదాలు దేశ భాషల్లో చేరాయి. ఒక భాషా పదం వేరే భాషలోకి చేరినప్పుడు ఆ పదం యథాతథంగా ఉండదు. ఆ పదాన్ని ఏభాష ఇముడ్చుకుంటుందో ఆ భాష నుడికారంలోకి మారిపోతుంది. ఉదాహరణకు రోడ్ అన్న ఆంగ్ల పదాన్ని మన తెలుగు భాష ఇముడ్చుకుంది. అది తెలుగు నుడికారాన్ని పొంది రోడ్డుగా మారింది. అదేవిధంగా దేశభాషల పదాలు సంస్కృతంలోకి చేరిన తర్వాత సంస్కృతీకరించబడినాయి. ఇలా దేశంలో ఉన్న అన్ని భాషల పదాలను తనలో చేర్చుకుంటూ సంస్కృతం అభివృద్ధి చెందింది. సంస్కృతంలో ఉన్న పదాలకు, దేశ భాషలలో ఉన్న పదాలకు సారూప్యత చూపి సంస్కృతం ఈ భాషలన్నింటికీ మూల భాష అంటూ సంస్కృతాభిమానులు, ముఖ్యంగా ఆర్యజాతికి చెందిన వారు చెప్పటం ప్రారంభించారు. నిజానికి ఇతర దేశ భాషల పదాలు సంస్కృతంలోకి చేరటంవలన సంస్కృతం అభివృద్ధి చెందింది తప్ప, సంస్కృతం నుండి దేశ భాషలు ఏర్పడలేదు.

> **“ గుంపులు గుంపులుగా వచ్చిన ఆర్యులు ఒక తెగకు చెందినవారు కాదు. వివిధ తెగలకు చెందిన వారు. ఆర్యులందరూ మాట్లాడే భాష సంస్కృతం కాదు. ఆర్యులలోని వివిధ తెగలకు వారివారి భాషలున్నాయి. ఆ తెగలలో ఒక చిన్న ఆర్య తెగ మాట్లాడే భాష సంస్కృతం. ఆర్యులొచ్చేనాటికే భరత ఖండంలో ద్రావిడులకు కొన్ని భాషలున్నాయి. ”**

**భారత్‌లోకి ఆర్యుల వలస**




“సంస్కృతం ప్రజల భాషగా లేదు. కేవలం పండిత భాషగా మాత్రమే ఉంది” అన్న వాదన కూడా ఉన్నది. అయితే ఇది పూర్తిగా నిజం కాదు. ప్రజలు మాట్లాడకుండా ఏ భాషా ఉండదు. సంస్కృతం కూడా ప్రజలు మాట్లాడిన భాషే. అయితే ప్రజాబాహుళ్యం మాట్లాడిన భాష కాదు. ఆర్య తెగలన్నీ మాట్లాడిన భాష కూడా కాదు. అనేక దఫాలుగా వచ్చిన ఆర్య తెగలలో ఒక చిన్న తెగ మాట్లాడిన భాష సంస్కృతం. చిన్న తెగ మాట్లాడిన భాష కావటంతో అది ప్రజాబాహుళ్యపు భాష కాకుండా పోయింది. లిపి లేకుండా పోయింది. ఉదాహరణకు మనకు కోయ, చెంచు తెగలు మాట్లాడే భాషలు వారికి మాత్రమే చెందినవి. ఆ భాషలు ప్రజాబాహుళ్యం మాట్లాడే భాషలు కావు. ఆ తెగలలో ఉన్న కొద్దిమందికి మాత్రమే చెందినవి. అందువలననే వాటిని ఎవరూ మాతృభాషగా ఎంచుకోలేదు. వాటి లిపిపై శ్రద్ధచూపలేదు.

సంస్కృతం ఇండో యూరోపియన్ భాషలకు సంబంధించినది. ద్రావిడ భాషలకు సంబంధం లేదు. ఆయా భాషలలోని ప్రాథమిక పదాలను పరిశీలిస్తే అది తెలుస్తుంది. ప్రాథమిక పదాలు అంటే పిల్లలు తలిదండ్రులను పిలవడానికి వాడే పదాలు. తల్లిని సంస్కృతంలో మాతృ అంటారు. లాటిన్‌లో మాతర్ అని, ఇంగ్లీష్‌లో మదర్ అని, ఫ్రెంచ్‌లో మేర్ అని, జర్మన్‌లో ముత్తర్ అని, స్పానిష్‌లో మాద్రే అని పిలుస్తారు. తండ్రిని సంస్కృతంలో పితృ అంటారు. లాటిన్‌లో పాతర్ అని, ఇంగ్లీష్‌లో ఫాదర్ అని, ఫ్రెంచ్‌లో పేర్ అని, జర్మన్‌లో పాత్తర్ అని, స్పానిష్‌లో పాద్రే అని పిలుస్తారు. ఇవన్నీ ఉచ్చారణ లోను, అర్థంలోను సామ్యాన్ని కలిగి ఉన్నాయి.

ఈ పదాలు ద్రావిడ భాషలలో రకరకాలుగా ఉన్నాయి. తల్లిని తమిళంలో, తెలుగులో అమ్మా అని, కన్నడంలో ఆవ్ అని, మరాఠీలో ఆయ్ అని, ఉర్దూలో అమ్మీఅని, మగధిలో అంబా అని పిలుస్తారు. తండ్రిని తమిళంలో అప్పా అని, తెలుగులో అయ్యా అని, కన్నడంలో అప్పా, బాపా అని, ఉర్దూలో అబ్బా/బాబా అని పిలుస్తారు. ద్రవిడ భాషలలో ఉన్న ఈ పదాలకు, ఇండో యూరోపియన్ భాషలలో ఉండే పదాలకు సంబంధం లేదు. ఇలా అనేక పదాలు ఉన్నాయి. కనుక సంస్కృతం ఇండో

> **"సంస్కృతం మాతృభాషగా అంతరించిపోయింది. కాని ఒక భాషగా అంతరించి పోలేదు. సంస్కృతం మాట్లాడే తెగవారు ఇతర ఆర్య తెగల మీద ఆధారపడి జీవించడం మొదలు పెట్టారు. వారు ఉత్పత్తిలో పాల్గొనలేదు. ప్రకృతిలో జరిగే విషయాలకు విపరీ తార్థాలు చెబుతూ, ఆర్య ద్రావిడ తెగల మధ్య నున్న విభేదాలను మరింతగా ఎగద్రోస్తూ, ఆర్య రాజుల పరాక్రమాలను కీర్తిస్తూ, తద్వారా ఆర్య రాజులను రంజింప జేస్తూ జీవించసాగారు. దానికి ఆ తెగ భాష- సంస్కృతం బాగా ఉపయోగపడింది."**



హరప్పా నగరం ఇలా ఉండేది: తవ్వకాల్లో బయటపడ్డ నగర శిధిలాల ఆధారంగా తయారు చేసిన నగర చిత్రం

యూరోపియన్ భాషలకు సంబంధించినదే తప్ప ఈ దేశపు మూల భాష కాదు.

మరి సంస్కృతం పండిత భాషగా ఎలా మారింది? సంస్కృతం మాతృ భాషగా కలిగిన ప్రజలు ఎందుకు లేకుండా పోయారు? అన్న ప్రశ్నలు తలెత్తుతాయి. సంస్కృతం బహు కొద్దిమందితో ఉన్న ఒక ఆర్యతెగ భాష అన్న విషయాన్ని గుర్తించాము. అయితే ఈ తెగ వారు ఉత్పత్తి విధానంలో బాగా వెనుకబడి ఉండే వారు. ఇతర ఆర్య తెగలు ద్రావిడుల విధానాలను అనుకరించడం మూలంగానూ, ఓడిపోయిన ద్రావిడులను బానిసలుగా వినియోగించుకోవటం మూలంగానూ ఉత్పత్తిలో పురోగతిని సాధించాయి. దానితో సంస్కృతం మాట్లాడే తెగ వారు ఇతర ఆర్య తెగల కంటే వెనుకబడి పోయారు. ఫలితంగా వారు ఇతర ఆర్య తెగల మీద ఆధారపడి జీవించ వలసి వచ్చింది. ఇతరుల మీద ఆధార పడటం మూలంగా అనివార్యంగా ఇతర ఆర్య తెగల భాషలు వారు నేర్చుకోవలసి వచ్చింది. క్రమేణా ఇతర ఆర్య తెగల భాషలే వారి మాతృభాషలుగా మారిపోయాయి. దానితో సంస్కృతం మాతృ భాషగా మాట్లాడే వారి సంఖ్య క్రమేణా అంతరించిపోయింది.


సంస్కృతం మాతృభాషగా అంతరించిపోయింది. కాని ఒక భాషగా అంతరించి పోలేదు. అంతరించక పోగా అది అభివృద్ధి చెందింది. సంస్కృతం మాట్లాడే తెగవారు ఇతర ఆర్య తెగల మీద ఆధారపడి జీవించడం మొదలు పెట్టారు. అయితే వారు జీవనాధారమైన ఉత్పత్తి విధానంలో పాల్గొనలేదు. ప్రకృతిలో జరిగే విషయాలకు విపరీతార్థాలు చెబుతూ, ఆర్య ద్రావిడ తెగల మధ్య నున్న విభేదాలను మరింతగా ఎగద్రోస్తూ, ద్రావిడులపై ఆర్యులను పురికొల్పుతూ, ఆర్యరాజుల పరాక్రమాలను కీర్తిస్తూ, తద్వారా ఆర్య రాజులను రంజింపజేస్తూ జీవించసాగారు. దానికి ఆ తెగ భాష సంస్కృతం బాగా ఉపయోగపడింది. స్వంత భాషలో చెప్పే విషయాన్ని పర భాషలో చెబితే దానిని గాంభీర్యంగా చెప్పినట్లుగా భావిస్తాం. ఈ పర భాషా వ్యామోహాన్ని సంస్కృతం మాతృ భాషగా కలిగిన తెగ చక్కగా వినియోగించుకున్నది. వారు చెప్పదలుచుకున్నవన్నీ మొదట సంస్కృతంలో చెప్పి, ఆ తర్వాత రాజులకు, రాజభృత్యులకు వారి వారి భాషలలో భాష్యం చెప్పేవారు. దానిలో వారు నైపుణ్యం సంపాదించారు. వారే తరువాతి కాలంలో ఋషులుగా నామాంతరం చెందారు. ఈ పనులు నిర్వహించటానికి వారు కొంత ఆహార్యాన్ని కూడా ఏర్పరచుకున్నారు. కొన్ని నియమాలను ఏర్పరచుకున్నారు. వారు ఏర్పరచుకున్న ఆహార్యానికి, ప్రతి నియమానికి ఒక పవిత్రతను, గొప్పతనాన్ని ఆపాదించుకున్నారు. ఆనాటి రాజులకు చదువు లేదు. ప్రకృతిపట్ల వారికున్న విషయ పరిజ్ఞాన లోపాన్ని వీరు చక్కగా వినియోగించుకున్నారు. చివరకు రాజులకు ఆప్తులుగా, ఆ తర్వాత గురువులుగా తయారయ్యారు. దానితో ఋషి వ్యవస్థ పటిష్టపడింది. సంస్కృతం ఋషుల భాషగా మారింది. చివరకు కొంత మంది రాజులకు కూడా సంస్కృతం నేర్పారు. రాజులు కూడా సంస్కృతం నేర్చుకోవటంతో రాజానుయాయులు కూడా సంస్కృతం నేర్చుకోవటానికి ఉత్సుకత చూపించారు. సంస్కృతంలో చెప్పటం, దానికి భాష్యం చెప్పటం ఆకర్షణీయంగా మారింది. దానితో సంస్కృతం పండిత భాషగా అవతరించింది. వారు చెప్పదలుచుకున్న విషయాలను ఇతరులకు సంస్కృతం నుండి భాష్యం చెప్పటం కోసం, వారితో కలిసి జీవించటం కోసం ఇతర ఆర్య తెగల భాషలను, సంస్కృతం మాతృ భాషగా కలిగిన తెగ నేర్చుకోవలసి వచ్చింది. దానితో వారు కూడా సంస్కృతాన్ని కేవలం రాజులు, రాజానుచరుల ముందు ప్రదర్శించటం కోసమే వాడుకొని, మిగతా జీవన విధానంలో వారు కలిసి తిరుగుతున్న తెగల భాషలను వాడుకోవటం మొదలు పెట్టారు. దానితో సంస్కృతం క్రమేణా పండిత భాషగా మిగిలి, మాతృభాషగా నశించి పోయింది.

వేదాలు, పురాణాలు అన్నీ సంస్కృతంలోనే రాసి ఉన్నాయి కదా? సంస్కృతం కన్నా ముందు ఇతర భాషలుంటే ముందుగా వాటిలోనే గ్రంథాలు వ్రాయబడి ఉండాలి గదా అని ప్రశ్నిస్తారు. మొదట్లో భాషలకు లిపులు లేవు. ఆ తర్వాత క్రమేణా ఒక్కొక్క భాషకు లిపి ఏర్పడటం మొదలైంది. అనేక భాషలకు లిపులు ఏర్పడినాయి. నిజానికి సంస్కృతానికి ఈనాటికీ లిపిలేదు. సంస్కృతం ఒక ప్రత్యేక ఉచ్చారణా ధోరణితో ముందుగా వేదాలలోనే కనిపిస్తుంది. ఆర్యతెగలు భరత ఖండంలోకి అడుగు పెట్టే నాటికే ఋగ్వేదం ఉంది. అయితే అది సంస్కృతంలో లేదు. గాంధార భాష ఆధారంగా ఏర్పడిన భాషలో ఉంది. అందుకే ఋగ్వేద భాష పూర్తిగా ఈనాటి సంస్కృతంకాదు. రెండవది ఋగ్వేదంలో ఉన్న ఇతివృత్తం ఆనాటి ఆర్యతెగల జీవన విధానాన్ని, వారిలో నెలకొని ఉన్న ప్రాథమిక భావనలను తెలియ జేస్తుంది. అవి ప్రాథమిక భావనలే తప్ప పరిణితి చెందినవి కావు. అది కూడా ఒకనాటిది కాదు. సంస్కృతం మాతృభాషగా గల ఆర్య తెగలు వివిధ సందర్భాలలో చెప్పుకున్నవి. అయితే ఆనాడు ఋగ్వేదం ప్రజాదరణ పొందినది కాదు. కేవలం సంస్కృతం మాతృభాషగా గల తెగలోనే ఉండేది. తర్వాత క్రమేణా ఇతరులలోకి

వ్యాపించింది. సంస్కృతం రాజాస్థానాలకు చేరి, ఋషి వ్యవస్థ నిలదొక్కుకున్న తర్వాత ఒక్కో దశలో ఒక్కో మండలం ఏర్పడింది. 10 ఋషి కుటుంబాలు (ఆంగీరస, కణ్వ, వశిష్ట. విశ్వామిత్ర, అత్రి, భృగు, కాశ్యప, గృస్తమద, అగస్త్య, భరత ఋషుల కుటుంబాలు) వాటిని తమ పరంపరగా ఎంచుకున్నాయి. ఈ 10 ఋషి కుటుంబాలు ఎంచుకున్న పరంపరలే ఋగ్వేదంలోని 10 మండలాలుగా ఉన్నాయి. వివిధ ప్రవక్తలు చెప్పిన వాటిని ఒకచోటచేర్చి బైబిల్‌ను రూపొందించిన విధంగానే, ఈ 10 మంది ప్రవచించిన పరంపరలను ఒకచోట కూర్చి ఋగ్వేదాన్ని తయారు చేశారు. అయితే ఈ ఋషులు అనబడేవారు ఏకకాలంలో జీవించిన వారు కాదు. వివిధ కాలాలలో జీవించిన వారు. అందువలననే ఋగ్వేదం ఒక నిర్ధిష్ట కాలంలో రూపొందినది కాదు. శతాబ్దాల కాలంలో రూపు దిద్దుకున్నది.

భరత ఖండంలోని పురాతన గ్రంథాలన్నీ సంస్కృతంలోనే ఉన్నాయని చెప్పటం సరికాదు. సంస్కృతంతో బాటుగా ప్రాకృతము, శౌరసేని, మాగధి, పైశాచి, చూళికా పైశాచి, అపభ్రంశము తదితర భాషలు కూడా ఉన్నాయి. ఇవన్నీ ఆర్య భాషలే. ఇవి సంస్కృతంతో సంబంధం లేకుండా ఉన్న సహజ ఆర్య భాషలు. నిజానికి ఈ భాషలను చులకన చేయటం కోసం వీటికి ఆపేర్లు పెట్టిన వారు కూడా సంస్కృత పండితులే. కాళిదాసు 'అభిజ్ఞాన శాకుంతలమ్' ను సంస్కృతంలో రాయగా, 'సేతుబంధము' అను కావ్యాన్ని ప్రాకృత భాషలో రచించాడు. కారణం కాళిదాసు ఆర్యుడే. కాని సంస్కృతం మాతృభాషగా కలిగిన వాడు కాదు. అందువలననే 'అభిజ్ఞాన శాకుంతలమ్' ను పండిత భాషైన సంస్కృతంలో రాసి, 'సేతుబంధము' కావ్యాన్ని ప్రాకృత భాషలో రచించాడు. శాలివాహనుడు 'సప్తశతి' అను గ్రంథాన్ని ప్రాకృత భాషలో రచించాడు. జైనుల ఆగమాలు, పురాణాలు కూడా ప్రాకృత భాషలో రాయబడి ఉన్నాయి. రామాయణాన్ని రచించిన వాల్మీకే ప్రాకృత భాషకు వ్యాకరణాన్ని సమకూర్చాడు. అదేవిధంగా వరరుచి 'ప్రాకృత ప్రకాశ' అన్న పేరుతో ప్రాకృత భాషకు వ్యాకరణ గ్రంథాన్ని రాశాడు. గుణాఢ్యుడు 'బృహత్కథ'ను పైశాచి భాషలో రాశాడు. ఇక తులసీదాసు 'రామ చరిత మానస్', 'రామచంద్ర హరిత' అనే గ్రంథాలను అవధి భాషలోను, సూరదాసు 'సుర్ సాగర్'ను, తులసీదాసు 'వినయ పత్రిక'ను బ్రిజ్ భాషలో రాశారు. అమీర్ ఖుస్రో రచించిన సూఫీ కవిత్వం కూడా బ్రిజ్ భాషలో రాసినదే. బుద్ధుని బోధనలను 'దమ్మములు' అంటారు. ఇవి పాళీభాషలో

❝భరత ఖండంలోని పురాతన గ్రంథాలన్నీ సంస్కృతంలోనే ఉన్నాయని చెప్పటం సరికాదు. సంస్కృతంతో బాటుగా ప్రాకృతము, శౌరసేని, మాగధి, పైశాచి, చూళికా పైశాచి, అపభ్రంశము తదితర భాషలు కూడా ఉన్నాయి. ఇవన్నీ ఆర్య భాషలే. ఇవి సంస్కృతంతో సంబంధం లేకుండా ఉన్న సహజ ఆర్య భాషలు. నిజానికి ఈ భాషలను చులకన చేయటం కోసం వీటికి ఆపేర్లు పెట్టిన వారు కూడా సంస్కృత పండితులే.❞


మొహంజదారోనగరం ఇలా ఉండేది: తవ్వకాల్లో బయటపడ్డ నగర శిధిలాల ఆధారంగా తయారు చేసిన నగర చిత్రం

రాయబడినాయి. ఇలా అనేక భాషలలో అనేక మంది రాశారు. అయితే దురదృష్టమేమిటంటే ఆర్య తెగలకు చెందినవారు, ఆర్య సంస్కృతిని ఆమోదించినవారు, వేదాలు, వేదాంగాలు, భారత, భాగవత, రామాయణాలు తప్ప ఈ దేశంలో మరో రచన లేదన్నంతగా ప్రచారం చేశారు. గత వాఙ్మయమంతా సంస్కృతంలోనే ఉన్నట్లు, అదే ఆది భాష అన్నట్లుగా భ్రమింపజేశారు. ఆర్య సంస్కృతికి, వేదవేదాంగాలకు, భారత, భాగవత, రామాయణాలకు బానిసలయ్యే విధంగా మనలను మానసికంగా తయారు చేశారు. చివరకు మన ద్రావిడ సంస్కృతిని మనం మరచిపోయేటంతగా చేశారు.

### ద్రావిడులలో సంస్కృతం వ్యాప్తి

ఆర్య ప్రాంతాలలో సంస్కృతం ఎలా వ్యాప్తి చెందిందో చూశాము. ఇక ద్రావిడ ప్రాంతా లలో, ద్రావిడులలో ఎలా వ్యాప్తి చెందిందో తెలుసుకుందాం. ద్రవిడ భాషలు మాట్లాడేవారు ప్రధానంగా భారత దేశంలోని దక్షిణ ప్రాంతాలైన తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, కర్నా టక, కేరళ, పాండిచ్చేరి, యానాం, లక్షద్వీప్ లలో పూర్తిగా ఉన్నారు. ఇక మహారాష్ట్రలో మరాఠీ, ఒడిశాలో ఒరియా, బెంగాల్‌లో బెంగాలీ, జార్ఖండ్‌లోని హిందీ, బీహార్‌లోని భోజ్‌పురి భాషలన్నీ ఆర్యభాషలు. అయితే ఆ ప్రాంతాలలో కొద్దిమంది ద్రావిడులు ఉన్నారు. చత్తీస్‌ఘడ్‌లో ఆర్య భాషలు మాట్లాడేవారు, ద్రావిడ భాషలు మాట్లాడేవారు సగం సగంగా ఉంటారు. శ్రీలంకలో సింహళం, తమిళం మాట్లాడేవారు చెరి సగం ఉంటారు. సింహళం ఆర్య భాష. తమిళం ద్రవిడ భాష. ఇక సింగ పూర్, మలేషియాలలో ఉన్నవారిలో శతాబ్దాల క్రితం వెళ్ళినవారు ఉన్నారు. బర్మాలోని తెన్‌గు తెగవారు తెలుగువారని భాషా శాస్త్రవేత్తల అభిప్రాయం. వాయవ్య పాకిస్తాన్, దక్షిణ ఇరాన్ ప్రాంతాలను బెలూచిస్తాన్ అంటారు. ఇక్కడ ద్రవిడ భాష అయిన బ్రహూయ్ మాట్లాడేవారు 20 లక్షలకు పైగా ఉన్నారు. కాని ఉత్తర ప్రాంతాలైన ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, హర్యానా, హిమాచలప్రదేశ్, రాజస్థాన్, పంజాబ్, గుజరాత్, జమ్ముకాశ్మీర్, ప్రాంతాలలోనూ, పాకిస్థాన్ (వాయవ్య పాకిస్థాన్ మినహా), ఆఫ్ఘని స్తాన్‌లలోనూ ఎక్కడా ద్రవిడ భాషలు మాట్లాడే వారు లేరు.

దీనిని జాగ్రత్త పరిశీలిస్తే మనకు కొన్ని విషయాలు అర్థమవుతాయి. ఇప్పటి లాగా విమానాలు, ఓడలు ఆనాడు లేవు కాబట్టి, భారతదేశంలోకి ఆనాడు ఎవరు వచ్చినా హిందూకుష్ పర్వతాలలోని కైబర్, బోలాన్ కనుమల ద్వారా రావలసిందే. ద్రావిడులు ముందు ఆ మార్గానే వచ్చారు . గనుకనే దానికి దగ్గరలో ఉన్న సింధు నదీ ప్రాంతంలో నివాసమున్నారు. క్రమేణా దక్షిణాదికి కూడా విస్తరించారు. ఆర్యులు కూడా ఆ మార్గానే

> **"భారతదేశంలోకి ఆనాడు ఎవరు వచ్చినా హిందూకుష్ పర్వతాలలోని కైబర్, బోలాన్ కనుమల ద్వారా రావలసిందే. ద్రావిడులు ముందు ఆ మార్గాన్నే వచ్చారు. సింధు నదీ ప్రాంతంలో నివాసమున్నారు. క్రమేణా దక్షిణాదికి కూడా విస్తరించారు. ఆర్యులు కూడా ఆ మార్గానే దేశంలోకి వచ్చారు. అప్పటికే అక్కడ ఉన్న ద్రావిడుల మీద దండయాత్రతో వచ్చారు. ఆర్యుల ధాటికి తట్టుకోలేని ద్రావిడులు క్రమేణా మధ్య భారతంలోకి, కొద్దిమంది తూర్పు ప్రాంతానికి తరలిపోయారు."**

దేశంలోకి వచ్చారు. అప్పటికే అక్కడ ఉన్న ద్రావిడుల మీద దండయాత్రతో వచ్చారు. ఆర్యుల ధాటికి తట్టుకోలేని ద్రావిడులు క్రమేణా మధ్య భారతంలోకి, వింధ్య, సాత్పురా పర్వతాల వైపుకు అత్యధికంగా, తూర్పు ప్రాంతానికి కొద్దిమంది తరలిపోయారు. వీటన్నింటి ఫలితంగా తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, కర్నాటక, కేరళ, పాండిచ్చేరీ, యానాం, లక్షద్వీప్‌లు పూర్తిగా ద్రావిడ ప్రాంతాలై పోయాయి. సరిహద్దు రాష్ట్రాలైన చత్తీస్‌ఘడ్, మహారాష్ట్రలలో సగం సగంగా ఉన్నారు. బీహార్, బెంగాల్, ఒడిశాలలో అత్యధికులైన ఆర్యుల మధ్య కొద్దిగా ద్రావిడ తెగలు కనుపిస్తాయి. అయితే ఉత్తర ప్రదేశ్, బీహారులలో యాదవులు ఒక ప్రధాన శక్తిగా ఉన్నారు. వీరుకూడా ద్రావిడులేనని కొంత మంది చరిత్రకారుల అభిప్రాయం. ఆర్యులు ద్రావిడులను మ్లేచ్ఛులని పిలిచేవారు. మ్లేచ్ఛ శబ్దం నీచమైనది. ఆర్యులకు సహాయం చేసి వారికి లొంగి ఉండటం, ఆర్య విధానాలను ఆమోదించటం, ఆర్య భాషలను తమ భాషలుగా చేసుకోవటం ద్వారా యాదవులు ఈ మ్లేచ్ఛశబ్దం నుండి బయటపడ్డారని చరిత్రకారుల అభిప్రాయం.

ఇప్పుడు ద్రావిడులలో సంస్కృతం ఎలా వ్యాపించిందో పరిశీలిద్దాం. ద్రావిడులు నేడు పూర్తిగా దక్షిణ భారతదేశంలో వ్యాపించి ఉన్నారు. ఉత్తర ప్రాంతాలలో ఉన్న ద్రావిడులను ఆర్యులు పారదోలారు. ఆర్యులు పారదోలినా పరాజితులైన ద్రావిడులు ఆ చుట్టు ప్రక్కల ప్రాంతాలకు సర్దుకున్నారే తప్ప పూర్తిగా ఉత్తర భారతదేశాన్ని వదలి రాలేదు. కొన్ని తెగలు ఆర్యులకు లొంగి పోయి ఉత్తర భారతదేశంలోనే ఉండి పోయాయి. అలాంటి తెగలలో యదు, వృష్ణి, భోజ, అంధక, బేధ, కిరాత, శబర, పుళింద తదితర తెగలు ఉన్నాయి. ద్రావిడులను ఆర్యులు మ్లేచ్ఛులు అని పిలిచేవారు. మ్లేచ్ఛులు అంటే ఎవరు? "మ్లేచ్ఛంతే అవ్యక్తం భాషంతే ఇతి మ్లేచ్ఛహ్హా" అన్నది ఆర్య భాష్యం. అంటే అవ్యక్తమైన భాషలు మాట్లాడే వారు మ్లేచ్ఛులు అని అర్థం. ఆర్యులకు ద్రవిడ భాషలు అర్థం అయ్యేవి కావు. అందువలన వాటిని అవ్యక్త భాషలుగా భావించి హీనంగా చూసేవారు. ఆ భాషలు మాట్లాడే ద్రావిడులను మ్లేచ్ఛులు అని పిలిచేవారు.

ఉత్తర భారతదేశంలో మిగిలిపోయిన ద్రావిడులు తొలిరోజులలో ఆర్యుల మధ్య ద్వితీయ శ్రేణి పౌరులుగా జీవించవలసి వచ్చింది. ఆ రోజులలో వారు జీవించాలంటే ఆర్యుల సంస్కృతిని, ఆర్య భాషలను ఆమోదించవలసి వచ్చింది. ఆధిపత్యం వహించే వారికి ఎప్పుడూ వారి భాష గొప్పదిగానూ, తమ ఆధిపత్యానికి లోబడిన వారి భాషలు హీనమైనవిగానూ కనిపిస్తాయి. అదే విధంగా ఆధిపత్యానికి లోబడి జీవించేవారు కూడా తమ భాషలకన్నా ఆధిపత్యం వహించేవారి భాషలు గొప్పవిగా భావించేట్లు అంగీకరింపజేస్తారు. ఆధిపత్యానికి లోబడి జీవించడమంటే ప్రధానంగా ఉన్న ఉపాధిని కాపాడుకోవటం మరియు క్రొత్త ఉపాధిని పొందటం. ఇది జరగాలంటే ఆధిపత్యానికి లోబడి జీవించేవారు అనివార్యంగా ఆధిపత్యం వహించే వారికి దగ్గర కావలసి ఉంటుంది. అలా దగ్గర కావాలంటే ఆధిపత్యం వహించే వారి భాషలు అనివార్యంగా ఆధిపత్యానికి లోబడి జీవించేవారు నేర్చుకోవలసిందే. ఉదాహరణకు తెలంగాణా ప్రాంతాన్ని నిజాం పరిపాలించేటప్పుడు, తెలంగాణా ప్రజలు తమ మాతృభాషైన తెలుగును కాదని నాటి ఆధిపత్య భాషైన ఉర్దూను నేర్చుకునేట్లు చేశారు. బ్రిటీష్‌వారు భారత దేశాన్ని పరిపాలించేటప్పుడు వారివద్ద ఉద్యోగాలు పొందటం కోసం భారతీయులు ఇంగ్లీషు నేర్చుకున్నారు. స్వాతంత్ర్యానంతరం ప్రభుత్వం మాతృ భాషలలో విద్య బోధించే విధానాన్ని తిరిగి ప్రవేశ పెట్టింది. నేడు మన భారత ప్రభుత్వం ఉద్యోగాలు కల్పించే స్థితిలో లేదు. ఉద్యోగాల కోసం విదేశీ కంపెనీల మీద ఆధార పడవలసి వస్తున్నది. అందువలన మన భాష రాకపోయినా సరే అక్షరాభ్యాసం రోజుల నుండి ఆంగ్లాన్ని నేర్పుతున్నాము. ప్రభుత్వమే అధికారికంగా ఆంగ్ల మాధ్యమ పాఠశాలలను తెరచింది. ఉపాధి కోసం ఇది అవసరం. ఇదే పరిస్థితి ద్రావిడు లకు తలెత్తింది. వారి భూభాగాలను కాపాడు కోవలసి వచ్చింది. దాని కోసం వారు ఆర్యులకు లోబడి జీవించవలసి వచ్చింది. అనివార్యంగా ఆర్య భాషలు నేర్చుకోవలసి వచ్చింది. ఆ విధంగా ద్రావిడ తెగలలో ఆర్య భాషలు చోటు చేసుకున్నాయి.

అయితే ఒక భాష నేర్చుకోవటం అంటే కేవలం భాషను మాత్రమే నేర్చుకోవటం

PSBH

తప్పక చదవండి



ఈ పుస్తకంలో సుప్రసిద్ధ శాస్త్రవేత్త ఛార్లెస్ డార్విన్ జీవిత వివరాలు, ఆయన గావించిన విజ్ఞాన పరిశోధనలు, రూపొందించిన 'పరిణామ సిద్ధాంతం' వివరాలు.. అన్నీ మనం తెలుసుకోవచ్చు. ఆయన ప్రతిపాదించిన 'జీవ పరిణామాభివృద్ధి' (జీవ పరిణామ సిద్ధాంతం)తో పాటు శాస్త్రవిజ్ఞాన గ్రంథాలకు సంబంధించిన సమాచారం కూడా ఈ పుస్తకం మనకు అందిస్తుంది. ఆయన నిర్ధారణలు ప్రపంచ విజ్ఞానరంగంలో సాటిలేని విప్లవం సాధించాయి. అయినా ఈనాటికీ అమెరికా పాలకులు దానిని అంగీకరించక తమ విద్యాలయాల్లో దానిని బహిష్కరించి, ఆ సిద్ధాంత సమర్థకులను కోర్టులకీడ్చి చేస్తున్న హంగామా గురించి కూడా ఈ 'ఛార్లెస్ డార్విన్' పుస్తకం వివరిస్తుంది. డార్విన్ సిద్ధాంతం ప్రపంచవ్యాప్తంగా చూరగొన్న అపార విజయాలు అమెరికన్ పాలకులకు చెంపపెట్టు లాగా పరిణమించాయి.

**ఛార్లెస్ డార్విన్** - ఆర్. పెరియస్వామి - వెల: రూ. 60/- పేజీలు : 96

**ప్రజాశక్తి బుక్‌హౌస్**
1-1-187/1/2, చిక్కడపల్లి, హైదరాబాద్ -20, ఫోన్ : 27608107, 9490099202

బ్రాంచీలు :
హైదరాబాద్, విజయవాడ, తిరుపతి, విశాఖపట్నం, గుంటూరు, నల్గొండ, ఖమ్మం, ఒంగోలు, కరీంనగర్

వరకు పరిమితం కాదు. భాషతో పాటు వారి సంస్కృతి కూడా ప్రవేశిస్తుంది. సంస్కృతి నుండి భాషను వేరు చేయలేము. అందువలన భాషతో పాటు సంస్కృతి కూడా వంటపడుతుంది. ఇక్కడ ఆర్య భాషలు నేర్చుకున్న ద్రావిడులకు ఆర్య సంస్కృతి కూడా వంటపట్టింది. ఆర్యుల ఆధిపత్యాన్ని ఆమోదించడమంటే ఆర్యుల సంస్కృతిని కూడా ఆమోదించడమే. ఆర్యుల సంస్కృతిలో అప్పటికే వర్ణ వ్యవస్థ నెలకొన్నది. ఋషి వ్యవస్థ, వేదాలు, క్రతువులు ఉన్నాయి. వీటన్నింటినీ ఆమోదించ వలసి వచ్చింది.

తర్వాతి కాలంలో ద్రావిడులు క్రమేణా నిలదొక్కుకున్నారు. ఎక్కడైనా స్థిర నివాసాలుంటే అక్కడ తప్పకుండా ఒక ప్రభుత్వం ఏర్పడుతుంది. అదే విధంగా ద్రావిడులలో కూడా చిన్న చిన్న రాజ్యాలు తలెత్తాయి. మొదట ఆర్యులకు సామంతులుగా ప్రారంభమై తరువాత ఆర్యులతో ఢీ అంటే ఢీ అనే స్థాయికి ద్రావిడులు ఎదిగారు. అయితే అప్పటికే వర్ణ వ్యవస్థ, ఋషి వ్యవస్థ, వేదాలు, క్రతువులు, సంస్కృత భాషాధిపత్యం– మొత్తంగా చెప్పాలంటే ఆర్య సంస్కృతి ద్రావిడులలో వ్యాపించి పోయింది.

ఆర్యులైనా, ద్రావిడులైనా పాలకులు పాలకులే. పాలకుల స్వభావం ఒకే విధంగా ఉంటుంది. పాలకుల ప్రయోజనాలకు ఏ వ్యవస్థ, ఏభాష ఉపయోగ పడితే వాటినే ప్రోత్సహిస్తారు. ఆర్యులలో ఉండే వర్ణ వ్యవస్థ, ఋషి వ్యవస్థ, వేదాలు, క్రతువులు, సంస్కృత భాషాధిపత్యం ద్రావిడ పాలకులకు కూడా ఉపయోగ పడ్డాయి. అందువలననే సంస్కృతాన్ని ప్రచారం చేయటానికి ద్రావిడ పాలకులు వెనుకాడలేదు. అదేవిధంగా నీచ పదమైన మ్లేచ్ఛ నామాన్నుండి బయట పడటానికి సంస్కృతాన్ని తమదిగా భావించి ప్రచారం చేశారు. ఇదంతా ఉత్తర, మధ్య భారతంలో జరిగింది. మరి దక్షిణ భారత దేశంలో ఉన్న ద్రావిడులలో సంస్కృతం ఎలా వ్యాప్తి చెందిందో పరిశీలిద్దాం.

దక్షిణ భారతదేశంలోకి సంస్కృతం ఎలా వ్యాప్తి చెందిందో తెలుసుకోవాలంటే ముందుగా దక్షిణ భారత దేశ సంస్కృతిలో, రాజకీయ వ్యవస్థలలో వచ్చిన మార్పులను అధ్యయనం చేయాలి. ద్రావిడులలో వర్ణ వ్యవస్థ లేదు. కుల విభజన లేదు. స్థానికంగా గొప్పవారిని వారి వారి ప్రతిభను గుర్తించి గౌరవించే గొప్ప సంస్కృతి ద్రావిడులది. ద్రావిడులు చిన్న చిన్న తెగల స్థాయినుండి, చిన్న చిన్న రాజ్యాల స్థాయికి ఎదిగారు. ఆర్యులలోఉన్న వర్ణ వ్యవస్థ ద్రావిడులలో మరో రూపంలో వ్యాపించింది. అదెలాగో చూద్దాం. ఆర్యులలో మూడు వర్ణాలే ఉండేవి.

> **“ఆర్యులైనా, ద్రావిడులైనా పాలకులు పాలకులే. పాలకుల స్వభావం ఒకే విధంగా ఉంటుంది. పాలకుల ప్రయోజనాలకు ఏ వ్యవస్థ, ఏభాష ఉపయోగ పడితే వాటినే ప్రోత్సహిస్తారు. ఆర్యులలో ఉండే వర్ణ వ్యవస్థ, ఋషి వ్యవస్థ, వేదాలు, క్రతువులు, సంస్కృత భాషాధిపత్యం ద్రావిడ పాలకులకు కూడా ఉపయోగ పడ్డాయి. అందువలననే సంస్కృతాన్ని ప్రచారం చేయటానికి ద్రావిడ పాలకులు వెనుకాడలేదు.”**



**మొహంజదారో నగరంలో ఇటుకలతో నిర్మించబడిన స్నానాల చెరువు: ఇది ప్రధానంగా మతపరమైన సందర్భాల్లో ఉపయోగించేవారని నిపుణుల చెబుతున్నారు. ఉత్తర దక్షిణం దిశగా 12 మీటర్ల పొడవు, 7 మీటర్ల వెడల్పు, 2.4 మీటర్ల లోతు ఉన్న ఈ చెరువు వేల ఏళ్లనాడు నిర్మించబడిందంటే నాడు ద్రావిడ సంస్కృతి ఎంతగా అభివృద్ధి చెందిందో అర్థమవుతుంది.**

‘ఆర్య త్రైవర్ణికా’ అన్నది ఆర్యోక్తి. అంటే ఆర్యులు మూడు వర్ణాలవారే అని అర్థం. బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, ఈ మూడు వర్ణాలవారే ఆర్యులలో ఉన్నారు. ఆర్యులలో శూద్రులు కనిపించరు. కాని ఆర్యులు ద్రావిడులను మొత్తాన్ని శూద్రులని పిలిచేవారు. శూద్ర పదం కూడా ఆర్యుల సృష్టే. వారి దృష్టిలో ద్రావిడులంతా శూద్రులు. వర్ణ వ్యవస్థ ద్రావిడులలో లేదు. ఆర్యులలో శూద్రులు లేరు. ద్రావిడులను మ్లేచ్ఛులు అని కూడా పిలిచేవారని ఇంతకు ముందు చెప్పుకున్నాం. శూద్రులు, మ్లేచ్ఛులు అన్న పదాలకు తికమక పడకూడదు. ఇక్కడ శూద్ర అన్నది మొత్తం ద్రావిడ జాతిని సూచించేపదం. మ్లేచ్ఛ అన్నది ద్రావిడ భాషలను సూచించే పదం. ద్రవిడ జాతిని, ద్రవిడ భాషలను చులకనగా చూడడానికి “శూద్ర”“మ్లేచ్ఛ” అన్న పదాలను ఆర్యులే సృష్టించారు.

ద్రావిడులలో వర్ణ వ్యవస్థ లేదని చెప్పుకున్నాము. ద్రావిడులు స్థిరనివాసాలు ఏర్పాటు చేసుకొని నాగరికత అభివృద్ధి చెందే క్రమంలో వివిధ వృత్తులు అవసరమైనాయి. ఉత్పత్తి చేసే వృత్తులు, ఉత్పత్తితో సంబంధంలేని వృత్తులు, సేవావృత్తులు, ఇలా రకరకాల వృత్తులు ఏర్పడినాయి. అవి క్రమేణా అభివృద్ధి చెందాయి. వృత్తులను వంశ పారంపర్యంగా చేయటం మొదలయింది. ఒకవృత్తి చేసే వారందరిని ఒక కులంగా పిలవటం మొదలైంది. అయితే కులాలు ఈనాటి రూపంలో లేవు. ఎంచుకున్న వృత్తిని బట్టి కులం ఉండేది. వృత్తి మారితే కులం మారేది. ఒక కులం నుండి మరో కులంలోకి మారటానికి అవకాశం ఉండేది. వివిధ కులాల మధ్య వివాహ సంబంధ బాంధవ్యాలు ఉండేవి.

ఇంతకు ముందే చెప్పుకున్నట్లు స్థిర నివాసాలున్నచోట తప్పకుండా ప్రభుత్వం ఏర్పడుతుంది. దక్షిణ ప్రాంత ద్రావిడులలో

## వార్త పత్రికల రిజిస్ట్రేషన్

(రూలు 8వ ఫారం 1జ ప్రకారం)
మార్క్సిస్టు మాసపత్రిక ప్రచురణ వివరాలు

| | | |
|---|---|---|
| 1. ప్రచురణ స్థలం | : | హైదరాబాద్ |
| 2. ఏ రకమైన పత్రిక | : | మాసపత్రిక |
| 3. ముద్రాపకుని పేరు | : | బి.వి.రాఘవులు |
| చిరునామ | : | 1-1-60/2, ఎం.బి.భవన్, ఆర్.టి.సి క్రాస్ రోడ్స్, హైదరాబాద్-20. |
| 4. ప్రచురణ కర్త పేరు | : | బి.వి.రాఘవులు |
| చిరునామ | : | 1-1-60/2, ఎం.బి.భవన్, ఆర్.టి.సి క్రాస్ రోడ్స్, హైదరాబాద్-20. |
| 5. సంపాదకుని పేరు | : | ఎస్.వెంకట్రావు |
| చిరునామ | : | 41-12-23, మార్క్సిస్టు కార్యాలయం, కృష్ణలంక, విజయవాడ-2. |
| 6. పత్రిక యాజమాన్యం | : | భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ, |

బి.వి.రాఘవులు అను నేను పైన పేర్కొన్న వివరాలు విశ్వసనీయమైనవని ఇందు మూలముగా తెలియజేస్తున్నాను.

**సం/-**
**బి.వి.రాఘవులు**
**ప్రచురణ కర్త**

కూడా చిన్న చిన్న రాజ్యాలు తలెత్తాయి. రాజ్యాలు తలెత్తటమంటే పాలించే ప్రభువుతో బాటుగా పాలనకు కావలసిన యంత్రాంగం ఏర్పడుతుంది. అయితే ఆ నాటి రాజులు అత్యధికులు విద్యాహీనులు. విద్యలేని రాజులు పాలనా వ్యవహారాలు నిర్వహించాలంటే విద్యావంతులు తప్పనిసరిగా అవసరం అవుతారు. దీనితో క్రమేణా రాజుల వద్ద మంత్రాంగం నడిపే బృందం తయారయింది. అటు రాజుగారిని ఇటు ప్రజలను మెప్పించటం, వారిమీద ఆధిక్యతను సాధించేదిగా విద్య ఉండాలి. సమకాలీనంగా ఉత్తరాదిన ఉన్న ఆర్య సంస్కృతి, సంస్కృత భాష ఇందుకు ఉపయోగపడ్డాయి. అందరు మాట్లాడే భాషనే మంత్రాంగం నడిపేవారు కూడా ఉపయోగిస్తే వారి ప్రత్యేకత ఎలా నిలుస్తుంది? తమను ప్రతిభావంతులుగా ఎలా గుర్తిస్తారు? అందువలన ఒక పరాయి భాషను వినియోగిస్తే వారి ప్రత్యేకత నిలుస్తుంది. వారిని ప్రతిభావంతులుగా గుర్తిస్తారు. దానికి ఆర్య భాషగా ఉన్న సంస్కృత భాష బాగా ఉపయోగపడింది. అదే విధంగా ఒక ప్రత్యేక నడవడికను ప్రదర్శిస్తే తమను ప్రత్యేకంగా గుర్తిస్తారు. దానికి ఆర్య సంస్కృతి బాగా ఉపయోగపడింది. దీనితో మంత్రాంగం నడిపేవారు క్రమేణా ఆర్య సంస్కృతిని అనుకరించటం మొదలు పెట్టారు. సంస్కృత భాషను ఆదరించటం ప్రారంభించారు. ఉత్తర భారత దేశంలో ఉన్న ద్రావిడులలో ముందుగా ఆర్య సంప్రదాయాలు, సంస్కృతి వ్యాపించటాన్ని చూశా ము. క్రమేణా అది దక్షిణాదికి కూడా వ్యాపిం చింది, కాకుంటే ఒక తేడా ఉంది, ఉత్తరాదిలో ఉన్న ద్రావిడులు ఆర్యుల మధ్యలో తమ మనుగడ సాగించడం కోసం ఆర్య సంస్కృతిని, సంస్కృత భాషను ఆమోదిస్తే, దక్షిణాదిలో ఉన్న ద్రావిడు లు పాలనా మంత్రాంగం కోసం ఆర్య సంస్కృ తిని, సంస్కృత భాషను ఆమోదించారు. అలా క్రమేణా ద్రావిడులలో వర్ణ వ్యవస్థ చొరబడింది. పాలన, యంత్రాంగం కూడా వృత్తులుగా మారిపోయాయి. కనక అవి కూడా కులాలుగా మారిపోయాయి. పరిపాలించే వారు క్షత్రియులుగా, మంత్రాంగం నడిపేవారు బ్రాహ్మణులుగా రూపొందారు.

ఆర్య సంస్కృతిలో, సంస్కృత భాషలో నైపుణ్యానికి గీటురాయి ఏది? అప్పటికే ఆర్యుల ప్రాంతంలో, సంస్కృతం పండిత భాషగా అభివృద్ధి చెందిన ప్రాంతం కాశీ (వారణాసి). అక్కడ సంస్కృత పండితులు విద్యాపీఠాన్ని ఏర్పాటు చేశారు. దానినే కాశీ విద్యాపీఠం అంటారు. ఎవరైనా సంస్కృత భాషపై పట్టు సాధించారని గుర్తింపు పొందాలంటే వారు ముందుగా కాశీ పండితుల మెప్పు పొందాలి. అలా కాశీ పండితుల మెప్పు కోసం సంస్కృతాన్ని విరివిగా నేర్చుకోవటం మొదలు పెట్టారు. సంస్కృతాన్ని బాగా నేర్చుకోవటం అంటే ఆర్యుల సంస్కృతిని కూడా నేర్చుకోవటమే. ఆర్యుల భావజాలాన్ని నేర్చుకోవటమే. అలా ద్రవిడ బ్రాహ్మణులు ఆర్యుల భావజాలానికి, సంస్కృత భాషకు ప్రతినిధులుగా రూపాంతరం చెందారు. అదేవిధంగా ఆర్య సంస్కృతిలో నైపుణ్యం సాధించటం కోసం ఆర్య సంస్కృతిలో భాగంగా ఉన్న ఋషి వ్యవస్థను, వేద ప్రామాణ్యాన్ని, క్రతువులను ఆచరించటం ప్రారంభించారు.

అయితే సంస్కృతం కేవలం బ్రాహ్మ ణులు నేర్చుకున్నంత మాత్రాన ప్రచారం కాలేదు. ద్రావిడ రాజులు తమ ప్రయోజనాలకోసం, తమ అధిపత్యాన్ని ప్రదర్శించటం కోసం సంస్కృత భాషను ఆదరించటం మొదలు పెట్టిన తర్వాతనే సంస్కృతం, దాన్ని వెన్నంటి ఉన్న ఆర్యుల భావజాలం బాగా ప్రాచుర్యంలోకి వచ్చాయి. అలాగే బ్రాహ్మణ ప్రభువులు కూడా అక్కడక్కడ అధికారంలోకి రావటం దీనికి ఊపునిచ్చింది. ఉదాహరణకు తెలుగు ప్రాంతంలో శాత వాహనులు (వీరు బ్రాహ్మణులు) అధికారంలోకి వచ్చేవరకు సంస్కృతం దాదాపుగా వాడుకలో లేదు. శాతవాహనులు అధికారాన్ని చేపట్టిన తర్వాతే సంస్కృతాన్ని ప్రోత్సహించారు. ఆ తర్వాత ఇక్ష్వాకులు, విష్ణుకుండినులు (వీరు కూడా బ్రాహ్మణులులే) సంస్కృతాన్ని బాగా ప్రోత్సహించారు. అలా దక్షిణ భారతదేశంలోకి సంస్కృతం ప్రవేశించింది. ఆర్యులలో ఒక తెగకు సంస్కృతం మాతృ భాష అయితే, ద్రావిడులలో సంస్కృతం పాలనావసరాల ద్వారా ప్రవేశించింది. ●

పుస్తక పరిచయం

# మోడీ అసలు కథ

**ఎం. నిర్మల్ కుమార్**



కొద్దిరోజుల క్రితం ఒక స్నేహితుని స్మార్ట్ ఫోన్‌కు వాట్సాప్ ద్వారా ఒక మెసేజ్ వచ్చింది. ప్రధానమంత్రి నరేంద్రమోడీ కొత్తగా ప్రారంభించిన సర్వీసులను ఉపయోగించుకోమంటూ వచ్చిన ఆ మెసేజ్‌లో వివిధ వెబ్ అడ్రస్‌లు ఇచ్చారు. వివిధ రకాల పౌర సేవలకుగానూ సంప్రదించవల్సిన వెబ్‌సైట్ల అడ్రస్‌లివి. వీలైనంతమందికి ఈ అడ్రస్‌లను పంపి, వారిని చైతన్యపర్చమంటూ ఆ మెసేజ్ సూచించింది. పనిలోపనిగా దేశాభివృద్ధికీ, ప్రజాసేవకూ నడుం బిగించిన మోడీకి మద్దతివ్వమని కూడా అది కోరింది. నిజానికి ఆ సర్వీసులు, ఆ వెబ్‌సైట్లూ కొత్త ప్రభుత్వం ప్రారంభించినవి కావు. గతంలో ఉన్నవే! రాజకీయాలలో అసత్యాలూ, అర్ధ సత్యాలూ ప్రచారం చేయటం కొత్తకాదు. కానీ మోడీని గురించి సాగుతున్న అసత్య ప్రచారాలు అన్ని రికార్డులనూ బద్దలు కొడుతున్నాయి. మొన్నటి పార్లమెంట్ ఎన్నికలకు ముందూ ఆ తర్వాతా మోడీని గురించి సోషల్ మీడియా, ప్రధాన స్రవంతి మీడియాలో విపరీతమైన ప్రచారం జరుగుతున్నది. మోడీ తల్లి దగ్గరకు వెళ్ళొచ్చినా, పుస్తకం చదువుతున్నా, పార్లమెంటులో ప్రవేశిస్తున్నా, మైక్ సరిచేస్తున్నా, ప్రసంగిస్తున్నా ప్రతిదీ వార్తాపత్రికలలో మొదటి పేజీలెక్కుతున్నది.

పేద కుటుంబం నుండి, వెనుకబడిన తరగతుల నుండి వచ్చి ప్రధానమంత్రి స్థాయికి ఎదిగిన నేతగా, సమర్థతకు వ్యక్తిత్వ వికాసానికి ఉదాహరణగా మోడీని చూపుతున్నారు. స్వంతంత్రగా మోడీనే తన విజయాన్ని భారత ప్రజాస్వామ్యపు విజయంగా వర్ణించారు. అయితే ఇదంతా నిజమేనా? మీడియా ప్రచారం చేస్తున్నట్లు మోడీ స్వయంకృషికి, అభివృద్ధికాముకతకు, సమర్థతకు ప్రతిబింబమా? జరుగుతున్న ప్రచారంలో నిజమెంత? అబద్ధమెంత? ఇవి తెలియాలంటే మోడీ గత చరిత్ర తెలియాలి. విలువలన్నీ వదిలేసిన కార్పొరేట్ మీడియా ఈ చరిత్రను వెలుగులోకి తీసుకురాకున్నా, స్వతంత్రంగా కొందరు జర్నలిస్టులు ఈ ప్రయత్నాలు చేస్తున్నారు. కేరళకు చెందిన వినోద్ కె. జోష్ గుజరాత్‌లో పర్యటించి అనేకమంది నాయకులనూ, అధికారులనూ, మోడీ రాజకీయ సహచరులనూ, కుటుంబ సభ్యులనూ, చిన్ననాటి మిత్రులనూ కలుసుకొని మోడీని గురించి సమాచారం సేకరించారు. ఈ సమాచారం ఆధారంగా "ది ఎంపరర్ అన్‌క్రౌన్డ్ – ది రైజ్ ఆఫ్ నరేంద్రమోడీ" పేరుతో ఆయన రచించిన వ్యాసాల్ని 'కారవాన్' అనే ఆంగ్ల పత్రిక ప్రచురించింది. దీనిని ప్రజాశక్తి బుక్‌హౌస్ వారు "మోడీకథ ఇది" పేరుతో పుస్తకంగా తెలుగులో ప్రచురించారు.

ఎనిమిది భాగాలుగా సాగిన ఈ పుస్తకంలో ఒక్కో భాగం మోడీలోని ఒక్కో కోణాన్ని చర్చించింది. ఒకటో భాగం పారిశ్రామికవేత్తలతో మోడీ కున్న సంబంధాలను విశ్లేషించింది. 2002లో గుజరాత్ వీధుల్లో అల్లరిమూకలు విధ్వంసం సృష్టించి 1200 మందికి పైగా ముస్లింలను చంపేయటాన్ని సభ్య సమాజం గర్హించింది. గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వాన్ని, మోడీ నాయకత్వాన్ని తప్పుపట్టింది. ఆనాటి పారిశ్రామిక వర్గాలు కూడా ఆ పరిణా మాలను నిరసించాయి. "భారతదేశ ప్రతిష్ట దిగజారిపోయిందనీ, ఈ మారణకాండకు సిగ్గుపడుతున్నాననీ'' హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ సిఇవో దీపక్ పరేఖ్ అన్నారు. ఎఐఎల్ కంపెనీ సిఎండి సైరస్ గుజార్ ఈ మారణకాండను "ముస్లింలకు ఉనికి లేకుండా చేయడానికి జరిగిన జాతి హననంగా'' వర్ణించారు. ఇన్ఫోసిస్ నారాయణ మూర్తి, విప్రో ప్రేమ్‌జీలు గుజరాత్ హత్యా కాండను తీవ్రంగా నిరసిస్తూ బహిరంగ పత్రికా ప్రకటనలు చేశారు. 2002 సిఐఐ జాతీయ సదస్సులో ధర్మాక్స్ చైర్మన్ అనూ ఆగా ఈ హత్యలను ఖండించింది. రాహుల్ బజాజ్ "గుజరాత్‌కు 2002 పూర్తిగా నష్టదాయక సంవత్సరంగా" ప్రకటించారు.



పుస్తక రచయిత వీరెన్ కె. జోష్

పారిశ్రామిక వర్గాలనుండి వచ్చిన నిరసనలను మోడీ సహించలేకపోయారు. సిఐఐని బెదిరించే వ్యూహాలు పన్నారు. తనకు అనుకూలంగా ఉండే వ్యాపారులు అదాని, ఇంద్రవదన్, కార్సన్ పటేల్ తదితరులతో సిఐఐకి పోటీగా ఆర్ఇఐ అనే వేరే సంస్థను ఏర్పాటు చేశారు. సిఐఐ నుండి గుజరాత్ సభ్యులు ఉపసంహరించుకుంటారని ఆర్ఇఐ ప్రకటించింది. ఈ ఒత్తిడిని సిఐఐ తట్టుకోలేకపోయింది. చివరికి అప్పటి కేంద్రమంత్రి అరుణ్ జైట్లీ సిఐఐ డైరెక్టర్ తరుణ్ దాస్‌తో మోడీకి లిఖిత పూర్వక క్షమాపణ చెప్పించారు. పదవీ విరమణ అనంతరం తరుణ్ దాస్ బిజినెస్ టుడే పత్రికతో మాట్లాడుతూ "తనకూ, తన భార్యకూ మోడీకి క్షమాపణ చెప్పటం ఇష్టంలేదని, కానీ సిఐఐలోని తన భాగస్వామ్య పక్షాలకోసం మనసు చంపుకొని క్షమాపణ చెప్పాల్సి వచ్చిందని" చెప్పారు. ఈ మొత్తం ఉదంతాన్ని విశ్లేషిస్తే మోడీలో నియంతృత్వ పోకడలే కనిపిస్తాయి తప్ప మచ్చుకైనా ప్రజాస్వామ్య స్ఫూర్తి కనిపించదు.

ఈ పుస్తకంలోని రెండో భాగం సాధారణ స్వయం సేవకునిగా ఆర్ఎస్ఎస్‌లో చేరిన మోడీ ఏవిధంగా రాష్ట్రస్థాయి నాయకునిగా ఎదిగిందీ చిత్రించింది. మొదటినుండీ మోడీకి అందరిలో ఒకనిగా ఉండడం ఇష్టముండేది కాదు. ఏ కార్యక్రమంలో పాల్గొన్నా తాను అందరి దృష్టిలో

**“ మోడీ గుజరాత్‌కు ముఖ్యమంత్రి అయిన నేపథ్యానికి సంబంధించి కూడా భిన్న కథనాలున్నాయి. “తను ఊహించని విధంగా ఆశ్చర్యకరంగా వాజ్‌పేయి తనను ఢిల్లీనుండి గుజరాత్ వెళ్ళి ఎన్నికల్లో పోటీచేయ మన్నారని” మోడీ ఒక ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. కానీ ఇతర బి.జె.పి. సీనియర్ నాయకులు మరోలా చెబుతున్నారు. ”**



**మోడీ దోస్త్ పారిశ్రామిక వేత్త అదానీ, మోడీ రాజకీయ శత్రువు బిజెపీ నాయకుడు కేశూభాయ్ పటేల్**

పడాలనుకొనేవాడు. సాధారణంగా ఆర్ఎస్ఎస్ వారు నిశ్శబ్దంగా పనిచేసుకుపోతారు. ప్రచారం కోసం పాకులాడరు. కానీ మోడీ దీనికి భిన్నం. స్వప్రచారం కోసం నియమ నిబంధనలను పక్కనపెట్టి వ్యవహరించేవారు. స్థాయికి మించిన హెూదాను ప్రదర్శించేవారు. ఆర్ఎస్ఎస్ నుండి బిజెపిలోకి వచ్చిన తర్వాత శంకర్ సింఘ్ వాఘేలా, కేశూభాయ్ పటేల్‌ల కింద పనిచేస్తూనే వారిని గురించి కేంద్ర నాయకత్వానికి చాడీలు చెప్పేవారు. ఇద్దరికీ సన్నిహితంగా ఉంటున్నట్లు నటిస్తూనే వారిద్దరి మధ్య స్పర్థలు పెంచేవారు. దీంతో బి.జె.పి. కేంద్ర నాయకత్వం అతను రాష్ట్రంలో వుంటే గొడవలు పెరుగుతున్నాయని గ్రహించి ఢిల్లీలో పనిచేయమని ఆదేశించింది.

మోడీ గుజరాత్‌కు ముఖ్యమంత్రి అయిన నేపథ్యానికి సంబంధించి కూడా భిన్న కథనాలున్నాయి. “తను ఊహించని విధంగా ఆశ్చర్యకరం గా వాజ్‌పేయి తనను ఢిల్లీనుండి గుజరాత్ వెళ్ళి ఎన్నికల్లో పోటీచేయ మన్నారని” మోడీ ఒక ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. కానీ ఇతర బి.జె.పి. సీనియర్ నాయకులు మరోలా చెబుతున్నారు. మోడీ ఢిల్లీలో ఉండి అప్పటి గుజరాత్ ముఖ్యమంత్రి కేశూభాయ్ పటేల్‌ని గురించి నెగటివ్ ప్రచారం చేసేవారు. కేశూభాయ్ పటేల్‌కు వ్యతిరేకంగా కథనాలు రాయటానికి అవసరమైన సమాచారాన్ని పత్రికలకు అందించేవారు. అవుట్‌లుక్ పత్రిక మాజీ ఎడిటర్ వినోద్ మెహతా ఈ విషయాన్ని ధృవీకరించారు. “కేశూభాయ్ పటేల్ పరిపాలన సరిగాలేదని సూచించే పత్రాలతో మోడీ మా కార్యాలయానికొచ్చారు” అని వినోద్ మెహతా మోడీని గురించి వ్యాఖ్యానించారు.

ఈ పుస్తకంలోని నాల్గవ భాగం 2002 గుజరాత్ అల్లర్లలో మోడీ పాత్రను వివరిం చింది. 2002లో గుజరాత్‌లో భజరంగ్ దళ్, వి.హెచ్.పి., ఆర్.ఎస్.ఎస్.ల నాయకత్వంలో అల్లరిమూకలు విధ్వంసం సృష్టిస్తూ వందలాది మంది ముస్లింలను హతమార్చారు. అహ్మదా బాద్‌లో గుల్బర్ సొసైటీలో నాటి ఎంపి ఇషాన్ జాఫ్రీ నివసించేవారు. అల్లర్ల కారణంగా చుట్టుప్రక్కల ముస్లింలు ఇతని ఇంటికి చేరారు. అల్లరిమూకల నుండి తమను రక్షించమని ఇషాన్ జాఫ్రీ వందకు పైగా ఫోన్లు చేశారు. డి.జి.పికీ, పోలీస్ కమిషనర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కేంద్ర హెూంశాఖమంత్రి ఎల్‌కె అద్వానీ, చివరకు రాష్ట్ర ముఖ్యమంత్రి మోడీకీ ఫోన్లు చేసి రక్షించమని జాఫ్రీ వేడుకున్నారు. కానీ గుల్బర్గ్ సొసైటీలో దాక్కున్న వారికి ఎలాంటి సహాయమూ లభించలేదు. అల్లరి మూకలు ఆ ఇంట్లో జొరబడి 70 మందిని పాశవికంగా చంపేశారు. ఈ సంఘటన గురించి తనకేమీ తెలీదని మోడీ చెప్పారు. కానీ దీనిని ఇంటిలిజెన్స్ డిసిపి సంజీవ్ భట్ ఖండించారు. “నేను ముఖ్యమంత్రికి చాలాసార్లు ఫోన్ చేశాను. జాఫ్రీ తదితరులను రక్షించేందుకు వెంటనే చర్యలు తీసుకోవాల్సి వుందని వివరించాను. నేనే కాదు సీనియర్ పోలీస్ అధికారులు కూడా మోడీకి సమాచారం అందించారు” అని సంజయ్‌భట్ చెప్పారు. ఈ పరిణామాలు గమనిస్తే ఈ హత్యాకాండ అంతా మోడీ కనుసన్నల్లోనే జరిందని అర్ధమౌతుంది. గుజరాత్ అల్లర్ల విషయంలో మోడీని తీవ్రంగా విమర్శించిన వాజ్‌పేయి, శాంత కుమార్‌లాంటి నేతలు మోడీ ధాటికి తట్టుకోలేక వెనుకడుగు వేశారు. కేంద్రమంత్రిగా, హిమాచల్‌ప్రదేశ్ ముఖ్యమంత్రిగా పనిచేసిన బి.జె.పి. సీనియర్ నాయకుడు “ఈ పరిణామాలు తనను తీవ్రంగా బాధించాయనీ, చీదరపుట్టించాయనీ” వ్యాఖ్యానించారు. “శవాలతో రాజకీయాలు చేసే వారు హిందువులే కారు... గుజరాత్‌లో రక్తాన్ని పారించినవారు హిందూత్వకు శతృవులు. వీరిని తీవ్రంగా శిక్షించాలి” అని శాంతకుమార్ బహిరంగంగా ప్రకటించారు. అయితే పాపం ఈ మానవత్వ స్పందనకుగాను శాంతకుమార్ మోడీకి లిఖితపూర్వక క్షమాపణలు చెప్పుకోవాల్సి వచ్చింది. మోడీని ముఖ్యమంత్రి పదవినుండి తొలగించాలనుకున్న వాజ్‌పేయి అది తనవల్ల కాదని మిన్నకుండిపోయారు.

రతన్ టాటా నానో కార్ల ఫ్యాక్టరీని పశ్చిమ బెంగాల్ నుండి గుజరాత్‌కు మార్చినప్పుడు వ్యాపారవర్గాలు మోడీని వికాస పురుషునిగా వర్ణించాయి. మిగిలిన రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల రక్షణను, నిరసనలను దృష్టిలో పెట్టుకొని భూసేకరణ విషయంలో అంతవేగంగా స్పందించేవి కావు. కానీ మోడీకి ఇలాంటి ఉదారతలు నచ్చవు. 2003లో కార్సన్ పటేల్‌కు చెందిన నిర్మా కంపెనీకి మోడీ సిమెంట్ ప్లాంట్ కోసం 700 ఎకరాలు కేటాయించారు. మోడీ సిఐఐతో ఘర్షణ పడ్డప్పుడు ఈ కార్సన్ పటేల్ మోడీకి మద్దతుగా ఆర్ఇఇని ఏర్పరచి, సిఐఐని దారిలోకి తేవడానికి సహాయపడ్డారు. అయితే ఈ సిమెంట్ ప్లాంట్ ఒప్పందాన్ని రైతులు వ్యతిరేకించారు. పదకొండు వేలమందికి పైగా రైతులు తమ రక్తంతో సంతకాలు చేసిన వినతి పత్రాన్ని ప్రభుత్వానికి సమర్పిస్తారు. మహువా నుండి అహ్మదాబాద్‌కు 400 కి.మీ. పాదయాత్ర చేశారు. ఈ ఉద్యమానికి స్థానిక బి.జె.పి. శాసనసభ్యుడు డాక్టర్ కనూబాయి కల్సారియా నాయకత్వం వహించాడు. కల్సారియా రైతులకు అభిమాన నాయకునిగా ఎదుగారు. ఈ అసమ్మతిని మోడీ తట్టుకోలేకపోయారు. ఫలితంగా కల్సారియా పార్టీనుండి సస్పెండ్ అయ్యారు. తర్వాత అతనిపై గుర్తు తెలియని గూండాల దాడి జరుగింది.

ఈ పుస్తకంలోని ఏడో భాగం మోడీ స్వంత పార్టీలోని తన రాజకీయ ప్రత్యర్థుల్ని ఎలా అడ్డుతొలగించుకుందీ తెల్పుతుంది. మోడీ నాయకత్వానికి వ్యతిరేకంగా గుజరాత్ బిజెపిలో ముగ్గురు నేతలు మాట్లాడేవారు. వారు

జుడాఫియా, హరేన్ పాండ్యా, సంజయ్‌జోషీలు. ఈ ముగ్గురూ నూరుశాతం ఆర్‌ఎస్‌ఎస్ వాదులే! 2002 అల్లర్ల అనంతరం వి.ఆర్. కృష్ణయ్యర్ నేతృత్వంలో స్వతంత్ర నిజ నిర్ధారణ కమిటీ గుజరాత్ వచ్చినప్పుడు పాండ్యా ఆ కమిటీని కలిసి కొన్ని విషయాలు వెల్లడించారు. గోద్రా రైలు భోగీలు తగలబడిన రాత్రి మోడీ ఇంట్లో ఒక సమావేశం జరిగింది. హిందూత్వ మూకలు జరపబోయే మారణకాండకు పోలీసులు అడ్డురాకుండా చూడాలనే నిర్ణయం ఆ సమావేశంలోనే జరిగింది. ఈ రహస్యాన్ని పాండ్యా కృష్ణయ్యర్ కమిటీకి వెల్లడించారు. అప్పటినుండి పాండ్యా జీవితంలో అనుకోని సంఘటనలు జరుగాయి. తర్వాతి ఎన్నికల్లో అతనికి ఎం.ఎల్.ఎ. టికెట్ నిరాకరించబడింది. చివరికి 2003 మార్చిలో హత్యకు గురయ్యారు. పాకిస్తాన్ ఐఎస్ఐ ఈ హత్యకు కారణమని గుజరాత్ పోలీసులు ప్రకటించారు. కానీ పాండ్యా తండ్రి విఠల్‌భాయి మాత్రం "తన కొడుకును చంపింది మేడీయేనని, ఈ విషయం పార్టీలో చాలామందికి తెలుసని" బహిరంగంగా చెప్పారు.

మోడి మరో రాజకీయ ప్రత్యర్థి సంజయ్ జోషి. ఆయన రాజకీయ జీవితం మరో రకంగా ముగిసింది. ఆయన మహిళలతో అక్రమ సంబంధాలు కలిగివున్నారనేదానికి సాక్ష్యాలంటూ ఒక వీడియో బి.జె.పి. అగ్ర నాయకులకు అందింది. దీనితో జోషి రాజీనామా చేశారు. ఆ తరువాత ఆ వీడియో కల్పితమైనదని తేలింది. అప్పటికే జోషీ తెరవెనక్కు వెళ్ళిపోయారు. అలాగే జుడాపియా కూడా రాజకీయాలనుండి విరమించుకున్నారు. "చంపేస్తానని మోడీ స్వయంగా బెదిరించారని" జుడాఫియా పేర్కొన్నారు.

మోడీ, అతని సన్నిహితుడు అమిత్‌షాలు చేయించిన నకిలీ ఎన్‌కౌంటర్లు, వాటిపై సాగిన విచారణలను కూడా ఈ పుస్తకం చర్చించింది. గుజరాత్ రాష్ట్రానికి లోకాయుక్త నియామకాన్ని ఎనిమిది సంవత్సరాలుగా దాటవేస్తూవస్తున్నారని ఈ పుస్తకంలో చెప్పారు. పెట్టుబడిదారులకు ఇస్తున్న మితిమీరిన రాయితీలను, పన్ను మినహాయింపులను ప్రశ్నిస్తుందనే అనుమానంతోనే మోడీ లోకాయుక్తను నియమించలేదని ఈ పుస్తకం విశ్లేషించింది.

తన పరిశోధనలో భాగంగా మోడీ ఇంటర్వ్యూకోసం తాను తీవ్రంగా ప్రయత్నించాననీ, కానీ ఆయన తనకు ఇంటర్వ్యూ చేసే అవకాశం ఇవ్వలేదని వినోద్ రాశారు. తనకే కాదు స్వతంత్రంగా వాస్తవాలను విశ్లేషించే ఏ జర్నలిస్టుకూ మోడీ ఇంటర్వ్యూ ఇవ్వరని వినోద్

"మోడీ, అతని సన్నిహితుడు అమిత్‌షాలు చేయించిన నకిలీ ఎన్‌కౌంటర్లు, వాటిపై సాగిన విచారణలను కూడా ఈ పుస్తకం చర్చించింది. గుజరాత్ రాష్ట్రానికి లోకాయుక్త నియామకాన్ని ఎనిమిది సంవత్సరాలుగా దాటవేస్తూ వస్తున్నారని ఈ పుస్తకంలో చెప్పారు. పెట్టుబడిదారులకు ఇస్తున్న మితిమీరిన రాయితీలను, పన్ను మినహాయింపులను ప్రశ్నిస్తుందనే అనుమానంతోనే మోడీ లోకాయుక్తను నియమించలేదని ఈ పుస్తకం విశ్లేషించింది."



మోడీకి ఎదురుతిరిగి ఉద్యోగం పోగొట్టుకున్న ఐపిఎస్ అధికారి సంజీవ్ భట్, ప్రాణాలే పోగొట్టుకున్న గుజరాత్ మాజీ హోమ్ మంత్రి హీరేన్ పాండె

రాశారు. 18 నెలలపాటు క్రమం తప్పకుండా ప్రయత్నించిన తర్వాత సిఎన్ఎస్–ఐబిఎన్ కోసం కరణ్ థాపర్‌కు ఇంటర్వ్యూ ఇవ్వడానికి మోడీ ఒప్పుకున్నాడు. కానీ తనకు నచ్చని ప్రశ్నలడుగుతున్నారన్న కారణంతో మోడీ ఆ ఇంటర్వ్యూను మూడు నిమిషాలలోనే అర్ధంతరంగా ముగించి కోపంగా వెళ్ళిపోయాడు.

మైనారిటీ మతస్తులను భయపెట్టి, మెజారిటీ హిందువుల్లో మత ఉద్రేకాలను రెచ్చగొట్టి మోడీ గుజరాత్‌కు తిరుగులేని నాయకునిగా ఎదిగారు. బడావ్యాపారులు, పెట్టుబడిదారీ వర్గాలకు అనుకూలంగా మోడీ పాలన సాగింది. సమకాలీన చరిత్రలో ఏ రాజకీయ నాయకునికీ జరగనంత ప్రచారం మోడీకి జరిగింది. కాంగ్రెస్ పార్టి ప్రజావ్యతిరేక పాలన, ఇతర లౌకికపార్టీల అనైక్యత వల్ల మోడీ దేశానికి ప్రధానమంత్రి అయ్యారు. ఒకవైపు క్రార్పొరేట్ మీడియా మోడీని వీరుడు, శూరుడంటూ ఆకాశా నికెత్తుతున్నది. మరోవైపు మోడీని విమర్శిస్తు న్నందుకుగాను పలువురు వేధింపులకు గురౌతు న్నారు. మోడీకి వ్యతిరేక వ్యాఖ్యలు ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేసినందుకుగానూ గోవాకు చెందిన నేవీ ఇంజనీర్ దేవూ చోదాంకర్ అరెస్టయ్యాడు. బెంగళూరు ఎం.బి.ఎ. విద్యార్థి సయ్యద్ వఖాస్ మోడీ వ్యతిరేక సెల్‌ఫోన్ సందేశానికి గాను అరెస్టయ్యాడు. బాలీవుడ్ స్క్రిప్ట్ రైటర్ అమ్రేష్ మిశ్రా ట్విట్టర్ సందేశం కారణంగా ఉత్తరప్రదేశ్ లో అరెస్టయ్యాడు. ఇట్లాంటి సంఘటనలు అనేకం జరిగాయి. జరుగుతున్నాయి. భారత రాజ్యాంగం ప్రసాదించిన వాక్ స్వాతంత్ర్యపు హక్కు కూడా మోడీ నియంతృత్వం ముందు ఓడిపోయే పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇట్లాంటి పరిస్థితుల్లో వినోద్ కె. జోస్ ఈ పుస్తకాన్ని వెలువరించటం సాహసోపేతమైన విషయం. ప్రముఖ అంతర్జాతీయ ఆంగ్ల పత్రికలు ఈ రచనను "సాహసపూరిత మైనదిగా, ఎక్కడా రాజీపడకుండా చాలా శ్రద్ధగా పరిశోధించి రాసింది"గా వర్ణించాయి.

మోడీ రాజకీయ జీవితాన్ని, అతని వ్యక్తిత్వాన్ని విశ్లేషించిన ఈ పుస్తకాన్ని ప్రతిఒక్కరూ చదవాలి. రాజకీయంగా ఇలాంటి అప్రజాస్వామిక నాయకుడికి వ్యతిరేకంగా పోరాడటమా? లేక మద్దతుగా నిలవడమా? అనేదాన్ని నిర్ధారించుకోవాలి. పాఠకులనుండి ఈ స్పందనను ఆశిస్తూ ఈ పుస్తకం ముగుస్తుంది.

విశ్లేషణ

### ఎన్ఎస్ఎస్ఒ 70వ దఫా సర్వే

# వ్యవసాయేతర అవసరాలకు మళ్లుతున్న సాగుభూమి



రచయిత అఖిలభారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ వర్కింగ్ కమిటీ సభ్యులు

కొండూరి వీరయ్య

**2013-14** సంవత్సరానికి గాను ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వే, ప్రణాళికా సంఘం నివేదికలు, రిజర్వు బ్యాంకు నివేదికలు మారుతున్న గ్రామీణ భారతం రూపురేఖల గురించి కొన్ని నిర్ధారణలు ప్రకటించాయి. ఆర్థిక సర్వేలో గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి వైవిధ్యం విస్తరిస్తోందని నిర్ధారించాయి. ప్రణాళికా సంఘం తన నివేదికలో వ్యవసాయ రంగంపై ఆధారపడే వారి సంఖ్య తగ్గిపోతూ ఉందనీ, గ్రామీణ ప్రాంతాల్లో గణనీయమైన జనాభా వ్యవసాయేతర రంగాలవైపు మళ్ళుతున్నారనీ అంచనా వేసింది. తాజాగా 2014లో రిజర్వు బ్యాంకు విడుదల చేసిన ఒక వర్కింగ్ పేపర్‌లో కూడా ఇటువంటి అంచనాలే ఉన్నాయి. 1999-2000 నాటికి వ్యవసాయరంగంపై ఆధారపడిన వారి సంఖ్య మొత్తం జనాభాలో 59.9 శాతం ఉంటే 2011-12 నాటికి వీరి సంఖ్య 48.9 శాతానికి పడిపోయిందని అంచనా వేసింది. అంటే పన్నెండేళ్ల కాలంలో 11 శాతం జనాభా వ్యవసాయం నుండి వైదొలగి వ్యవసాయేతర ఉపాధి వైపు మళ్ళింది. ఈ కాలంలో ఉపాధి కోసం భవన నిర్మాణ రంగంపై ఆధారపడిన వారి సంఖ్య 4.6 శాతం నుండి 10.6 శాతానికి పెరిగిందని కూడా రిజర్వు బ్యాంకు పత్రం విశ్లేషించింది. తద్వారా గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ రంగం పై ఆధారపడే జనాభా తగ్గిపోయిందని, వ్యవసాయేతర రంగాలపై ఆధారపడే జనాభా పెరిగిందన్న వాదన ముందుకు తెచ్చింది. వ్యవసాయేతర ఉపాధి అవకాశాలు పెరగటంతో పాటు గ్రామీణ ప్రజల ఆదాయాలు కూడా గణనీయంగా పెరిగాయని అందువల్లనే భారతదేశంలో ఆహారపు అలవాట్లు మారిపోయాయని మరికొందరు వాదిస్తున్నారు. అంతర్జాతీయంగా ఆహారోత్పత్తుల ధరలు పెరగటానికి భారతదేశంలో పెరిగిన ఆదాయాలు, మారిన ఆహారపు అలవాట్లే కారణం అని జార్జి బుష్ మొదలు ఒబామా వరకూ వల్లె వేశారు. ఈ అంచనాల ఆధారంగా కొందరు విశ్లేషకులు తమ విశ్లేషణలకు కొత్త కోణాలు ఆపాదిస్తూ వచ్చారు. కానీ గ్రామీణ భారతంలో వాస్తవం ఏమిటి? వ్యవసాయ రంగంలో ఉపాధి అవకాశాలు తగ్గినమాట నిజమే. కానీ వ్యవసాయ రంగంపై ఆధారపడే జనాభా కూడా తదనుగుణంగా తగ్గిందా? గ్రామీణ ప్రాంతంలో వ్యవసాయేతర రంగాలనే ప్రధాన జీవనాధారంగా ఎంచుకున్న జనాభా ఎంత శాతం ఉన్నారు అన్న ప్రశ్నలకు ఎన్ఎస్ఎస్ఒ వ్యవసాయక కుటుంబాల స్థితిగతులపై నిర్వహించిన సర్వే నిర్ధారణలు కొంతమేర సమాధానమిచ్చేవిగా ఉన్నాయి. ఈ సర్వేలో వెల్లడైన వాస్తవాలు కేవలం వ్యవసాయేతర ఆదాయాల గురించే కాక వ్యవసాయక ఆదాయాల్లో వస్తున్న మార్పులను కూడా గుర్తించే ప్రయత్నం చేశాయి. గ్రామీణ ప్రాంతంలో ఉపాధి అవకాశాల పొందికను అధ్యయనం చేయటానికి ఈ నివేదిక విలువైన సమాచారాన్ని అందిస్తుంది.

### సర్వే స్వరూప స్వభావాలు, పరిమితులు

2012-13 వ్యవసాయ సంవత్సరానికి గాను ఈ సర్వే జరిగింది. ప్రతి పది సంవత్సరాలకొకసారి నిర్వహించే సర్వేలో భాగంగానే ఈ సర్వే జరిగినా పదేళ్ల నాటి పరిస్థితితో పోల్చటానికి కొన్ని పరిమితులు ఉన్నాయి. ఈ సర్వే నివేదిక వెల్లడించిన వివరాల ప్రకారం ఇది కేవలం వ్యవసాయక కుటుంబాల స్థితిగతులపై సర్వే మాత్రమే. మొత్తంగా గ్రామీణ ప్రాంతంలో ఉన్న రైతాంగాన్ని కేంద్రంగా చేసుకుని ఈ సర్వే జరిగింది. ప్రధానంగా పంటల ద్వారా వచ్చే ఆదాయాలను, పంటలకయ్యే వ్యయాలను, పంటల ఆధారిత ఆదాయాలను, ఉపాధి అవకాశాలను పరిశీలించటంతో పాటు రైతాంగ కుటుంబాల్లో వ్యవసాయేతర ఆదాయాల తీరుతెన్నులను కూడా పరిశీలించే ప్రయత్నం ఈ సర్వేలో జరిగింది. మరో ముఖ్యమైన విషయమేమిటంటే ఈ సర్వే సందర్భంగా కౌలుదార్ల గురించి కూడా నిర్దిష్ట అంచనాకు రావటానికి ప్రయత్నం జరిగింది. ప్రధానంగా పంటల ప్రాతిపదికన జరిగిన సర్వే కనుక మొదటి పంట కాలంలోనూ, రెండో పంట కాలంలోనూ ఎంపిక చేసిన గ్రామాల్లో ఎంపిక చేసిన కుటుంబాలను ఎన్ఎస్ఎస్ఒ సిబ్బంది అధ్యయనం చేశారు. మొత్తంగా దేశవ్యాప్తంగా 4529 గ్రామాల్లో మొదటి దఫా 35,604 కుటుంబాలను, రెండో దఫా 35,337 కుటుంబాల సర్వే జరిగింది. ఆంధ్రప్రదేశ్‌లో 149 గ్రామాల్లో, తెలంగాణాలో 97 గ్రామాల్లో ఈ సర్వే జరిగింది. ఆంధ్రప్రదేశ్‌లో మొదటి దఫా 1184 కుటుంబాలను, రెండో దఫా 1167 కుటుంబాలను అధ్యయనం చేయగా, తెలంగాణాలో తొలి ధఫా 767 కుటుంబాలను, రెండో దఫా 763 కుటుంబాలను అధ్యయనం చేశారు. సర్వే నివేదికలో చెప్పిన విధంగా కేవలం గ్రామీణ ప్రాంతాల్లోనే ఈ అధ్యయనం జరిగింది. రైతాంగం కుటుంబాలకే ఈ అధ్యయనం పరిమితం అయ్యింది. అంటే ఈ అధ్యయనంలో వ్యవసాయ కార్మికులనుగానీ, చేతివృత్తిదారులను కానీ, గ్రామీణ ప్రాంతాల్లోని భూమి లేని పేదలను కానీ పరిశీలనలోకి తీసుకోలేదు. అంతేకాదు. ఈ సర్వే నమూనా చాలా పరిమితంగా ఉంది. మొత్తం 9 కోట్ల కుటుంబాలకు గాను కేవలం 35వేల కుటుంబాలను అధ్యయనం చేసి అంచనాలకు రావటం అంటే నమూనా సైజు మారితే కొన్ని నిర్ధారణలు కూడా మారే అవకాశం ఉంది. అయినప్పటికీ ఈ అంచనాల్లో వెల్లడించిన వివరాలు ఆసక్తికరంగానూ, పరిశీలించదగ్గవిగానూ ఉన్నాయి. ఈ సర్వేకు ఉన్న మరో ముఖ్యమైన పరిమితి వ్యవసాయక కుటుంబానికి ఎన్ఎస్ఎస్ఒ ఇచ్చిన నిర్వచనం. ఈ నిర్వచనం ప్రకారం వ్యవసాయక కుటుంబంగా పరిగణించబడాలంటే సదరు కుటుంబానికి స్వంత భూమి ఉండాల్సిన అవసరం లేదు. కేవలం సంవత్సరం మొత్తంలో రు.3000

ఆదాయం భూమి ద్వారా సంపాదిస్తుంటే అటువంటి కుటుంబాలను అన్నింటినీ ఈ సర్వేలో వ్యవసాయక కుటుంబాలుగా పరిగణించబడ్డాయి.

**విశ్లేషణ**

2011 జనాభా లెక్కల ప్రకారం దేశంలో 11 కోట్ల 87 లక్షల మంది రైతులు ఉంటే ఎన్ఎస్ఎస్ఓ సర్వే అంచనాల ప్రకారం 9 కోట్ల 20 లక్షల మంది రైతాంగం ఉన్నారు. అంటే 2001తో పోల్చినపుడు 2 కోట్ల 67 లక్షల మంది సేద్యం వదిలేశారు. ఇది మొత్తం గ్రామీణ ప్రాంతంలోని కుటుంబాల్లో 57.8 శాతంతో సమానం. అంటే గ్రామీణ జనాభాలో 57.8 శాతం జనాభాకు సేద్యమే ప్రధాన జీవనాధారంగా ఉంది. అంతేకాదు. ఈ సర్వే వెలుగులోకి తెచ్చిన మరో ముఖ్యమైన అంశం మారుతున్న భూవినియోగం. 2002-2003లో 59వ దఫా ఎస్ఎస్ఎస్ఓ సర్వే అంచనా మేరకు 10 కోట్ల 72 లక్షల 28 వేల హెక్టార్ల సేద్యపు భూమి ఉంటే 2012-2013లో జరిగిన తాజా సర్వే నాటికి 9 కోట్ల 23లక్షల 69 వేల హెక్టార్లకు పడిపోయింది. అంటే ఈ దశాబ్దకాలంలో 1,48,59,00 హెక్టార్ల సాగు భూమి వ్యవసాయేతర అవసరాలకు మళ్ళించబడింది. ఎకరానికి కనీసం వంద పనిదినాల ఉపాధి కలుగుతుందని అంచనా వేస్తే ఈ పదేళ్ల కాలంలో మారిన భూ వినియోగం వలన సంవత్సరానికి 14.85 కోట్ల పని దినాల చొప్పున పదేళ్లలో 148 కోట్ల 59 లక్షల పనిదినాలు నష్టపోయాయి. ఈ సర్వే ముందుకు తెచ్చిన మరో కీలక అంశం కూడా ఉంది. అదేమంటే కుంచించుకుపోతున్న సగటు సాగుభూమి కమతాల విస్తీర్ణం. 2002 నాటికి సగటున ఒక్కో కుటుంబానికి 0.725 హెక్టార్ల భూమి ఉంటే 2012 నాటికి అది 0.592 హెక్టార్లకు పడిపోయింది. అంతేకాదు. సన్నకారు రైతాంగం 2002 నాటికి గ్రామీణ జనాభాలో 69.63 శాతం కుటుంబాలు ఉంటే 2012 నాటికి వీరి సంఖ్య 75.42 శాతానికి పెరిగింది. భూస్వామ్య కుటుంబాల శాతంలో మాత్రం పెద్దగా మార్పులు లేకుండా ఉండటం గమనార్హం.

పైన చెప్పుకున్నట్లు 2013 వ్యవసాయక సంవత్సరం నాటికి దేశంలో 9,23,68,578 హెక్టార్ల సాగు భూమి ఉంటే ఆంధ్రప్రదేశ్‌లో సాగు భూమి విస్తీర్ణం 41, 57, 987 హెక్టార్లు, తెలంగాణాలో సాగుభూమి 34,77,711 హెక్టార్లుగా ఉంది. దేశవ్యాప్తంగా 15, 61, 44, 200గ్రామీణ కుటుంబాలు ఉంటే ఆంధ్రప్రదేశ్‌లో 86,76,300 కుటుంబాలు, తెలంగాణలో 49,30,900 కుటుంబాలు ఉన్నాయి. వీరిలో ఆంధ్రప్రదేశ్‌లో 35,96, 800 కుటుంబాలు ( రాష్ట్రంలోని మొత్తం గ్రామీణ కుటుంబాల్లో 41.5 శాతం) తెలంగాణలో 25,38,900 (51.5 శాతం) భూమి కలిగిన కుటుంబాలుగా ఉన్నాయి.

> **❝ 2013 వ్యవసాయక సంవత్సరం నాటికి దేశంలో 9,23,68,578 హెక్టార్ల సాగు భూమి ఉంటే ఆంధ్రప్రదేశ్‌లో సాగు భూమి విస్తీర్ణం 41, 57, 987 హెక్టార్లు, తెలంగాణాలో సాగుభూమి 34,77,711 హెక్టార్లుగా ఉంది. దేశవ్యాప్తంగా 15, 61, 44, 200గ్రామీణ కుటుంబాలు ఉంటే ఆంధ్రప్రదేశ్‌లో 86,76,300 కుటుంబాలు, తెలంగాణలో 49,30,900 కుటుంబాలు ఉన్నాయి. ❞**

ఈ సర్వే ద్వారా మరో మూడు అంశాలను అధ్యయనం చేయటానికి ప్రయత్నం చేయవచ్చు. మొదటిది వ్యవసాయక కుటుంబాల్లో సామాజిక పొందిక, రెండోది ఆయా కుటుంబాల ఆదాయ వనరులు, వ్యవసాయ రుణాల పరిస్థితి. ముందుగా వ్యవసాయక కుటుంబాల్లో సామాజిక పొందిక గురించి చూద్దాం.

దేశంలోని మొత్తం వ్యవసాయక కుటుంబాల్లో 45 శాతం వెనకబడిన తరగతులకు చెందిన వారే. మొత్తం రైతాంగంలో ఆదివాసీలు14 శాతం, ఎస్సీలు 17 శాతం ఉన్నారు. మిగిలిన 25 శాతం అగ్రవర్ణాలకు చెందిన రైతాంగంగా ఉన్నారని ఎన్ఎస్ఎస్ఓ అంచనా వేసింది. మొత్తం గ్రామీణ జనాభాతో పోల్చి చూస్తే వాస్తవాలు మరింత స్పష్టంగా కనిపిస్తాయి. గ్రామీణ కుటుంబాలతో పోల్చినపుడు 7.76 ఆదివాసీ కుటుంబాలకు, 9.39 శాతం దళిత కుటుంబాలకు, 26 శాతం వెనుకబడిన తరగతుల కుటుంబాలకు, 14.36 శాతం అగ్రవర్ణాలకు స్వంత భూమి ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో 3.18 శాతం ఆదివాసీ కుటుంబాలకు, 8.74 శాతం దళిత కుటుంబాలకు, 17.75 శాతం వెనకబడిన తరగతుల కుటుంబాలకు స్వంత భూములున్నాయి. తెలంగాణలో వరుసగా 8.30 శాతం ఆదివాసీ కుటుంబాలకు, 8.06 శాతం దళిత కుటుంబాలకు, 28.73 శాతం వెనకబడిన తరగతుల కుటుంబాలకు భూములున్నాయి. మొత్తం గ్రామీణ కుటుంబాలతో పోల్చి చూసినపుడు భూమి కలిగిన కుటుంబాల శాతం జాతీయ స్థాయిలో 58.12 శాతానికి మించటం లేదు. అంటే మిగిలిన 41.88 శాతం భూమి లేని వ్యవసాయ కార్మికులు, చేతివృత్తిదారులు, ఇతర వృత్తులవారు, కేవలం శ్రమనే నమ్ముకుని ఉన్నారని స్పష్టమవుతుంది. దేశవ్యాప్తంగా కౌలుకు సాగు చేసే కుటుంబాలు 3,17,58,500 ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో స్వంత కమతాలు సాగు చేసే కుటుంబాలు 1,67,09,500 ఉండగా, కౌలు సాగు చేస్తున్న కుటుంబాలు 56,86,500 ఉన్నాయి. అదేవిధంగా తెలంగాణ ప్రాంతంలో స్వంత కమతాల రైతులు 99,35,700 మంది కాగా కౌలు రైతులు 7,76,800 ఉన్నారు.

ఎన్ఎస్ఎస్ఓ అంచనాల్లో కొట్టొచ్చినట్టు కనిపించే మరో అంశం భూ కమతాల యాజమాన్యం, నెలసరి తలసరి వినిమయానికి సంబంధించిన అంశం. నెలసరి తలసరి వినియమం లెక్కించే విషయంలో జనాభాను పది వంతులుగా విభజిస్తారు. దీన్నే దశమాంకం అంటారు. ఏ దశమాంకంలో ఏ సామాజిక తరగతికి చెందిన జనాభా ఎంత శాతం ఉన్నారు అన్న విశ్లేషణ ఆర్థిక అంతరాలు, సామాజిక అంతరాల మధ్య ఉన్న సంబంధాన్ని తెలియచేస్తుంది. ఈ విధంగా చూసుకున్నపుడు ఆదివాసీ కుటుంబాలు అట్టడుగున 30 శాతానికి పైగా ఉంటే ఆర్థికంగా పై తరగతుల్లో కేవలం ఆరు శాతం మాత్రమే ఉన్నారు. అదేవిధంగా దళితులు అట్టడుగున 40 శాతానికి పైగా ఉంటే అధికాదాయవర్గాల్లో కేవలం 14 శాతం మాత్రమే ఉన్నారు. వెనకబడిన తరగతులకు చెందిన కుటుంబాలు మాత్రం అన్ని ఆదాయ వర్గాల మధ్య సమానంగా పంపిణీ అయి ఉన్నారు. అగ్రవర్ణాల విషయంలో అధికాదాయం కలిగి వ్యవసాయక కుటుంబాలు 40 శాతానికి పైగా ఉంటే అల్పాదాయం కలిగిన వ్యవసాయక కుటుంబాలు 20 శాతం వరకూ ఉన్నాయి. నాల్గు హెక్టార్లకు మించి భూమి కలిగిన కుటుంబాల్లో దళిత, ఆదివాసీ కుటుంబాలు ఐదు శాతం మాత్రమే ఉండగా, 40 శాతం వరకు వెనకబడిన తరగతులకు చెందిన వారు, మరో 41 శాతం వరకు అగ్రవర్ణాలకు చెందిన వారు

**❝ ఆంధ్రప్రదేశ్‌లోను, తెలంగాణలోనూ మొత్తం గ్రామీణ కుటుంబాల్లో భూమి కలిగిన కుటుంబాల శాతం జాతీయ సగటు కంటే తక్కువగా ఉండటాన్ని గమనించవచ్చు. సామాజిక తరగతుల విషయంలోనూ అదేవిషయం కనిపిస్తోంది. తెలంగాణలో వెనకబడిన తరగతులకు చెందిన కుటుంబాల్లో భూమి కలిగి ఉన్న కుటుంబాల శాతం జాతీయ సగటు కంటే ఎక్కువగా ఉండటం ప్రత్యేకమైన లక్షణంగా చెప్పుకోవచ్చు. ❞**

ఉన్నారు. హెక్టారుకు లోబడి భూమి కలిగిన వారిలో 33 శాతం ఆదివాసీ కుటుంబాలు, 30 శాతం దళిత కుటుంబాలు, 40 శాతం వెనకబడిన తరగతులకు చెందినవారు, మిగిలిన వారు అగ్రవర్ణాలకు చెందినవారు ఉన్నారు. భూకమతాల యాజమాన్యం, తలసరి, నెలసరి వినియమం మధ్య పోల్చి చూసినపుడు రెండింటి మధ్య నిష్పత్తి సమాంతరంగా ఉంది. అంటే తక్కువ భూమి కలిగిన కుటుంబాలు తక్కువ మొత్తంలో వినిమయ అవసరాలకు వ్యయం చేస్తుంటే ఎక్కువ భూమి కలిగిన వారు ఎక్కువగా వెచ్చిస్తున్నారు. ఈ మేరకు ఆయా కుటుంబాలకు భూమి ద్వారా వచ్చే ఆదాయాల్లో ఉన్న వ్యత్యాసాలను కూడా ఈ వివరణ మనకు తెలిచేస్తుంది.

ఆంధ్రప్రదేశ్‌లోను, తెలంగాణలోనూ మొత్తం గ్రామీణ కుటుంబాల్లో భూమి కలిగిన కుటుంబాల శాతం జాతీయ సగటు కంటే తక్కువగా ఉండటాన్ని గమనించవచ్చు. సామాజిక తరగతుల విషయంలోనూ అదేవిషయం కనిపిస్తోంది. తెలంగాణలో వెనకబడిన తరగతులకు చెందిన కుటుంబాల్లో భూమి కలిగి ఉన్న కుటుంబాల శాతం జాతీయ సగటు కంటే ఎక్కువగా ఉండటం ప్రత్యేకమైన లక్షణంగా చెప్పుకోవచ్చు. తెలంగాణ రాష్ట్రంలో గ్రామీణ కుటుంబాల్లో భూమి కలిగిన వారు 51.55 శాతం ఉండగా ఆంధ్రప్రదేశ్‌లో ఇది మరింత తక్కువగా 41.45 శాతంగా ఉంది. ఈ కాలంలో తెలంగాణ కంటే ఆంధ్రప్రదేశ్‌లో ప్రత్యేక ఆర్థిక మండలాలు, రొయ్యల సాగు, రియల్ ఎస్టేట్, కారిడార్లు రూపంలో ఎక్కువ సాగు భూమి వ్యవసాయేతర అవసరాలకు మళ్ళించిన విషయాన్ని ఎన్ఎస్ఎస్ఒ సర్వే కూడా నిర్ధారిస్తోంది. అందువల్లనే మొత్తం గ్రామీణ జనాభాలో భూమి కలిగిన జనాభా శాతం జాతీయ సగటు కంటే తక్కువగా ఉందన్న విషయాన్ని గమనించాలి. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని నిమిత్తం మరో లక్షల ఎకరాలు సేకరిస్తున్నారు. కృష్ణానదికి రెండు వైపుల విస్తరించనున్న రాజధాని నిర్మాణాలతో గుంటూరు, కృష్ణా, పశ్చిమగోదావరి జిల్లాల్లో భూ వినియోగ స్వభావంలో విపరీతమైన మార్పులు రానున్నాయి. మొత్తం రాష్ట్రంలోని సాగుభూమిలో 23 శాతానికి పైగా ఈ మూడు జిల్లాల్లోనే కేంద్రీకృతమై ఉంది. అందులో కూడా రెండు పంటలు పండే భూమి 60 శాతానికి పైగా ఉందన్న విషయాన్ని గమనిస్తే రానున్న కాలంలో రాష్ట్రంలో భూ సమస్య పతాకస్థాయికి చేరటమే కాక, భూ యాజమాన్యంలో కూడా విపరీతమైన మార్పులు చోటు చేసుకోనున్నాయన్న విషయం స్పష్టమవుతోంది. శివుడి మెడకు చుట్టుకున్న నాగుబాములా పల్లె సీమలను చుట్టుముట్టిన ప్రత్యేక ఆర్థిక మండలాలు, ఇతర ప్రైవేటు పరిశ్రమలు, వాణిజ్య సముదాయాలు, రిసార్ట్స్, హొటళ్లు తదితరాలను ఈ సర్వేలో పరిగణనలోకి తీసుకోలేదు. కాబట్టి వ్యక్తిగత భూ యాజమాన్యం, సంస్థాగత భూ యాజమాన్యాల మధ్య తేడాలను విశ్లేషించటం సాధ్యం కావటం లేదు.

ఈ సర్వే మనకు విశదపరుస్తున్న మరో ముఖ్యమైన అంశం వ్యవసాయక కుటుంబాల్లో ఆదాయ వనరులకు సంబంధించిన అంశం. సర్వేలో ప్రధానంగా సేద్యం, పశుపోషణ, ఇతర వ్యవసాయపు పనులు, వ్యవసాయేతర పనులు, శ్రమ వేతనాలు, ఇతరములు అని వర్గీకరించారు. ఇందులో కూడా కుటుంబానికి ఏ వనరు ద్వారా మొత్తం ఆదాయంలో ఎక్కువ భాగం సమకూరుతుందో దాన్నే కుటుంబ ప్రధాన ఆదాయ వనరుగా పరిగణించారు. ఈ ప్రమాణాల ప్రకారం మొత్తం సర్వే చేసిన కుటుంబాల్లో 63.5 శాతం మందికి సేద్యమే ప్రధాన ఆదాయ వనరుగా ఉన్నట్లు ఎస్ఎస్ఎస్ఒ అంచనా వేసింది. ప్రణాళికా సంఘం, రిజర్వు బ్యాంకు, ప్రభుత్వ ఆర్థిక సర్వేల్లో పేర్కొన్నదాని కంటే దాదాపు పదిశాతం అదనపు జనాభాకు వ్యవసాయమే ప్రధాన ఆర్థిక వనరుగా ఉందని ఈ సర్వే లెక్కలు తెలియచేస్తున్నాయి. అయితే ప్రభుత్వం విడుదల చేసిన సర్వే నిర్ధారణల్లో మాత్రం 92.6 శాతం జనాభా భూమి కలిగి ఉన్నారని ప్రకటించింది. స్థూలంగా ఆకర్షణీయమైన చిత్రాన్ని ప్రజల ముందుంచటానికే వ్యవసాయక కుటుంబం అంటే నిర్వచనాన్ని మార్చేసింది. 2002లో జరిగిన సర్వేలో భూమిపై యాజమాన్యపు హక్కు ఉండి దాన్ని సాగు చేసుకుని తద్వారా జీవనోపాధి పొందుతున్న కుటుంబాలను వ్యవసాయక కుటుంబాలుగా పరిగణిస్తే 2012-2013 సర్వేలో భూమిపై యాజమాన్యంతో సంబంధం లేకుండానే వ్యవసాయ కుటుంబాలను నిర్ధారించే ప్రయత్నం చేసింది. ఈ విధంగా వ్యవసాయక కుటుంబాల ప్రాతిపదికను మార్చేయటం ద్వారా వాస్తవాలకు భిన్నంగా 92.6 శాతానికి భూమి ఉన్నట్లు చూపించే ప్రయత్నం చేసింది ప్రభుత్వం. ఈ తప్పుడు లెక్కల పర్యవసానంగా భూ సంస్కరణలు, భూ పంపిణీ అన్న అంశాలు ప్రభుత్వ ఎజెండాలో ఉండబోవు. ప్రభుత్వపు లెక్కలు అధ్యయనం చేసేటప్పుడు లెనిన్ చెప్పిన సూత్రం, ఏ మాటల వెనక ఏ వర్గ ప్రయోజనం దాగి ఉందో అన్న సూత్రాన్ని గమనంలోకి తీసుకోకపోతే విశ్లేషకులు బోల్తా పడే ప్రమాదం ఉంది. ఈ విశ్లేషకులే ప్రజాభిప్రాయాన్ని మల్చే సాధనాలుగా ఉన్నారు. అందువల్ల ప్రభుత్వ గణాంకాలు గురించిన రచనలు, విశ్లేషణలు చదివేటప్పుడు, పరిశీలించేటపుడు ఎవరు విశ్లేషించారు, వారి వర్గ ప్రయోజనం ఏమిటి అన్న కోణంలో కూడా పరిశీలిస్తే ఫలానా విశ్లేషకుని రచనలు నిష్పా

## 'మార్క్సిస్టు'కు మీ సందేహాలు రాయండి!

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రికలో సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రతినెలా పాఠకుల సందేహాలకు సమాధానాలిస్తున్న సంగతి మీకు తెలుసు. ప్రస్తుత అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై మీ సందేహాలను నివృత్తి చేసుకునేందుకు ప్రశ్నలను రాసి పంపండి! ప్రతినెలా 20వ తేదీలోపు మీ ప్రశ్నలు మాకు చేరితే తదుపరి సంచికలో రాఘవులు సమాధానాలు లభిస్తాయి.

మీ ప్రశ్నలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్,**
'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక,
ప్రజాశక్తి ప్రెస్, గవర్నరుపేట, విజయవాడ-2

క్షికంగా ఉన్నాయి, ఫలానా విశ్లేషకుడి రచనలు నిర్ధారిత అభిప్రాయాలను వెలిబుచ్చుతున్నాయి అని తెలుసుకోవటం తేలికవుతుంది. ఈ పరిమితిని దృష్టిలో పెట్టుకుని కుటుంబ ఆదాయ వనరులకు సంబంధించిన ఎన్ఎస్ఎస్ఒ లెక్కలు పరిశీలిద్దాం.

> **"ఈ సర్వే ముందుకు తెస్తున్న మరో ముఖ్యమైన అంశం నెలసరి కుటుంబ ఆదాయాలకు సంబంధించినది. సగటు నెలసరి కుటుంబ ఆదాయం అన్ని తరగతుల రైతాంగానికి రు.6223 గా ఉందని ఎన్ఎస్ఎస్ఒ సర్వే అంచనా వేసింది. అంటే కుటుంబానికి సగటున నలుగురు సభ్యులు ఉన్నారనుకుంటే సగటున రోజుకు మనిషికి 51 రూపాయాల ఆదాయం. వాస్తవిక ఆదాయాలు మార్కెట్ ధరలను అందుకునే స్థితిలో లేవని ఈ లెక్కలు స్పష్టం చేస్తున్నాయి."**

కుటుంబ ఆదాయాలు లెక్కించేటప్పుడు పైన చెప్పుకున్నట్లు 92.6 శాతం జనాభా వ్యవసాయంలో ఉన్నట్లు అంచనా వేసింది. కానీ అందులో 63.5 శాతం మాత్రమే వ్యవసాయం ద్వారా ప్రధాన ఆదాయం సమకూరుతున్నట్లు పేర్కొనటాన్ని గమనిస్తే భూయాజమాన్య అంచనాల్లో ఉన్న లోపం స్పష్టమవుతుంది. ఈ వివరాల ప్రకారమే ప్రభుత్వ అంచనాల్లోనే భూమి లేని మరో 30 శాతం మందిని భూమి ఉన్న వారి జాబితాలో చేర్చింది. తద్వారా కాగితాల్లో 30 శాతం మందిని భూ యజమానులుగా మార్చేసింది. అందువల్లనే వ్యవసాయంలో ఉన్న కుటుంబాలకు, వ్యవసాయమే ప్రధాన ఆదాయంగా లెక్కించిన కుటుంబాలకు మధ్య పొంతన కుదరని పరిస్థితి తలెత్తుతున్నది. అందువల్ల ఈ విశ్లేషణకు వ్యవసాయమే ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న వారిని ప్రమాణంగా తీసుకుని లెక్కిస్తే ఆంధ్రప్రదేశ్‌లో 59.2 శాతం, తెలంగాణాలో 86.8 శాతం మంది ఉన్నారు. లెక్కకు వ్యవసాయక కుటుంబంగానే ఉన్నా శారీరక శ్రమే ప్రధాన జీవనోపాధిగా ఉన్న కుటుంబాలు ఆంధ్రప్రదేశ్‌లో 28 శాతం, తెలంగాణలో 6 శాతం ఉన్నారు. వ్యవసాయేతర ఉపాధి ప్రధాన జీవనోపాధిగా ఉన్న కుటుంబాలు దేశవ్యాప్తంగా 4 శాతంగా ఉండగా ఆంధ్రప్రదేశ్‌లో 3.5 శాతం, తెలంగాణలో 1.8 శాతం మాత్రమే ఉన్నారు. ఈ సర్వే 2012–2013 ఆర్థిక సంవత్సరానికి జరిగిన సర్వే అన్న విషయాన్ని గమనంలో ఉంచుకుంటే ఒక విషయం మనకు స్పష్టమవుతోంది. గత దశాబ్దకాలంలో భారత ఆర్థిక వ్యవస్థ సగటున తొమ్మిది శాతానికి దగ్గరగా వృద్ధి రేటు సాధించినా వ్యవసాయ రంగంపై ఆధారపడే జనాభాను, వ్యవసాయంలో ఉపాధి వెతుక్కునే జనాభా శాతాన్ని తగ్గించలేకపోయింది. వ్యవసాయేతర రంగంలో ఉపాధి అవకాశాలు పెద్దఎత్తున అందుబాటులోకి వచ్చాయన్న వాదనను కూడా ఈ సర్వే కొట్టి పారేస్తోంది.

ఈ సర్వే ముందుకు తెస్తున్న మరో ముఖ్యమైన అంశం నెలసరి కుటుంబ ఆదాయాలకు సంబంధించినది. సగటు నెలసరి కుటుంబ ఆదాయం అన్ని తరగతుల రైతాంగానికి రు.6223 గా ఉందని ఎన్ఎస్ఎస్ఒ సర్వే అంచనా వేసింది. అంటే కుటుంబానికి సగటున నలుగురు సభ్యులు ఉన్నారనుకుంటే సగటున రోజుకు మనిషికి 51 రూపాయాల ఆదాయం. వాస్తవిక ఆదాయాలు మార్కెట్ ధరలను అందుకునే స్థితిలో లేవని ఈ లెక్కలు స్పష్టం చేస్తున్నాయి. మనిషి జీవించటానికి తిండి ఒక్కటే ఉంటే చాలదు. నిలువ నీడ, బట్టలు, విద్య, వైద్యం, ఇతర సామాజిక అవసరాల నిమిత్తం అయ్యే ఖర్చులు కలుపుకుంటే ఈ ఆదాయం ఏ మూలకు సరిపోదని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.

అంతేకాదు. నామమాత్రపు భూమి కలిగి భూ యజమానుల తరగతిలో అట్టడుగున ఉన్న 10 శాతం జనాభాలో సగానికి పైగా కుటుంబాలకు శారీరక శ్రమే ప్రధాన జీవనోపాధిగా ఉంది అన్న విషయాన్ని కూడా ఈ సర్వే అంచనాలు స్పష్టం చేస్తున్నాయి. స్వంత భూమి పరిమాణం, ప్రధాన జీవనోపాధి వనరు గురించిన వివరాలు ఇలా ఉన్నాయి. 0.01 హెక్టారుకు కంటే తక్కువ భూమి కలిగిన కుటుంబాలు సంపాదించే ఆదాయంలో 10.8 శాతం ఆదాయం వ్యవసాయేతర పనుల ద్వారానూ, 56.4 శాతం ఆదాయం శ్రమ వేతనాల ద్వారానూ, 22.9 శాతం ఆదాయం పశుపోషణ ద్వారానూ వస్తోంది. 0.01 – 0.40 హెక్టార్ల మధ్య భూమి కలిగిన కుటుంబాలకు వచ్చే ఆదాయంలో 42.1 శాతం సేద్యం ద్వారా, 4.8 శాతం ఆదాయం పశుపోషణ ద్వారా, 7.5 శాతం ఆదాయం వ్యవసాయేతర పనుల ద్వారా, 35.2 శాతం ఆదాయం వేతన శ్రమ ద్వారా సమకూరుతుంది. ఈ విధంగా భూ యాజమాన్యం పెరిగే కొద్దీ సేద్యం ద్వారా వచ్చే ఆదాయం శాతం పెరుగుతూ వచ్చింది. వేతన శ్రమ ఆదాయం పాళ్ళు తగ్గుతూ వచ్చాయి. ఈ విధంగా చూసుకున్నపుడు శ్రమ ప్రాతిపదికన జరిగే ఈ విభజనలో మొదటి మూడు తరగతులకు చెందిన కుటుంబాల్లో వ్యవసాయంలో వేతన శ్రమ ద్వారా వచ్చే ఆదాయం గణనీయమైన పాళ్ళలో ఉంది. మధ్యతరగతి రైతులు అనబడే మిగిలిన మూడు తరగతుల రైతాంగానికి వచ్చే ఆదాయంలో వేతన శ్రమ ద్వారా వచ్చే ఆదాయం పాళ్ళు నామమాత్రంగా ఉన్నాయి. ఈ పట్టిక శ్రమ ప్రాతిపదికన జరిగే అధ్యయనాలకు ముఖ్యమైన వనరుగా ఉంటుంది. స్థూలంగా చూసినపుడు ఎన్ఎస్ఎస్ఒ సర్వే వివరాలు భూమి కలిగిన కుటుంబాలను అంచనా వేయటం వంటి అంశాల్లో తిమ్మిని బమ్మిని చేయబూనుకున్నా, మిగిలిన వివరాల్లో వాస్తవాలకు దగ్గరగా ఉండేలా ఉంది. ఈ సర్వేలో వెల్లడైన వివరాలకు తోడు గ్రామీణ ప్రాంతంలో వేతన శ్రమపై ఆధారపడ్డ మిగిలిన 41 శాతం జనాభాను కూడా కలుపుకుంటే నేటికీ గ్రామీణ ప్రాంతంలో వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ వృత్తులు, వ్యవసాయంలో వేతన శ్రమ ప్రధానమైన జీవనోపాధి వనరులుగా ఉన్నాయన్న విషయాన్ని కాదనలేని పరిస్థితి కనిపిస్తోంది. చివరిగా వ్యవసాయం గిట్టుబాటు కాకపోవటానికి కూలీల వేతనాలే ప్రధాన కారణమన్న వాదన సర్వత్రా ఉన్నది. నిగ్గు తీసి పరిశీలిస్తే ఈ వాదనలో అర్థం లేదని తెలుస్తుంది. అదే విషయాన్ని ఎన్ఎస్ఎస్ఒ మరో సారి రుజువు చేసింది. మొత్తం ఆదాయాన్ని 12 నెల్లకు విడగొట్టి నెలసరి లెక్కలు తీసినట్లే సేద్యపు ఖర్చును కూడా నెలసరి పద్ధతిన విడగొట్టి విశ్లేషణ చేశారు. ఆంధ్రప్రదేశ్ రైతాంగం పరిస్థితే ఉదాహరణగా తీసుకుంటే నెలకు 6191 రూపాయలు సేద్యానికి ఖర్చు అయ్యిందనుకుంటే వేతన శ్రమ కోసం కేవలం 1517 రూపాయలు మాత్రమే వెచ్చించారు. సేద్యానికి అయిన నెలసరి ఖర్చులో 24 శాతం మాత్రమే వేతన శ్రమ కింద ఖర్చు అయింది. మిగిలిన ఖర్చంతా సేద్యానికి సంబంధించిన వేర్వేరు అవసరాలకు పెట్టిన ఖర్చు మాత్రమే. సేద్యపు ఖర్చులో 76 శాతం ఇతర అవసరాల కోసం వ్యయం చేస్తున్నారు. అందువల్ల వ్యవసాయంలో కూలీల వేతనాల వల్ల నష్టం వస్తుందన్న వాదనలను కూడా ఈ సర్వే తోసిపుచ్చుతోంది.

**ఈ మాసం ప్రత్యేకం**

# ప్రశ్నిద్దామా వద్దా అనేదే అసలు ప్రశ్న

రొమిల్లా థాపర్

**మానవ పరిణామంలో ప్రశ్న పాత్ర గురించీ, యూరప్ చరిత్రలో, భారత చరిత్రలో ప్రశ్నించే సంప్రదాయపు పాత్ర గురించీ వివరిస్తూ ఇవాళ ప్రశ్నలు సంధించే ప్రజాహిత మేధావుల అవసరాన్ని చెపుతున్నారు రచయిత:**



రచయిత ప్రఖ్యాత చరిత్ర పరిశోధకులు

ప్రజాహిత మేధావులు సాధారణంగా సామాజిక న్యాయానికి ప్రాధాన్యతనిస్తూ మానవ హక్కుల సమస్యలనూ, సమాజం నడుస్తున్న తీరునూ పట్టించుకుంటారు. నిజానికి ఈ సమస్యల పరిధి విశాలమైనది. అటువంటి వాటిలో ప్రధానమైన కొన్నిటినే ఇక్కడ ప్రస్తావించదలిచాను. అది మతం అయినా, రాజ్యం అయినా, మరొకటేదైనా, అప్పటి చర్చను బట్టి మనం దేన్ని అధికారంగా గుర్తిస్తామనేదీ, ఎంపికను ఎలా అంచనా కడతామనేది మొదటిది. మనం జ్ఞానాన్ని ఎలా గ్రహిస్తాం, దాన్ని ఏ అవసరాలకు వినియోగిస్తామనేది రెండవది. ఉదాహరణకు, నూతనంగా సంపాదించుకున్న జ్ఞానం అమలులో ఉన్న ఛాందసాలను, లేదా సువ్యవస్థిత అధికారాలను వ్యతిరేకించాలని తప్పనిసరిగా ఆశిస్తాం. అయితే ఈ వ్యతిరేకతతో మనం ఎలా వ్యవహరిస్తాం? మనచుట్టూ ఉన్న ప్రపంచం గురించీ, దాని గతం గురించీ సహేతుకమైన, తార్కికమైన వాదనకే ప్రాధాన్యత అనే దాని మీద ఇది ఆధారపడి ఉంటుంది. హేతుబద్ధత గురించి నొక్కి చెపుతున్నప్పుడు నేనేమీ ఒక ఆలోచనా సరళిగా ఊహాశక్తి ప్రాధాన్యతను కొట్టివేయడం లేదు. కాకపోతే ఆ రెంటి మధ్య తేడాను విస్మరించడానికి వీలు లేదు.

ఇటువంటి ఆలోచనలు కొత్తవి కావు. వీటి మూలాలు ప్రాచీన కాలంలో ఉన్నాయి. ఇవే ప్రశ్నలు ఎన్నో శతాబ్దాల వెనుక తలెత్తాయి. సమాజ గతిని నిర్ణయిస్తున్న వారిని ప్రశ్నలు అడిగే మన వర్తమాన హక్కుకు పునాదులైన ఆలోచనలు చేసిన కొందరు గతకాపు వ్యక్తుల గురించి నేనిక్కడ ప్రస్తావించ దలచాను. తొలిరోజుల్లో ఈ ప్రశ్నలు ఎక్కువగా హేతుబద్ధ వాదన నుంచీ, తార్కిక ఆలోచన నుంచీ తలెత్తాయి. ఆ ప్రశ్నల జవాబులు భూమి మీద ఒక మెరుగైన సమాజం వస్తుందనే ఊహాత్మక భవిష్యత్తుకు ముగింపు పలకలేదు. ఆ భవిషత్తు కోసం స్వర్గం వైపో, పునర్జన్మ వైపో వేచి చూడాలనీ చెప్పలేదు. అటువంటి ఆలోచనంతా తన సంప్రదాయమే నని యూరప్ అంటుంది. అటువంటి ఆలోచ నలే భారతదేశంలోనూ ఉన్నాయనే మాట తరచుగా విస్మరణకు గురవుతుంది. కాని నేను ఆ విస్మరణను సవాలు చేస్తున్నాను. సమాజాలు ఏవైనా తప్పనిసరిగా ఛాందసం మీద, అధికారం మీద కనీసం సంక్షుభిత సమయాలోనైనా, ప్రశ్నలు సంధించడానికి అనుమతించవలసిందే. అలా అనుమతించకపోతే ఆ సమాజాలు అతి వేగంగా మరణశయ్య ఎక్కుతాయి. ఇప్పుడు యూరోపియన్ గతాన్ని చూద్దాం. ప్రజాహిత మేధావుల సంప్రదాయపు ప్రారంభకులు తాత్విక ప్రశ్నలు సంధించారు. అయితే ఆ ఆలోచనా ధోరణి రాజకీయ రంగంలోకి కూడా చొచ్చుకు వచ్చింది. సామాజిక కార్యాచరణ ప్రతిపాదనలను ముందుకు తెచ్చింది. సోక్రటీస్ లాగా అటువంటి వ్యక్తులు కొన్ని సందర్భాలలో ప్రశ్నలు వేసినందుకు మూల్యం చెల్లించవలసి వచ్చింది. అయినప్పటికీ, అధికారాన్ని ప్రశ్నించే హక్కును నిలుపుకున్నారు. దైవం ఉనికిని ప్రశ్నించినందుకూ, ఏథెన్స్‌లో న్యాయ వ్యవస్థ పద్ధతులను విమర్శించినందుకూ ఎథీనియన్ గ్రీక్ అధికార వర్గం ఆయనను తప్పు పట్టింది. అందుకు ఆయన విష పాన శిక్షను అనుభవించవలసి వచ్చింది.

క్రీ.పూ. ఐదో శతాబ్దంలో సోక్రటీస్ నెలకొల్పిన పద్ధతికి తాము వారసులమని చెప్పుకునే ఒక కీలకమైన యూరోపియన్ ఆలోచనా ధోరణి ఉంది. ఏదైనా ఒక ప్రకటన ఉందంటే దాన్ని అనేక రకాలుగా ప్రశ్నించాలి. దానిలోని అంతర్గత అంశాల మధ్య అంతస్సంబంధాలను పరిశీలించడానికి దాన్ని విడదీసి చూడాలి. ఆ అంతర్గత సంబంధాలను ఒక కార్యకారణ ప్రాతిపదికతో ముడివేయాలి. ఆ ప్రాతిపదికను మళ్లీ పరీక్షకు గురిచేయాలి. ఒక ప్రతిపాదనను దాని వ్యతిరేక ప్రతిపాదనతో ఎదుర్కోవడమనేది వాదనలో గతితార్కి పద్ధతికి దారి తీస్తుంది. క్రీ.పూ. మొదటి శతాబ్దికి చెందిన రోమన్ వక్త సిసిరో రోమన్ పాలకుల అవినీతిని బహిర్గతం చేశాడు. దేన్నైనా సరే ప్రశ్నించడానికి హక్కు ఉండాలన్నాడు. తన న్యాయశాస్త్ర ప్రజ్ఞాపాటవాలను ఆ ప్రశ్నలను లేవనెత్తటానికి ఉపయోగించాడు.

### చర్చినీ ప్రశ్నించారు

క్రీ.శ. రెండో సహస్రాబ్దిలో కాథలిక్ చర్చి రాజుల మీద తిరుగులేని అధికారాన్ని చలాయించింది. ఆ తర్వాత ఆ అధికారాన్ని ప్రశ్నలు ఎదుర్కొన్నాయి. యూరప్‌లో పునరుజ్జీవనోద్యమానికి ఆలోచనలను రగిలించిన అనేక అంశాలలో అది ఒకటి. మనకు చిరపరిచితమైన తత్వవేత్తలు–లాక్, హ్యూమ్, వోల్టేర్, మాంటెస్క్యూ, డిడెరో, రూసో, తదితరులందరూ సాంప్రదాయిక జ్ఞానాన్నీ, ఆచరణనూ ప్రశ్నించడం ప్రారంభించారు. వారిలో వారికీ, వారితో ఇతరులకూ భిన్నాభిప్రాయాలుండేవి. కాని మొత్తంగా చూసినప్పుడు వారి ప్రశ్నలు విమర్శనాత్మక హేతుబద్ధత పైన అధారపడినందువల్ల సామాజికామోదం పొందాయి. ఇవాళ మనం పౌర సమాజం అని పిలుస్తున్న విషయాలపై ప్రత్యేకంగా కాథలిక్ చర్చికున్న నైతికాధికారాన్ని వారందరూ ఉమ్మడిగా సవాలు చేశారు. విమర్శనాత్మక హేతుబద్ధతే వారిని ఏకం చేసింది. ఆ పౌర సమాజం అనేదాన్ని ఇవాళ ప్రధానంగా లౌకిక సంస్థలుగా చూస్తున్నాం. వాటిలో కొన్నిటిని రాజ్యం కూడా నిర్వహిస్తున్నది. అప్పుడు మతానికున్న ప్రత్యేకమైన హక్కులను, అసహనాన్ని అభివృద్ధి నిరోధకమైనవిగా భావించారు. ప్రగతి అనేది సమ్మిళితం చేస్తుం దని, భిన్నాభిప్రాయాల పట్ల సహిష్ణుతను పాటి స్తుందని వాదించారు.

మతాన్ని దానికదిగా వ్యతిరేకించాలనే కోరికతో చర్చిని విమర్శించలేదు. కుటుంబం,

**"సమాజాన్ని విమర్శనాత్మక విశ్లేషణకు గురిచేసే మేధో సంప్రదాయం ఉన్నచోటనే ఇటువంటి ప్రశ్నలు సులభంగా మొలకెత్తుతాయి. ఆధారాలను పరీక్షించడం, విశ్లేషించడం ద్వారానే వాదనలను ఆమోదిత హేతుబద్ధ పద్ధతుల మీద నిలబెట్టగలం. కాకపోతే చారిత్రక సందర్భాలలో మార్పులు ఆ ప్రశ్నలు వేసే పద్ధతిలో మార్పులు కలిగించవచ్చు."**

విద్య, పాలన, న్యాయం వంటి సామాజిక సంస్థలపై మతానికి ఉండిన గట్టి పట్టుకు వ్యతిరేకత అది. ఈ సంస్థలకు దైవిక సమ్మతి ఉన్నదనడాన్ని వారు నిరాకరించారు. అందువల్ల పాలానాధికారానికి వనరు ప్రజల మధ్య సామాజిక ఒప్పందం మాత్రమేనని భావించారు. విశ్వాసాన్ని అనుసరించి దైవ వచనాన్ని ఉటంకించడం కాక, హేతుబద్ధ విశ్లేషణ వైపు మొగ్గు చూపారు. సమాజపు పనితీరుకు మూలాలేవో గుర్తించడానికీ, అవసరమైన చోట్ల మార్పులు సూచించడానికీ మార్గం సుగమం చేశారు..

అయితే తత్వవేత్తల కన్నా భిన్నంగా, ప్రత్యేకంగా ప్రజాహిత మేధావి అనే గుర్తించ దగిన రూపం పంథొమ్మిదో శతాబ్దిలో,డ్రైఫస్‌తో ప్రారంభమైంది. డ్రైఫస్ అనే యూదు వ్యక్తి ఫ్రెంచి సైన్యంలో కెప్టెన్‌గా పనిచేస్తుండేవాడు. రాజకీయ వేత్తలతో కుమ్మక్కై సైనిక రహస్యాలు జర్మన్లకు చేరవేశాడనే తప్పుడు ఆరోపణలతో డ్రైఫస్‌ను శిక్షించారు.డ్రైఫస్‌ను అన్యాయంగా శిక్షించారని ఈ నిర్బంధాన్ని వ్యతిరేకించినవారు వాదించారు. ఈ వాదనను అక్షరబద్ధం చేసిన నవాలాకారుడు ఎమిలీ జోలా తన వాదనకు అనుకూలంగా పెద్ద సంఖ్యలో రచయితలను, కళాకారులను, విద్యావేత్తలను సమీకరించాడు. వారందరినీ కలిపి ఉమ్మడిగా మేధావులు అని పిలవడం ప్రారంభించారు. చిట్టచివరికి భావోద్వేగాలు లేకుండా, యూదు వ్యతిరేకత లేకుండా జరిగిన విచారణ డ్రైఫస్ నిర్దోషి అని ప్రకటించింది. అతన్ని తిరిగి ఉద్యోగంలో చేర్చుకున్నారు. అలా మొదలైన మేధావి అనే మాటకు అర్థం ఆ వ్యక్తికి పాండిత్యమేమీ అవసరం లేదని భావిం చింది. మేధావి అంటే ఏదో ఒక గుర్తించదగిన వృత్తిలో నైపుణ్యం ఉన్నవారూ, అధికారంలో ఉన్నవారి విధానాలను ప్రశ్నించేవారు అనే అర్థం స్థిరపడింది.

సమాజాన్ని విమర్శనాత్మక విశ్లేషణకు గురిచేసే మేథో సంప్రదాయం ఉన్నచోటనే ఇటువంటి ప్రశ్నలు సులభంగా మొలకెత్తుతాయి. ఆధారాలను పరీక్షించడం, విశ్లేషించడం ద్వారానే వాదనలను ఆమోదిత హేతుబద్ధ పద్ధతుల మీద నిలబెట్టగలం. కాకపోతే చారిత్రక సందర్భాలలో మార్పులు ఆ ప్రశ్నలు వేసే పద్ధతిలో మార్పులు కలిగించవచ్చు. (ఇప్పుడు విజ్ఞానశాస్త్రాలలో మాత్రమే కాక, సామాజిక శాస్త్రాలలోను ఇదే మౌలిక పద్ధతిగా ఉంది. ఆ పద్ధతి వల్లనే సామాజిక రాజకీయ వ్యవస్థ గురించీ, కార్యకలాపాల గురించీ అర్థవంతమైన వివరణలు దొరుకుతున్నాయి. అయితే దురదృష్ట వశాత్తూ, ఈ పద్దతిని చారిత్రక పరిశోధనకు అన్వయించి సాంప్రదాయిక అభిప్రాయాలను ప్రశ్నించినప్పుడు మాత్రం అన్ని సమయాల్లోనూ ఆమోదం దొరకడం లేదు.)

అయితే హేతుబద్ధ వాదన అనే భావన గత రెండు శతాబ్దాలలో విమర్శలను ఎదుర్కొంది. హేతుబద్దతకు అంత ఘనమైన స్థానం ఇస్తే సంపూర్ణ వివరణలకు అవకాశం దొరకదనీ, హేతుబద్ధమైనవైనా, కాకపోయినా అన్ని వివరణ సాధ్యమైనవేననీ వాదన వచ్చింది. అలాగే హేతు బద్ద ఆలోచన మీద ఆధారపడిన విమర్శలు కూడా వాటి ఆధారాలను బట్టీ, వాటి కార్యకారణ సంబంధాలలోని తర్కాన్ని బట్టీ విభిన్నంగా ఉంటాయి. అయినప్పటికి విమర్శనాత్మక హేతు బద్దత దానికదిగా కొనసాగుతుంది,

ఇప్పుడిక నేను భారతీయ సంప్రదాయంలో అప్పటికి కొనసాగుతున్న భావనలనూ, ఆచరణల నూ సవాలు చేసిన కొద్దిమంది వ్యక్తులను ప్రస్తావిస్తాను. వారు మార్పు కొరకు హేతుబద్ధ, తార్కిక వివరణలను ప్రచారం చేశారు. మన పూర్వీకులు హేతుబద్ధతను జ్ఞాన సముపార్జనా మార్గంగా అనుసరించలేదనే భావాల్ని మన మెదళ్లలో కూరిపెట్టారు. కాబట్టి సాధారణంగా మనం హేతుబద్ద ఆలోచనా వారసత్వాన్ని విస్మ రిస్తూ ఉంటాం.

**బుద్ధుడు**

క్రీ.పూ. ఐదో శతాబ్దిలోని సోక్రటిస్, బుద్ధుడు సుదూరమైన విభిన్న ఖండాలలో, ఎటువంటి సంబంధం లేకుండా జీవించినప్పటికీ ప్రశ్నలకు ప్రోత్సహించిన, కార్యకారణ సంబంధా లనూ, హేతుబద్ధ వివరణలనూ అన్వేషించిన సమకాలిక తత్వవేత్తలు. అదృష్టవశాత్తూ ఈ భారతీయ తత్వవేత్త గ్రీకు తత్వవేత్త లాగ విషం తాగాలనే శిక్ష అనుభవించలేదు. కాని ఆయన బోధనలను తొలి బ్రాహ్మణ ఛాందసం అత్యంత తీవ్రంగా వ్యతిరేకించింది. ఆ బోధనలు మాయావాదమనీ, తప్పుదారి పట్టించేవనీ నిందించింది. బౌద్ధం భారతదేశం నుంచి క్రమక్రమంగా కను మరుగైపోవడానికి చాల కారణాల్లో ఆ నిందలు కూడ ఒక కారణం. బౌద్ధం పొరుగు దేశాలలోకి వెళ్లి, అక్కడ వికసించింది. కొన్ని చోట్ల క్రమంగా అది కూడా ఛాందసంగా మారిపోయింది.

ఈ తొలి గ్రంథాలలో మతం అనే మాట ఎప్పుడు వచ్చినా అది హిందూమతం ప్రస్తావన కాదు. ఎందుకంటే హిందూ అనే మాటే ఆ తర్వాతెప్పుడో పుట్టింది. భారతీయ మతం అనే దానిలో ఎన్నెన్నో శాఖలు ఉండగా వాటన్నిటినీ వాటి పేర్లతోనే గుర్తించేవారు. సాధారణార్థంలో చెప్పినప్పుడు కూడ అవన్నీ రెండు ప్రవాహాలుగా ఉండేవి. ఒకటి బ్రాహ్మణ– అంటే బ్రాహ్మణ విశ్వాసాలతో ఉండేది, మరొకటి శ్రమణ– అంటే బౌద్ధ, జైన బోధనలతో కూడినది. (బౌద్ధ సన్యాసులను శ్రమణకులు అనేవారు.) క్రీ.పూ. మూడో శతాబ్దిలో అశోకుడి శాసనాల నాటి నుంచి, క్రీ.శ. 11 శతాబ్దిలో భారతదేశం గురించి రాసిన అల్ బిరూనీ దాకా వెయ్యి సంవత్సరాలకు పైగా ఈ రూపంలోనే మతాల గురించి ప్రస్తావించారు. ఈ రెండు మతాల మధ్య సంబంధం పాముకూ ముంగిసకూ మధ్య సంబంధం లాంటిదని క్రీ.శ. మొదటి సహస్రాబ్ది ప్రారంభంలో సంస్కృత వ్యాకరణ కర్త పతంజలి ఒక అదనపు దృక్పథాన్ని జోడించాడు. అంటే వీరి మధ్య చర్చలు విద్వేషపూరితంగా ఉండేవి. ప్రశ్నలు లేకుండా చెప్పిందంతా వినేవాళ్ళు కొందరూ, ప్రశ్నలు వేసేవాళ్ళు కొందరూ ఉండే అన్ని సమాజాలలోనూ ఇటువంటి తీవ్రమైన చర్చలు జరుగుతాయి.

**చార్వాకులు**

ఆ తర్వాత చార్వాకులు వచ్చారు. వారినే లోకాయతులని కూడ అంటారు. వాళ్ళు అప్పటికి ఉన్న అన్ని తాత్విక ధోరణులనూ వ్యతిరేకించారు. వారు జీవితం గురించి భౌతికవాద వివరణకు కట్టుబడి ఉన్నారు. మరొక రకమైన ఆలోచనా ధోరణికి ఎంతమాత్రం అవకాశం ఇవ్వలేదు. వారి గ్రంథాలేవీ ఇవాళ లభ్యం కావడం లేదు. కాని మనకు తెలిసిన గ్రంథాలలో సందులలో, మూలల్లో అనూహ్యమైన చోట్ల వారి గురించి ప్రస్తావనలు తలెత్తుతుంటాయి. వీరిలో కొన్ని శాఖలవారి వాదనలు ('పాపమీను కదలి కల')(ఈ మాటల అర్థం తెలియలేదు.)లాగ ఉంటాయని బుద్ధుడు వర్ణించాడు.

క్రైస్తవ శకం ప్రారంభమయ్యే సమయానికి బౌద్ధం జనాదరణతో పాటు రాజుల, వర్తకుల,

**"క్రైస్తవ శకం ప్రారంభమయ్యే సమయానికి బౌద్ధం జనాదరణతో పాటు రాజుల, వర్తకుల, భూస్వాముల ప్రాపకాన్ని కూడా సంపాదించింది. అప్పుడు ప్రధాన బ్రాహ్మణ గ్రంథాలు వారిని నాస్తికులుగా, సంప్రదాయ వ్యతిరేకులుగా, అవిశ్వాసులుగా అభివర్ణిస్తూ తీవ్రంగా వ్యతిరేకించాయి. బ్రాహ్మణ దృక్కోణం నుంచి చూసినప్పుడు శ్రమణకులు, చార్వాకులు, అజీవకులు, నిరీశ్వరవాదులు, భౌతికవాదులు, హేతువాదులు అందరూ నాస్తికులు అనే ఒకే తరగతికి చెందుతారు."**

భూస్వాముల ప్రాపకాన్ని కూడా సంపాదించింది. అప్పుడు ప్రధాన బ్రాహ్మణ గ్రంథాలు వారిని నాస్తికులుగా, సంప్రదాయ వ్యతిరేకులుగా, అవిశ్వాసులుగా అభివర్ణిస్తూ తీవ్రంగా వ్యతిరేకించాయి. బ్రాహ్మణ దృక్కోణం నుంచి చూసినప్పుడు శ్రమణకులు, చార్వాకులు, అజీవకులు, నిరీశ్వర వాదులు, భౌతికవాదులు, హేతువాదులు అందరూ నాస్తికులు అనే ఒకే తరగతికి చెందుతారు. ఎందుకంటే వారందరూ కూడ భగవంతుడి అస్థిత్వాన్ని ప్రశ్నించారు. వేదాలు అపౌరుషేయాలనీ, భగవంతుడే ప్రకటించాడని అనడాన్నీ ప్రశ్నించారు. కులాచారాల నియమాలను, ఆత్మ ఉనికిని ప్రశ్నించారు. కర్మ విషయంలో వారి అభిప్రాయాలు భిన్నంగా ఉన్నప్పటికీ వారిలో కొందరు కర్మ సిద్ధాంతాన్ని పూర్తిగా తిరస్కరించారు. (ఇది చెపుతున్నప్పుడు మన కాలంలో హిందుత్వ వాదులు కూడ తమను సమర్థించని వారందరూ ఒకటే అన్నట్టుగా, అందరినీ ఒకేగాటన కట్టి మార్క్సిస్టులుగా అభివర్ణించడం గుర్తొచ్చింది! అలాగే భారతదేశంలో ముస్లింమత ఛాందనవాదులు కూడ తమ ఛాందసాన్ని వ్యతిరేకించే ఉదారవాద ముస్లింలందరినీ ఒకే గాటన కట్టి మార్క్సిస్టులు అని పిలుస్తారనేదీ ఆసక్తికరమైన విషయమే.)

సంప్రదాయ వ్యతిరేకుల పట్ల మనుధర్మ శాస్త్రం మానసిక రుగ్మత లాంటి అనుమానాన్ని ప్రదర్శించింది. వారిని నాస్తికులనీ, తప్పుడు సిద్ధాంతాల బోధకులనీ పిలిచింది. వారు రోగగ్రస్తులైన మనుష్యులనీ, తమస్సుకు మూలాలనీ పిలిచింది. నిజంగానే కొన్ని రకాలుగా చూసినప్పుడు ఛాందసానికి అది కష్టకాలమే. కొన్ని ప్రధాన తాత్విక శాఖలు నాస్తికవాద ఛాయలతో నిండిపోయాయి. కాని అదే ఆ కాలాన్ని మేధో పరంగా ఉత్సాహభరితమైన కాలంగా మార్చింది. ఈ సంప్రదాయ వ్యతిరేకులకు జనాదరణ ఎంత ఎక్కువగా ఉంటే వారి మీద దాడి అంత ఎక్కువగా జరిగింది.

ఎప్పుడూ ప్రత్యక్షంగా కనబడకపోయినా చార్వాకులు మొత్తంగా మన ఆలోచనల రంగస్థలం మీద కొనసాగుతూనే వచ్చారు. క్రీ.శ తొమ్మిదో శతాబ్దిలో శంకరాచార్యుడు ఆత్మ కన్నా భౌతిక పదార్థమే ప్రాథమికమని చెప్పిన సిద్ధాంతాన్ని ప్రస్తావించాడు. పద్నాలుగో శతాబ్దిలో అప్పటికి ఉన్న ప్రధానమైన తాత్విక ధోరణులన్నిటినీ సంకలితం చేసిన మధ్వాచార్యుల సర్వదర్శన సంగ్రహం ప్రారంభంలోనే చార్వాక ఆలోచనల ప్రాసంగికత గురించి సుదీర్ఘ చర్చ ఉంటుంది. అది చివరికి చార్వాక ఆలోచనను తిరస్కరించినప్పటికీ, దీర్ఘంగానే చర్చిస్తుంది. చార్వాకుల ఆలోచనలకు ప్రభావవేమీ లేనట్టయితే, వాటిని విస్మరించడం జరిగేది. కొంత మంది వలసవాద రచయితలు భారత నాగరికతలో అసలు హేతుబద్ధ ఆలోచన అనేది లేదని, అదే భారతీయుల వెనుకబాటుతనానికి కారణమని వాదించారు. ఈ వాదన జాతీయ వాద ఆలోచనకు ఆమోదయోగ్యం కానప్పటికీ, భారతీయ పండితులు తగిన పద్ధతిలో ఆ వాదనను ఎదుర్కోలేదు. ఎటువంటి నిరంకుశ అధికారానికైనా ప్రశ్నించేవారంటే గిట్టదు. అలాగే హిందూ మతం పునాదిగా ఏకైక జాతీయ అస్థిత్వాన్ని నిర్మించ తలపెట్టిన వారు బ్రాహ్మణ ఆలోచనలతో విభేదించిన బోధనల ప్రాధాన్యతను అంగీకరించకలేక పోయారు.

ఛాందసవాదం సంప్రదాయ వ్యతిరేకులను కొట్టి పారేసింది. కాని, వారి భావాలలో కొన్నింటి గురించి, అటువంటి ఇతర భావాల గురించి క్రీ.శ తొలి శతాబ్దాల తాత్విక ధోరణులలో అన్వేషణ జరపక తప్పలేదు. పండిత స్థాయిలో, విజ్ఞులైన బ్రాహ్మణులకూ, బౌద్ధులకు మధ్య జరిగిన చర్చలలో విభిన్నమైన,ప్రశంసనీయ మైన తాత్విక ధోరణలు రూపుదిద్దుకున్నాయి. తర్కమూ, హేతువిచారణా పద్ధతులూ పదును దేరాయి. భావవాద తత్వశాస్త్రానికి సన్నిహితమైన ఇతర ఆలోచనా పద్ధతులు కూడా మెరుగుతీరాయి. ఈ సమయంలో ప్రధానమైన తార్కికులలో ఎక్కువమంది, ఉదాహరణకు నాగార్జునుడు, వసుబంధుడు, దిగ్నాగుడు, ధర్మకీర్తి వంటి వారు బౌద్ధులే కావడం ఆసక్తికరమైన అంశం. వీరిలో కొందరు బ్రాహ్మణులుగా పుట్టి, ఆ పద్ధతిలోనే విద్యావంతులై, బౌద్ధులుగా మారారు. వారు భావాలతో క్రీడలాడారు. మరీ ముఖ్యంగా నాస్తిక వాదపు సూక్ష్మ అంశాల గురించి చాలా చర్చ జరిపారు. ఆ భావాలు ఒకే రకమైనవేమీ కావు. విస్తారంగా చర్చ జరిగింది. కొన్నిసార్లు ఈ వాదనలు దాదాపు గతితార్కిక రూపం తీసుకున్నాయి.

దురదృష్టవశాత్తూ ఇప్పుడు లభించడం కష్టం గాని, విమర్శనాత్మక హేతుబద్ధతను ఉపయోగించిన ఈ తత్వవేత్తలకూ, హేతుబద్ధ ఆలోచనకు మరింత సన్నిహితులైన ఖగోళ, గణిత శాస్త్రవేత్తలకూ జరిగిన సంభాషణలు దొరికితే వాటికి చాలా ఎక్కువ మేధో ప్రాధాన్యత ఉంటుంది. గణితశాస్త్ర లెక్కల ఆధారంగా ఆర్యభట్టు భూమి సూర్యుని చుట్టూ తిరుగుతున్నదని వాదించాడు. కోపర్నికస్, గెలీలియోల కన్న వెయ్యి సంవత్సరాల ముందు ఆయన ఆ సిద్ధాంతం చెప్పాడు. ఈ సిద్ధాంతానికి బైబిల్‌ను, అంటే సమాజం మీద చర్చి అదుపును తిరస్కరించే శక్తి ఉందని యూరప్‌లో కాథలిక్ ఛాందసవాదం గుర్తించి భయపడింది. గెలీలియో తన మాటను వెనక్కి తీసుకోవలసి వచ్చింది. ఈ సూర్యకేంద్రక సిద్ధాంతాన్ని ఆమోదిస్తే భారతదేశంలో ఖగోళ శాస్త్రవేత్తల కొన్ని జ్యోతిష్యశాస్త్ర గణనాలు తప్పయి ఉండేవనేది మరొక కారణం కావచ్చు. అయితే రాజుల అధికారాన్ని తమ అదుపులో ఉంచుకోవడానికి మత ఛాందసవాదం జ్యోతిష్య శాస్త్రాన్ని ఒక సాధనంగా ఉపయోగించింది.. అందువల్ల చాలా ప్రాంతాలలో పాత జ్ఞానమే చెక్కుచెదరకుండా కొనసాగింది. గణిత శాస్త్రంలోనూ, ఖగోళ శాస్త్రంలోనూ భారతీయ సిద్ధాంతాలు వాటికవి సృజనాత్మకంగా విస్తరించాయి. కాని విచిత్రంగా అవి అప్పటి పురావిజ్ఞానశాస్త్ర కేంద్రమైన బాగ్దాద్‌కు వెళ్లిన తర్వాత మాత్రమే ఎక్కువ ప్రభావశీలంగా మారాయి.

ఈ లోగా, భారతదేశంలో ఇతర మత శాఖలు ఇటువంటి ప్రశ్నలు రేకెత్తడానికి అవసరమైన వాతావణాన్ని కల్పించాయి. మతాధిపతులూ, పాలకులూ ఎత్తిపట్టిన నమ్మకాలనూ ఆచారాలనూ పండితులు ప్రశ్నించారు. వారు బ్రాహ్మణేతర ఛాందసాలను కూడా ప్రశ్నించారు. అలా ప్రశ్నించినవారిలో కొందరు ఆండాళ్, అక్కమహాదేవి, మీరాలలాగ స్త్రీలు. వారు కుల నియమయాలను ధిక్కరించారు. వారు చెప్పేవి ప్రజలు విస్తారంగా, శ్రద్ధగా విన్నారు. ఆ ప్రజలు తమ సామాజిక ధర్మాలను ఏర్పాటు చేసుకున్నారు. కాని మనం ప్రధానంగా మతం మీద దృష్టి పెడుతూ, ఆ సంవాదాలలోని ఈ అంశం మీద తగినంత శ్రద్ధ చూపడం లేదు.

కొన్ని శతాబ్దాల తర్వాత మహారాష్ట్రలో ఏకనాథ్ కూడా మతానికి ఉన్న అదుపును

ప్రశ్నించాడు. భాగవత పురాణాన్ని, రామాయణాన్నీ ఆయన తిరగరాసిన తీరు ఆయనకు ఉండిన బ్రాహ్మణ పాండిత్యాన్ని చూపుతుంది. ఆ పాండిత్యం ఉన్నప్పటికీ కొనసాగుతున్న సామాజిక ధర్మపు ఔచిత్యాన్నీ, కులాచారాల ఔచిత్యాన్నీ ప్రశ్నించడంలో ఆయన ఎక్కడా వెనుకకు తగ్గలేదు.

### జాతీయ వాదపు ప్రశ్నలు

ఇక ఆధునిక కాలంలోకి వస్తే, జాతీయవాదపు భావజాలం సమాజాన్ని పునర్వ్యస్థీకరించడానికి ప్రయత్నాలు చేసింది. ఆ జాతీయవాదం వలసవాదాన్ని వ్యతిరేకించి ఉండవచ్చు గాని వలసవాద విజ్ఞానం నుంచి సిద్ధాంతాలను గ్రహించడాన్ని అన్ని వేళలా వ్యతిరేకించలేదు. బ్రహ్మ సమాజం, ప్రార్థనా సమాజం, ఆర్య సమాజం వంటి అగ్రవర్ణ హిందూమతానికి సంబందించిన సంఘ సంస్కరణ ఉద్యమాలు కొత్త రకమైన హిందూ మత సంస్థలను, కులం పాత్రను సూచించాయి. రాజా రామమోహన్‌రాయ్ గురించి, ఆయన నడిపిన సంఘ–మత సంస్కరణ గురించీ మనందరికీ తెలుసు. కాని సరిగ్గా ఆయనకు సమకాలికుడైన తంజావూరుకు చెందిన చిన్న మహారాజు రెండవ శరభోజి గురించి చాల తక్కువ తెలుసు. ఆయన విద్యావ్యవస్థ సారం మీద కేంద్రీకరించి ఛాంద సాన్ని ప్రశ్నించాడు. యూరోపియన్ పునరుజ్జీవ యుగం రచయితలను అధ్యయనం చేసి జ్ఞానం హేతుబద్ధ వాదనా క్రమం మీదనే ఆధారపడి ఉంటుందనే విశ్వాసానికి చేరాడు. ఆ హేతుబద్ధ వాదనా క్రమాన్ని విద్య ద్వారా నేర్పాలని నమ్మా డు. ఆయన నెలకొల్పిన పాఠశాలలు సరిగ్గా ఈ లక్ష్యానికి ఉద్దేశించినవే. అలాగే ఆ లక్ష్యంతోనే ఆయన సరస్వతీ మహల్ గ్రంథాలయం స్థాపించి, దానికోసం పుస్తకాలనూ వస్తువులనూ సేకరించాడు.

ఈ కదలికలేవీ మేధో సంప్రదాయాలను విమర్శనాత్మకంగా ప్రశ్నించడానికి ఉద్దేశించినవి కానప్పటికీ, అవి అప్పుడప్పుడూ అయినా ఉపరితలాన్ని గోకాయి. మతం సాధికారత కల్పించిన కుల అంతరాల వ్యవస్థకు కీలక స్థానం ఉన్నప్పటికీ మతానికీ కులానికీ మధ్య అంతస్సంబంధాన్ని పరిశోధించడానికి ప్రయత్నం జరగలేదు. ఆర్యులు తమ జన్మస్థలం నుంచి భారత దేశం దాకా దండయాత్ర సాగించినప్పటికీ భారత నాగరికతకు, అగ్రవర్ణ సంస్కృతికి ఆర్య పునాదులు ఉన్నాయనే సిద్ధాంతాన్ని పంథొమ్మిదో శతాబ్దిలో బాలగంగాధర తిలక్ సమర్థించాడు. కాని అదే సమయంలో కింది కులాల మీద సాగుతున్న అణచివేతకు తార్కిక వివరణ ఆర్యుల రాకలోనే ఉందని జ్యోతిబా పూలే భావించాడు. శూద్రులైన స్థానిక నివాసులను బ్రాహ్మణులైన ఆర్యులు పీడనకు గురిచేశారని ఆయన అన్నాడు.

> **“ఛాందసవాదం సంప్రదాయ వ్యతిరేకులను కొట్టి పారేసింది. కాని, వారి భావాలలో కొన్నింటి గురించి, అటువంటి ఇతర భావాల గురించి క్రీ.శ తొలి శతాబ్దాల తాత్విక ధోరణులలో అన్వేషణ జరపక తప్పలేదు. పండిత స్థాయిలో, విజ్ఞులైన బ్రాహ్మణులకూ, బౌద్ధులకు మధ్య జరిగిన చర్చలలో విభిన్న మైన, ప్రశంసనీయమైన తాత్విక ధోరణలు రూపుదిద్దుకున్నాయి. తర్కమూ, హేతువిచారణా పద్ధతులూ పదును దేరాయి.”**

ఇలా అప్పటికి ఉనికిలో ఉన్న సమాజాన్ని వివరించడానికి తిలక్ ఆమోదిత అభిప్రాయాన్ని విస్తరించగా, పూలే దాన్ని ప్రశ్నించాడు. ఈ రెండు వ్యాఖ్యానాలూ చారిత్రకంగా పొరపాటే, కానీ పూలే నిశితమైన ప్రశ్న అడిగాడు.

కులానికి ఉన్న సాధికారతను ప్రశ్నించిన వారూ, బ్రహ్మణ విశ్వాసాల పట్ల విమర్శనాత్మకంగా ఉన్నవారూ ఇతరులు కూడా ఉన్నారు. పెరియార్ లేదా ఇవిఆర్ విద్యావేత్త కాకపోయినప్పటికీ, ఆయన సమకాలికులైన విద్యావేత్తలతో సమానంగా చదువుకున్నాడు. హిందూ పురాణాల లోని వైరుధ్యాలను ఒక హేతువాదిగా ఆయన విమర్శనాత్మకంగా చూశాడు. అవన్నీ ఇండో – ఆర్యన్ ప్రజలు కల్పించిన కట్టుకథలని కొట్టిపారే శాడు. సామాజిక సమానత్వం కోసం, ప్రత్యేకించి మహిళల సమానత్వం కోసం చాలా బలంగా వాదించాడు.

నేను ఇప్పటి వరకూ ప్రస్తావించిన వ్యక్తులం దరూ ఆధునిక అర్థంలో ప్రజాహిత మేధావులు కారు. మెరుగైన సమాజాన్ని సాధించడానికి ఒక సాధనంగా అప్పటికి ఉన్న వాస్తవికత మీద ప్రశ్నలు సంధించిన వారు. వారు తమ తమ భిన్నమైన వృత్తులలో గౌరవాన్ని పొందినందు వల్ల వారి బోధనలను ప్రజలు విన్నారు. వారు వేసిన ప్రశ్నలు ఒకే రకమైనవా కాదా అనేది సమస్య కాదు. ఆయా కాలాల సమస్యలకు తగి నట్టుగా వారి ప్రశ్నల స్వభావం మారినప్పటికీ వారు వాదించిన పద్ధతి ప్రధానమైనది. ఆ ప్రశ్నలు యధేచ్ఛగా వేసినవి కావు. వాటిని గుర్తించ దగిన విమర్శనాత్మక హేతుబద్ధత నిర్ణయించింది. అంతేకాదు, అలా ప్రశ్నలు వేసేవారు అప్పుడైనా, ఇప్పుడైనా గణనీయమైన చారిత్రక మార్పులను వ్యక్తీకరిస్తారు.

చారిత్రక మార్పుల సమయాలు సమాజాన్ని పునర్వ్యవస్థీకరించే కొత్త పద్ధతుల అన్వేషణతో కలిసివస్తాయి. భారతీయ గతంలోనూ ఆ పునర్వ్యవస్థీకరణ ప్రయత్నాలు అప్పుడప్పుడు జరిగాయి. సామాజిక, ఆర్థిక పరిస్థితులను అర్థం చేసుకోవడానికి , అవి సమాజానికి ఒక రూపాన్ని ఎలా ఇస్తాయో తెలుసుకోవడానికి మనకిప్పుడు లోతైన , నిశితమైన మార్గాలు అందుబాటులో ఉన్నాయి. ఈ సంబంధాలను అన్వేషించవలసి ఉంది. అటువంటి అన్వేషణలు జరపడానికి , మన మేధో వారసత్వంలోని హేతుబద్ధ ఆలోచనల సంప్రదాయాలను వ్యక్తీరించడానికి గుర్తించ దగిన పాత్ర నిర్వహించే ప్రజాహిత మేధావుల సంప్రదాయాన్ని ధ్వంసం చేయడానికి ప్రస్తుతం పథకం ప్రకారం ప్రయత్నాలు జరుగుతున్నాయి.

వలస – వ్యతిరేక భారత జాతీయోద్యమ ప్రధాన స్రవంతీ, లౌకికంగా ఉండాలని ఆకాంక్షించిన ఉదారవాద ప్రజాస్వామ్య ఆవిర్భావమూ ఆ ప్రజాహిత మేధావుల దృశ్యమానమైన ఉనికికి తగిన స్థలం ఇచ్చాయి. ప్రత్యేకంగా స్వాతంత్ర్యం వచ్చిన వెనువెంటనే కొద్ది సంవత్సరాల పాటు చాల మందే ఈ పాత్ర నిర్వహించడానికి ముందుకొచ్చారు. విస్తారమైన చర్చలు జరగడానికి వారే కారణం. కాని ఆ తర్వాతి పరిణామాలు, అది ఎమర్జెన్సీ కావచ్చు , లేదా మతపరమైన మైనారిటీల ఊచకోతలు కావచ్చు. కనీసం అటువంటి ఘటనలు పునరావృతం కాకుండా గళమెత్తడానికి , అడ్డుకోవడానికి ప్రజాహిత మేధావులు అవసరమనే అవగాహనను పెంచాయి. నిఖిల్ చక్రవర్తి , రమేష్ థాపర్ వంటి వారెందరో అన్నిరకాల సెన్సార్ షిప్‌నూ , ప్రత్యామ్నాయ గళాలను నిశ్శబ్దంలో ముంచే ప్రయత్నాలనూ వ్యతిరేకించారని మనం గుర్తు చేసుకోవలసి ఉంది.

### విద్యావేత్తల మౌనం

ఇవాళ మనకు విభిన్న వృత్తులలో ప్రత్యేక నైపుణ్యం సాధించినవారున్నారు. కాని వారిలో అత్యధికులు తమ ప్రత్యేక విభాగానికి బైట ప్రపంచంలో ఏమి జరుగుతన్నదో పట్టించుకోవడం లేదు. వీరు ప్రజాహిత మేధావుల స్థానాన్ని ఆక్రమిస్తున్నారని కూడ వింటున్నాం. కాని ఈ ప్రత్యేక నిపుణులూ, ప్రజాహిత మేధావులూ ఒకటి కాదు. ఉదాహరణకు, గతంలో కూడ లెక్కలేనంత మంది విద్యావేత్తలు ఉండేవారు. కాని వారిలో చాలమంది అధికారా న్ని ఎదుర్కోవడానికి , కనీసం ఆ అధికారం స్వేచ్ఛాలోచనా మార్గాన్ని

> **“ కులానికి ఉన్న సాధికారతను ప్రశ్నించిన వారూ, బ్రహ్మణ విశ్వాసాల పట్ల విమర్శనాత్మకంగా ఉన్నవారూ ఇతరులు కూడా ఉన్నారు. పెరియార్ లేదా ఇవిఆర్ విద్యావేత్త కాకపోయినప్పటికీ, ఆయన సమకాలికులైన విద్యావేత్తలతో సమానంగా చదువుకున్నాడు. హిందూ పురాణాలలోని వైరుధ్యాలను ఒక హేతువాదిగా ఆయన విమర్శనాత్మకంగా చూశాడు. అవన్నీ ఇండో - ఆర్యన్ ప్రజలు కల్పించిన కట్టుకథలని కొట్టిపారేశాడు. ”**

అడ్డుకుంటున్నప్పుడు కూడ సిద్ధపడలేదు. వారు తమ జ్ఞాన సముపార్జనా క్రమాన్ని నిరాటంకంగా కొనసాగించదలచుకోవడమా, లేక అధికారం ఆజ్ఞాపిస్తే వారు తమ జ్ఞానాన్ని కూడ వదిలేయడానికి సిద్ధంగా ఉండడం ఇందుకు కారణమా?

ప్రజాహిత మేధావిని నిర్వచిస్తూ చాల రచనలే వచ్చాయి. ఆ పేరుతో పిలవాలంటే ఒక వ్యక్తి అధికారంలో ఉన్నవారి నుంచి స్వతంత్రమైన వైఖరి తీసుకోవాలి. తద్వారా ఆ భావాలను ఎవరు ప్రచారం చేస్తున్నారనే దానితో సంబంధం లేకుండా చర్చనీయ అంశాలను లేవనెత్తడానికి ఆ వ్యక్తికి అవకాశం దొరుకుతుంది. హేతుబద్ధ విమర్శ ప్రధానమైన నాందిగా ఉంటుంది. ప్రజాహిత మేధావి వీలయినంత వరకు స్వతంత్ర ప్రతిపత్తితో వ్యవహరిస్తున్నాడని ఇతరులు అనుకునేలా ఉండాలి.

సుప్రసిద్ధమైన వృత్తి నిపుణుల స్థాయి ఉంటే స్వతంత్ర ప్రతిపత్తి నెరపడం కొంత వరకు సులభమవుతుంది. ఇవాల్టి ప్రజాహిత మేధావికి ఆ స్థాయితో పాటు అదే సమయంలో పౌరుల హక్కులు ఏమిటనే విషయంలోనూ, ప్రత్యేకించి సామాజిక న్యాయ అంశాలలోనూ అభినివేశం ఉండడం అవసరం. అంతేకాదు, ప్రజా సంబంధ వ్యవహారాలను లేవనెత్తే సంసిద్ధత కూడ ఉండాలి

సమాజం తరపున మాట్లాడడమే ఒక రకమైన నైతిక అధికారాన్ని కలిగిస్తుంది. విశాలమైన వృత్తి నైపుణ్య గౌరవాన్నీ, సమాజం పట్ల పట్టింపునూ కలగలపడమే కొన్నిసార్లు ఆ వ్యక్తికి నైతిక అధికారాన్ని సంతరించిపెడుతుంది. అదే ప్రజా మద్దతును సమకూరుస్తుంది. వృత్తిపరమైన నిపుణులకు, విద్యావేత్తలకు ఒక మానసిక ధోరణిలాగానే స్వతంత్ర ప్రతిపత్తి ఉండాలి. అటువంటి వ్యక్తులు విశాలమైన సమాజపు సమస్యల గురించి ప్రత్యామయ్నాయ మార్గాలలో ఆలోచించడం ఎట్లాగో సూచిస్తారు. ఈ పని వారు మాత్రమే చేస్తారని కాదు. ఆ ఆలోచన హేతుబద్ధ తార్కిక విశ్లేషణ నుంచి రూపొందుతుంది. అయినా, ఇవాళ విద్యావేత్తలు స్థూలంగా ప్రత్యామ్నాయం అనేదాన్ని ప్రకటించే హక్కును సమర్థించడానికి కూడా సంకోచిస్తున్నారు. ఎంత సున్నితంగా వ్యక్తీకరించిన హేతుబద్ధ వ్యాఖ్యానాలనైనా సమర్థించడం గురించి చెప్పనే అక్కర లేదు. ఇవాళ ఎంత సులభంగా పుస్తకాలను నిషేధిస్తున్నారో, దుకాణాల నుంచి ఉపసంహరించి ధ్వంసం చేస్తున్నారో, పుస్తకాలను తగులబెట్టమని పిలుపులు ఇస్తున్నారో, మత, రాజకీయ ఒత్తిడులతో, రాజ్యం జోక్యంతో పాఠ్య ప్రణాళికలను మారుస్తున్నారో చూస్తేనే మన విద్యావేత్తలు ఎంత సంక్షోభంలో ఉన్నారో అర్థమవుతుంది. పేరుపొందిన ప్రచురణకర్తల వెన్నుముకలు కూడ పక్షవాతానికి గురవుతున్నాయి. ఇటువంటి చర్యలు జరిగిపోతుంటే చాలా మంది విద్యావేత్తలలో, వృత్తినిపుణులలో అంత తక్కువ ప్రతిస్పందన కనబడుతున్నదెందుకు?, ఈ పనులన్నీ చేస్తూ రెచ్చగొడుతున్నవారు రాజకీయ అధికారపు అండ ఉన్నవారనే భయం అని సాధారణంగా వినబడే సమాధానం. అదొక్కటే సమాధానమా?

గత కొన్ని దశాబ్దాలలో ఉదారవాద స్థలం కుంచించుకు పోతున్నదని చాలా మంది వ్యాఖ్యానిస్తున్నారు. ఒకప్పుడు అది జరగకుండా పోరాడి అడ్డుకున్నాం. ఇప్పుడది మళ్ళీ మనమీదకి వస్తున్నది. సాంప్రదాయిక అధికారానికి ప్రాతినిధ్యం వహించేవారిని, ప్రత్యేకించి వారు న్యాయాన్ని పాతిపెట్టేవారయినప్పుడు, ప్రశ్నించడం, బాధ్యతాయుతంగా ప్రవర్తించమని అడగడం పదేపదే చేయవలసిన పనులు. కొత్తగా వచ్చిన సోషల్ మీడియా స్వేచ్ఛా స్థలమని అంటుంటారు. అది కొంత వరకు నిజమే. కాని అక్కడ కూడా మత కార్యకలాపాల పైననో, సమకాలీన రాజకీయాల పైననో విమర్శనాత్మక వాఖ్యలను పంచుకుంటే తమ మీద చర్యలు జరుగుతాయేమో అని భయపడే స్థితి వచ్చింది. మరీ ముఖ్యంగా మత అస్థిత్వాలకూ, వాటి రాజకీయాలకూ సంబంధించిన విషయాలలో కొన్ని నిర్థిష్ట మతాల గురించి అర్థరహితమైన పుక్కిటి పురాణాలతో ప్రచారాలు జరగుతు న్నాయి. వీటితో మనం నేరుగా తలపడడం లేదు.

## మతం పేరుతో చర్యలు

ఇటువంటి ప్రశ్నలు అడగడమంటే మత ఉద్దేశాలను ప్రకటిస్తూ తమ అధికారాన్ని మతేతర లక్ష్యాల కోసం వినియోగించే సంస్థల పట్ల, వ్యవస్థల పట్ల విమర్శనాత్మకంగా ఉండడమే. ఆ సంస్థలూ, వ్యవస్థలూ తమ చర్యల ను సమర్థించుకోవడానికి వ్యవస్థీకృత మత నియమ నిబంధనలను చూపెడుతూ ఉంటాయి. ఆ నియమ నిబంధనలు ఇటీవల కనిపెట్టినవి కూడ కావచ్చు. వారి చర్యలు హత్యలకూ, అత్యాచారాలకూ, విధ్వంసానికి సంబంధించినవి కూడ కావచ్చు. ఆ సంస్థలతో సంబంధం లేని వారు మత విశ్వాసాలూ విలువలూ ఎటువంటి హింసనూ ప్రబోధించవని చెపుతూ ఉంటారు. కాని అసలు విషయం అది కాదు అన్ని మతాలూ సద్గుణాలనూ, మానవ విలువలనూ ప్రకటిస్తాయన్నమాట నిజమే. కాని ఇవాళ సవాలు ఎదుర్కొంటున్నది ఆ విలువలు కావు. మతం పేరు మీద పనిచేసే ఈ సంస్థలు ఏ నమ్మకాలతో ఉన్నాయి, ఏ చర్యలకు పాల్పడుతున్నాయి అనేది ప్రశ్న. వారి చర్యలు అన్ని సమయాల్లోనూ మతం ప్రబోధించే విలువలకు అనుగుణంగా ఉండడం లేదు. హిందూ మతంతో, ఇస్లాంతో, సిక్కు మతంతో తమను తాము ముడివేసుకుని, హింసనూ భయోత్పాతాన్నీ పెచ్చరిల్లజేయడానికి ఎంతమాత్రం సందేహించని అటువంటి సంస్థలు మనకు సుపరిచితమే. మతం పేరు మీద మాట్లాడుతున్నప్పటికీ, చట్టానికి భంగకరంగా ప్రవర్తిస్తున్న ఇటువంటి వారి మీద చట్టాన్ని ప్రయోగించాలని అడగగలమా? అటువంటి చర్యలను ఖండించడం, శిక్షించడం అవసరమే. కాని దానితో ఆగిపోవడానికి వీలులేదు. మతాన్ని పరిరక్షించడమనే పేరు మీద అటువంటి చర్యలు ఎందుకు జరుగుతున్నాయో అర్థం చేసుకోవలసి ఉంది. వాటికి ఎలా ముగింపు పలకగలమో ఆలోచించవలసి ఉంది. మతంతో తమను తాము ముడివేసుకునే ఆస్థికులు ఇటువంటి చర్యలను ఆమోదిస్తారా? ఆమోదించకపోతే తమ మత అస్థిత్వాన్ని వాడుకుంటూ అటువంటి హింసా బీభత్స చర్యలకు పాల్పడుతున్న వారి నుంచి తమను తాము దూరం చేసుకుని, తమ మత విలువలను పరిరక్షించుకోవడం వారి బాధ్యత కాదా?

ప్రజాహిత మేధావి పతనానికి చాలా కారణాలున్నాయి. నేనిక్కడ కొన్ని మాత్రమే ప్రస్తావించగలను. అన్నిటికన్నా ఎక్కువ కనబడేదీ, కాని అతి తక్కువగా ఆమోదించబడేది నయా ఉదరవాద సంస్కృతి వల్ల తలెత్తిన అభద్రత. ఉద్యోగాలు అంతకంతకూ ఎక్కువ పోటీమయం అయిపోవడం మానవ సంబంధాల పట్ల విశ్వాసం తరిగిపోవడానికి దారితీస్తున్నది. సంపదలో అసహ్యకరమైన అంతరాలు ఆ దురాక్రమణలను మరింత పెంచుతున్నాయి. ఆడంబరమైన ప్రదర్శ

నలే అమోదయోగ్యమని చెప్పే కాకి బంగారమే విలువలకు ప్రమాణం అవుతున్నది. అవినీతిని అతి సులభంగా అంగీకరించడం సర్వసాధారణ మైపోయింది. ధనికులు ఆడంబరంగా పూజించే కొత్త దేవతగా డబ్బు అవతరించింది. మిగిలిన వాళ్లందరూ అది బట్లు బట్లుగా ఎప్పుడు జారిపడు తుందా అని ఆదుర్దాగా వేచి చూస్తున్నారు. సమానత్వం కోరుకునే హక్కు ఉందనే సంతో షానికీ, కొత్తగా రూపొందుతున్న కుల, ధన అధికారపు రూపాల వల్ల ఆ హక్కు కాలరాయ బడడానికీ మధ్య ఘర్షణ సాగుతున్నది.

ఈ నయా–ఉదారవాద సంస్కృతినీ, ఆర్థిక వ్యవస్థనూ సులభంగా మార్చడం సాధ్యం కాదు. కాని వాటి దుష్పరిణామాలను తగ్గించవచ్చు. కాకపోతే ఆ పని జరగాలంటే, సమాజపు వనరుల మీద పౌరులందరికీ హక్కులు ఉన్నాయనీ, సంక్షేమం కోసం సామాజిక న్యాయం కోసం అడిగే హక్కు ప్రజలకు ఉందనీ, ఆ హక్కుల పునాది పైననే సమాజం నిర్మాణం కావాలనీ మనకు స్పష్టత ఉండాలి. నిజానికి స్వాతంత్ర్య పోరాట సమయంలో, మన జాతి రాజ్యం నిర్మాణమవుతున్న సందర్భంలో ఈ అవగాహనే ఉండింది. పౌరులందరికీ సైద్ధాం తికంగా మాత్రమే కాక, వాస్తవంలో సమానహ క్కులు ఉండే సమాజాన్ని నిర్మించడం ఎలా అని 1960లలో, 1970లలో జరిగిన వాదనలు నాకింకా గుర్తున్నాయి. ఒక చలనశీల సమాజం లో లాగ, మన సమాజంలో కూడ అటువంటి చర్చలు కొనసాగవలసి ఉంటుంది. ప్రశ్నలు లేవనెత్తవలసి ఉంటుంది. అందుకు మనం ప్రజాహిత మేధావుల దగ్గరికి వెళ్లక తప్పదు. వారిని ముందుకు తేక తప్పదు. అయితే దాని కన్నా ముఖ్యంగా మనకు అటువంటి ప్రశ్నలు అడగడం అవసరమని బావించే ప్రజా బాహుళ్యం కూడా కావాలి.

మరి, ఏమి చర్చించాలో, ఎందుకు చర్చించాలో అవగాహన ఉన్న ప్రజాబాహుళ్యాన్ని ఎలా తయారు చేయగలం? విమర్శనాత్మక హేతుబద్ధతతో లేవనెత్తే ప్రశ్నలకు ప్రతిస్పందించే ప్రజాబాహుళ్యాన్ని ఎలా తయారు చేయగలం? ప్రతి స్పందన అంటే ఏది సూచిస్తే దాన్ని యథా లాపంగా ఆమోదించడం అని కాదు. కాని కనీసం ప్రత్యామ్నాయ భావాలను చర్చకు పెట్టాలి. పరిష్కారాలను సూచించాలి. ఇది జరగాలంటే మొట్టమొదట విద్యావంతులైన ప్రజాబాహుళ్యం ఉండాలి. ఆ ప్రజాబాహుళ్యం ప్రజాహిత మేధావుల పాత్రను అంగీకరించేది మాత్రమే కాకూడదు. వారి అవసరాన్ని గుర్తిం చేదిగా ఉండాలి.

**మనకు మనం విద్యావంతులం కావడం**

**❝ నయా-ఉదారవాద సంస్కృతినీ, ఆర్థిక వ్యవస్థనూ సుల భంగా మార్చడం సాధ్యం కాదు. కాని వాటి దుష్పరిణామాలను తగ్గించవచ్చు. కాకపోతే ఆ పని జరగాలంటే, సమాజపు వనరుల మీద పౌరులందరికీ హక్కులు ఉన్నాయనీ, సంక్షేమం కోసం సామాజిక న్యాయం కోసం అడిగే హక్కు ప్రజలకు ఉందనీ, ఆ హక్కుల పునాది పైననే సమాజం నిర్మాణం కావా లనీ మనకు స్పష్టత ఉండాలి. ❞**

విద్యావంతులైన ప్రజాబాహుళ్యంగా మారాలంటే మనకు మనం ఎటువంటి విద్యా శిక్షణ పొందాలి? ఈ ప్రశ్న ఇటు ఇభిన్న శాఖలలోని వృత్తి నిపుణులకూ, అటు ఎందరో ప్రజాహిత మేధావులకూ సంబంధించినది. ఈ ఇద్దరూ కూడ తమ ప్రత్యామ్నాయ అధికారాన్ని తమ వృత్తిపరమైన స్థాయి నుంచే పొందుతారు. ఇవాళ మనకు మనం విద్యాశిక్షణ పొందడానికి ప్రధానంగా రెండు వనరులున్నాయి. మొదటిది. మౌఖిక రూపంగా అసంఘటిత దృశ్య శ్రవణ మాధ్యమాలు. రెండవది క్రమబద్ధమైన విద్యా సంస్థల వ్యవస్థ. ఈ రెండింటికీ మధ్యంతరంగా ఉన్నది ఇంటర్నెట్. మిగిలిన రెండింటి లాగానే ప్రస్తుతం దీని ప్రభావ పరిధి కూడా మొత్తం సమాజానికీ విస్తరించినది కాదు. టివి ఛానళు ళ అరుదైన మినహాయింపులతో ఒకదాన్నుండి మరొక ఛానల్‌కు కుప్పిగంతులు వేస్తుంటారు. ప్రతి ఒక్క విషయాన్ని, అది ఎంత అసంగతం గానైనా సరే, ప్రస్తుత రాజకీయ పార్టీ ప్రతినిధు లతో నిండిపోయేలా చూస్తున్నారు. ఆ రాజకీయ పార్టీల ప్రచారార్భాటం కింద నిజమైన చర్చ అణగిపోతున్నది. ఆ పార్టీ ప్రతినిధులు ప్రకటనల వెనుక వాస్తవమేమిటో పరిశోధించడానికి ఏ ఒక్క కార్యక్రమమూ ప్రయత్నించదు. టెలివిజన్ మీద ఒక ప్రత్యామ్నాయ ఛానల్ అవకాశమే లేదా అని నాకు ఆందోళన కలుగుతున్నది. ఒకవేళ అందుకు తగిన ఆర్థిక వనరులు సమకూ ర్చడం కష్టమైతే కనీసం వ్యాపార లాభాల మీద మాత్రమే దృష్టి లేని ఒక రేడియో ప్రసార కేంద్రమైన సాధ్యం కాదా అనుకుంటున్నాను. ప్రత్యామ్నాయ భావాలను పరిష్కారాలనూ అన్వేషించడాన్ని ప్రోత్సహించే వేదిక, ఒకే ఒక్క బైట్‌ను దాటి అన్వేషించే వేదిక, విమర్శనాత్మక విచారణ సాగించాలనే ప్రేరణ ఉన్న వేదిక సాధ్యం కాదా? మరుసటి ఎన్నికల ప్రయోజ నాలు అనే క్షణికమైన ఆసక్తిని మించి, సమాజం పట్ల ఆసక్తి గల వారి గళాన్ని వినిపించే వేదికను ఎట్లా ఏర్పాటు చేయగలం? అటువంటి వేదిక భవిష్యత్తు గురించి ఆలోచిస్తున్నవారెవరు?

ఇక మరొక విద్యా శిక్షణల వనరు ఉంది. అది క్రమబద్ధమైన విద్యారంగం దీన్ని రెండు స్థాయిలలో చూడవలసి ఉంది. మొదటిది విద్య పాఠ్య ప్రణాళికల సారాంశం. రెండవది. విద్యా సంస్థల స్వతంత్ర ప్రతిపత్తి. విద్య క్రమ క్రమంగా విద్యావేత్తల చేతినుంచి దూరమవుతూ రాజకీయవేత్తల, రాజకీయ సంస్థల చేతుల్లోకి చేరుతున్నది. రాజకీయ సంస్థలు తమను తాము సాంస్కృతిక మత సంస్థలుగా చెప్పుకుంటున్నాయి. ఇవాళ్టి రాజకీయవేత్తలు మేధావులతో సంబం ధాలంటూ పెట్టుకుంటే ఎటువంటి సంబంధాలు పెట్టుకుంటున్నారనేది అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం.

ఒక వ్యక్తిని విశ్లేషణాత్మక, తార్కిక, స్వతం త్ర పద్ధతుల్లో ఆలోచించేలా తయారు చేయడమే ఆదర్శవంతమైన విద్యాశిక్షణ సారాంశం కావా లి. విద్యాశిక్షణ వ్యక్తికి సృజనాత్మక ఆలోచన నివ్వాలని ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. విద్యా శిక్షణ పొందిన వ్యక్తి కేవలం హేతుబద్ధ ఆలో చనా శక్తిని ఉపయోగించాలి. సాంకేతిక పరి జ్ఞాన రూపంలో తనకు అందుతున్న జ్ఞానానికి ఒక నిర్దిష్ట నేపథ్యం ఉన్నదనీ, ఆ నేపథ్యమే ఆ జ్ఞానాన్ని ఉత్పత్తి చేసి, దాన్ని పెంచి పోషిస్తుందనే వాస్తవాన్ని గ్రహించాలి. జ్ఞానం శూన్యం నుంచి

**'మార్క్సిస్టు' పై మీ అభిప్రాయాలు తెలపండి!**

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్దిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తు న్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చిం చాల్సిన అంశాలున్నా, అదనపు సమాచారమున్నా క్లుప్తంగా రాసి పంపండి

మీ లేఖలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్,**

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక

ప్రజాశక్తి ప్రెస్, గవర్నరుపేట, విజయవాడ–2

ఊడిపడదు. ఇరవయ్యో శతాబ్దిలోని విశిష్ట సాంకేతిక అన్వేషణలు ఆ శతాబ్దిలో మాత్రమే జరగడానికి అవకాశం ఉంది. ఆ అన్వేషణలు మూడు వేల సంవత్సరాల క్రితం సాంకేతిక, అనుబంధ జ్ఞానం లేకుండా వెలువడడానికి అవకాశం లేదు. ఏ శాస్త్రీయ అన్వేషణకైనా సుదీర్ఘకాలం పడుతుంది. విజ్ఞానశాస్త్ర చరిత్రకారులు ఆ సుదీర్ఘకాలం ఎలా పట్టిందో ఆధారాలతో రుజువు చేస్తారు. ఒక అన్వేషణను సాధ్యం చేసిన సాంకేతిక పరిజ్ఞానమూ, జ్ఞానమూ చరిత్రలోని ఒకానొక ప్రత్యేక సందర్భంలో ఎలా తలెత్తాయో, ఎలా పురోగమించాయో చూపుతారు.

### శాస్త్ర విజ్ఞాన పాత్ర

మన సమాజంలో విజ్ఞానశాస్త్రం పురోగమించిందని మనం చెప్పుకోదలచుకుంటే గతంలో జ్ఞానస్థాయిలోనూ, సాంకేతిక పరిజ్ఞానం ద్వారా అన్వయ స్థాయిలోనూ ఆ విజ్ఞాన శాస్త్రం నిర్వహించిన పాత్ర ఏమిటో వెలికితీయవలసి ఉంటుంది. ఇరవయో శతాబ్ది అన్వేషణలు వేల సంవత్సరాల క్రితం ప్రాచీన భారతదేశంలోనే ఉన్నాయని గొప్పలు చెప్పుకునే బదులు, అప్పుడు మన దగ్గర ఉండిన విజ్ఞాన శాస్త్రపు, సాంకేతిక పరిజ్ఞానపు స్వభావం ఏమిటో పరిశోధించవలసి ఉంటుంది. మన చరిత్ర క్రమంలో ఉన్నదని కచ్చితమైన ఆధారాలున్న విజ్ఞాన శాస్త్రం ఏమిటో, సాంకేతిక పరిజ్ఞానం ఏమిటో, వాటితో మనం ఏమి చేశామో పరిశోధించవలసి ఉంటుంది.

విద్యా శిక్షణలో మొట్టమొదటి అడుగు అప్పటికి ఉనికిలో ఉన్న జ్ఞానం గురించి సమాచారాన్ని అందించడం. ఆ తర్వాతి అడుగు ఆ ఉన్న జ్ఞానం స్థానంలో విద్యార్జనాక్రమం ద్వారా కొత్త, మెరుగైన జ్ఞానాన్ని చేర్చవలసిన అవసరం ఉందా అని అంచనావేయడం. ఇవాళ ఉన్న విద్యావ్యవస్థ చాల పాఠశాలల్లో మొదటి అడుగుకే చేరడం లేదు. కావలసిన పాఠశాలల కన్నా అతి తక్కువ పాఠశాలలు ఉండడం, ఉన్నవి కూడా దారుణమైన స్థితిలో ఉండడం బహుశా ఉద్దేశపూర్వక విధానమేమో అని కొందరు అనుమానిస్తున్నారు. పౌరులందరూ అక్షరాస్యులు మాత్రమే కాక విద్యావంతులు కూడ అయితే తమకు ప్రమాదమని పాలకులు భావిస్తున్నందువల్లనే ఈ విధానాన్ని కొనసాగిస్తున్నారని అనుమానిస్తున్నారు. గత అర్ధ శతాబ్దంలో పాఠశాలలో చేరడానికైనా తగిన విధంగా జ్ఞానం అందించలేక పోవడంతో మనం ఒక అర్థరహితమైన స్థితికి చేరాం. అయినా మనం మరిన్ని విశ్వవిద్యాలయాలు, ఐఐటిలు, ఐఐఎంలు, వగైరా వగైరా ఏర్పాటు చేయడానికి ఉవ్విళ్లూరుతున్నాం. ఈ పరిస్థితి అనివార్యంగా విద్యను పలుచబరచి చివరికి నిరర్థక స్థితికి చేరుస్తుంది. ఇది మనను కనిష్ట సామాన్య గుణిజం స్థాయికి, అంటే క.సా.గు విద్య స్థాయికి, అట్టడుగుకు చేరుస్తుంది. చిన్నారి పిల్లలలో పరిశోధనాత్మక మేధస్సును పెంపొందించే అత్యవసరమైన ఆలోచనా పద్ధతులను మొద్దుబార్చడమే మన విద్యా వ్యవస్థ చేస్తున్నది. అంటే ప్రజాహిత మేధావులకు ప్రతిస్పందించగలిగే మేధస్సు తయారు కాకుండా పోతున్నది. విద్యావ్యవస్థ ఇలా ఉన్నప్పటికీ స్వతంత్రంగా సృజనాత్మకంగా ఆలోచించగల శక్తి ఉన్నవారు కొందరు తయారవుతున్నందుకు సంతోషించాలి. కాని వారి సంఖ్య మనకు ఎంత మంది కావాలో దానికన్న చాలా తక్కువ. విద్యార్థులు ప్రశ్నలు అడగడానికి ప్రోత్సహించే, స్వతంత్రంగా ఆలోచించడానికి ప్రేరేపించే విద్యా భావననే మనం అనుసరించి ఉంటే మనది ఎంత శక్తివంతమైన, ఆలోచనాత్మకమైన సమాజం అయి ఉండేదో ఒక్కసారి ఊహించండి.

వర్తమాన ప్రజాహిత మేధావులు లేవనెత్తగలిగిన సమస్యలేమిటని ఎవరైన అడగవచ్చు.నిరాదరణకు గురవుతున్న పౌరులకు, ఆ మాటకొస్తే భారతీయులలో అత్యధిక సంఖ్యాకులకు, సుపరిపాలన అందాలంటే వలసవాద మూలాలతో నిర్మాణమైన, కాలం చెల్లిన వ్యవస్థ అవశేషాలతో నడుస్తున్న ప్రస్తుత పద్ధతులను మార్చవలసి ఉంటుంది. జాతీయ సంపద అన్యాయమైన పద్ధతులను మార్చవలసి ఉంటుంది. జాతీయ సంపద అన్యాయమైన పద్ధతిలో పంపిణీ అవుతున్నందువల్ల పేదరికం హెచ్చుస్థాయిలో ఉంది. వలసవాద విధానం సృష్టించిన వర్గీకరణనే వాడుకుంటూ కుల మత ప్రాధాన్యతలు అదే విధంగా కొనసాగుతున్నాయి. వలసవాద ప్రభుత్వం మెజారిటీ మతం, మైనారిటీ మతం అనే తరగతులు కనిపెట్టి, మత అస్థిత్వ రాజకీయాలను ప్రోత్సహించింది. వాటిని ప్రస్తుతం శాశ్వత తరగతులుగా పరిగణిస్తున్నారు. ప్రజాస్వామ్యమంటే ఏ సమస్యకు ఆ సమస్యను బట్టి మెజారిటీ, మైనారిటీలు ఏర్పడతాయి. గనుక ఈ శాశ్వత తరగతులు ప్రజాస్వామ్య నిర్వహణనే అనుమతించడం లేదు. విద్యలో, ఉద్యోగాలలో రిజర్వేషన్ విధానాన్ని శాశ్వత ప్రాతిపదికన కొనసాగిస్తే, వాటివల్ల స్వల్పమైన ప్రయోజనాలు ఉన్నప్పటికీ, మత, కుల అస్థిత్వాలను పునరుద్ధరించడమే జరగుతుంది. ఈ వలసవాద అస్థిత్వాలను పక్కనపెట్టి, సంపద సమాన పంపిణీకి ప్రయత్నాలు చేస్తూ మన సమాజాన్ని, ఆర్థిక వ్యవస్థనూ ఒక భిన్నమైన పద్ధతిలో పునర్నిర్మించడంలోనే అసలైన పరిష్కారం ఉంది.

### లౌకికంగా ఉండవలసిన అవసరం

ఒక ప్రజాస్వామిక వ్యవస్థ అంతిమంగా విజయం సాధించాలంటే ఆ సమాజం లౌకికంగా ఉండాలి. అంటే ఆ సమాజం అన్ని మతాల సహజీవనాన్ని దాటి చూడగలగాలి. ఆ సమాజ సభ్యులు పౌరులుగా సమానమైన సామాజిక, ఆర్థిక హక్కులు కలిగి ఉండాలి. తమ మతంతో ప్రమేయం లేకుండా ఆ హక్కులను వినియోగించుకోగలిగి ఉండాలి. ఈ హక్కుల వినియోగానికి సంబంధించిన కార్యకలాపాలలో సమాజం మత సంస్థల అదుపు నుంచి స్వతంత్రంగా ఉండాలి. ఆ సమాజ సభ్యులకు తమ ఇష్టం వచ్చిన మతాన్ని అవలంభించడానికిగాని, ఏ మతాన్ని అవలంభించకుండా ఉండడానికి గాని స్వేచ్ఛ ఉండాలి. ఇటువంటి లౌకికీరణ ఎలా ఉంటుందో, ఒక ప్రజాస్వామ్య వ్యవస్థలో అది ఎందుకు అవసరమో వివరించే పని, ఆ లౌకీకరణ క్రమాన్ని పరిరక్షించే పని చేయవలసింది ప్రజాహిత మేధావులే.

మన సమాజంలో ప్రజాహిత మేధావులు లేకుండా పోలేదు. వారిని ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోనక్కరలేదు. నేను ముందే చెప్పినట్టు వారికి మన సమాజంలోనే పూర్వీకుల పరంపర ఉంది. అయితే చారిత్రక మార్పుల వల్ల వారి పాత్ర, ఇంతకు ముందరి మేధావులకు పూర్తిగా భిన్నంగా కాకపోయినా, విస్తరించవలసిన అవసరం మనకాలంలో ఏర్పడిందని గుర్తించలసి ఉంది. మన సమాజాన్ని అర్థం చేసుకోవడంలో మన ప్రజాహిత మేధావుల పూర్వీకులు కొత్త కోణాలను అదనంగా చేర్చారు. మానవస్థితిని హేతుబద్ధ, తార్కిక వాదనల ద్వారా వివరించడానికి ప్రయత్నించారు. సమాజాన్ని అదుపు చేసే వారి మీద లౌకిక, నైతిక అధికారాన్ని నెరపిన గతకాలపు భిన్నవాదాలు ఆ ప్రజాహిత మేధావులను అంతర్గతంగా పోషించాయి. మనకాలానికి ముందు కాలంలోని ఆ ఆలోచనలే వలసవాద అధిపత్యాన్ని తోసిరాజన్నాయి. విమర్శనాత్మక హేతుబద్ధతను పాటించే ప్రజాహిత మేధావులు ఈ ఉజ్వల పరంపరకు వారసులు. వ్యాసాన్ని సుదీర్ఘమైన ప్రశ్నతోనే ముగించదలచాను. స్వతంత్రంగా ఆలోచించగలిగిన వారికీ, అవసరమైన ప్రశ్నలు వేసేవారికీ మనదగ్గర కొదవలేదు. కాని తరచుగా ఏమవుతున్నదంటే, గొంతులు వినబడవలసినవేళ మౌనం రాజ్యమేలుతున్నది. మనం వ్యవస్థను ఆమోదించే సౌఖ్యానికి సులభంగా లోబడి జీర్ణమైపోయామా? ప్రశ్నిస్తే రాగల, వచ్చే ప్రతీకారానికి భయపడిపోతున్నామా? ఆలోచించడానికీ, ఉమ్మడిగా ఆలోచించడానికీ మనను ప్రోత్సహించే స్వతంత్ర స్థలం కావలసి ఉందా?

**(వీక్షణం పత్రిక సౌజన్యంతో)**

# ‘ఆప్’ విజయానికి జాతీయ ప్రాధాన్యత ఉంది

## సందేహాలు సమాధానాలు



**- బి.వి.రాఘవులు**

**కా్రమేడ్ బి.వి. రాఘవులు గారికి, ఢిల్లీ ఎన్నికల ఫలితాలు ఆప్ పార్టీకి అత్యధిక సీట్లను, ఓట్లను తెచ్చిపెట్టాయి. 55 శాతం ఓట్లంటే గొప్ప విజయం. కానీ గతంలో ఆప్ అధికారాన్ని దుర్వినియోగం చేసింది. ఇప్పుడు ఎన్నికైన నేతల్లో సుమారు 30%మంది కోటీశ్వరులు. ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా సిపిఎం పార్టీ కూడా ఆప్‌కి మద్దతు ప్రకటించింది. మీడియా, షేర్‌మార్కెట్ ‘ఆప్ నేత’లతో పుంజుకోవాలని చూస్తున్నాయి. మన పంథా సరియైనదేనా?**

**ఎం. వేమనారాయణ,**

కదిరి అనంతపురంజిల్లా

ఢిల్లీ నగరంలో ఆప్ పార్టీ సాధించిన ఘన విజయానికి చాలా ప్రాధాన్యత ఉంది. దేశాన్ని పరిపాలిస్తున్న బిజెపిని దేశ రాజధానిలోనే సంపూర్ణంగా ఓడించడం చిన్న విషయం కాదు. కచ్చితంగా విజయం సాధిస్తామని విర్రవీగిన బిజెపి నాయకత్వానికి ఎన్నికల ఫలితం ఒక చెంప పెట్టు. జాతీయ, అంతర్జాతీయ, కార్పొరేట్, బడాపెట్టుబడిదారీ శక్తులు 2014లో నరేంద్రమోడీ ప్రభుత్వాన్ని గద్దెనెక్కించిన అనతి కాలంలోనే ఇటువంటి ఎదురుదెబ్బ తినడం బిజెపికే కాదు, కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా ఉన్నవారందరికీ నిరాశ కలిగించింది. ఎన్నికలకు ముందు విస్తృతంగా మతభావాలను రెచ్చగొట్టి వినియోగించుకోవాలన్న బిజెపి ప్రయత్నాలకు చుక్కెదురు కావడం, మతతత్వ శక్తులకు పెట్టని కోట అనుకున్న ఢిల్లీలోనే బిజెపి దెబ్బతినడం దేశవ్యాప్తంగా మతోన్మాదులకు వ్యతిరేకంగా పోరాడడానికి లౌకిక శక్తుల ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. ఎన్నికలకు ముందు ఆయారామ్, గయారామ్‌లను ప్రోత్సహించి పార్టీలో చేర్చుకొని తద్వారా గెలవాలనుకున్న నీతిమాలిన రాజకీయాలకు కూడా ప్రజలు గట్టిగా బుద్ధి చెప్పారు. అందువల్లే ఆప్ విజయాన్ని మనం హృదయపూర్వకంగా ఆహ్వానించాం. ఎన్నికల్లో వామపక్షాలు పోటీ చేయని చోట ఆప్‌పార్టీకి మద్దతిచ్చామని కూడా గమనించాలి.

సామాన్య ప్రజలు, మధ్యతరగతి ప్రజలు, మైనార్టీలు ఆప్‌కు గట్టి మద్దతునిచ్చి గెలిపించారు. గతంలో కాంగ్రెస్‌కు, బిఎస్పీకి మద్దతిచ్చిన ప్రజలందరూ ఆ పార్టీల అవకాశ వాద, అవినీతి, ప్రజావ్యతిరేక విధానాలతో విసిగిపోయి మూకుమ్మడిగా ఆ పార్టీలను వదిలి ఆప్ వెనుక సమీకరణ అయ్యారు. అందుకే ఆ పార్టీలకు వచ్చిన ఓటింగ్ శాతం కనీస స్థాయికి పడిపోయింది.

పరిపాలనా యంత్రాంగంలో లంచగొండితనం, ఆశ్రిత పక్షపాతం, ఆర్భాటాలను నిర్మూలిస్తానని, సత్పరిపాలన నెలకొల్పుతానని ఆప్ చెప్పిన మాటలను ప్రజలు నమ్మారు. అధికారాన్ని చేపట్టి మధ్యలో వదిలేసిన గత అనుభవం నుండి గుణపాఠం నేర్చుకొని, గెలిపిస్తే ఐదు సంవత్సరాలు పరిపాలన సాగిస్తామని చెప్పడాన్ని ప్రజలు విశ్వసించారు. అంతేకాకుండా ఢిల్లీలో 70 శాతంగా ఉన్న మురికివాడల ప్రజలకు తీవ్ర సమస్యలుగా ఉన్న విద్యుత్ ధరలను, మంచినీటి కొరతను తీరుస్తామని, మురికివాడల నిర్మూలనా కార్యక్రమాలను నిలిపివేస్తామని చేసిన వాగ్దానాలు ప్రజలను ఆకర్షించాయి. అధికారంలోకి వచ్చిన తర్వాత దిగువ తరగతి ప్రజలకు విద్యుత్ ఛార్జీలు సగానికి తగ్గించడం, కొంతమొత్తం మంచినీటిని ఉచితంగానే సరఫరా చేయడానికి నిర్ణయం తీసుకోవడం, మురికివాడల కూల్చివేతను నిషేధించడం ఎన్నికల్లో ఆప్ పట్ల ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకోవడానికి చేస్తున్న ప్రయత్నాలే. ఇటువంటి ప్రయత్నాలు కొనసాగితే ఆప్ పట్ల ప్రజల ఆదరణ స్థిరపడేందుకు అవకాశం ఉంది. వాస్తవంగా ఆప్ చేసిన వాగ్దానాలు కానీ, అధికారంలోకి వచ్చాక తీసుకున్న కొన్ని నిర్ణయాలు కానీ సరళీకరణ విధానాలతో అవస్థలు పడిన ప్రజలకు ఊరట కలిగించే చర్యలే. ఇప్పటి వరకు ఆప్ వ్యవహరించిన తీరును మనం ఆహ్వానించాల్సిందే.

ఇక పార్టీ యొక్క స్వభావానికి వస్తే అది ఒక వామపక్ష పార్టీ అని నిర్ణయానికి రాలేం. అది ప్రకటించిన విధానాలు, అమలు చేస్తున్న తీరు చూసినప్పుడు ఒక ప్రజాస్వామిక, లౌకిక వాద పార్టీ అని చెప్పవచ్చు. ప్రస్తుత పరిస్థితుల్లో ఇటువంటి శక్తులు బలపడటం పట్ల మనం సంతోషించాల్సిందే. ఆప్‌కి నిధులు సమకూర్చడంలో క్రియాశీలకంగా ఉండి, దాని కోసం పని చేయడంలో అనేకమంది ధనవంతులు ముఖ్యపాత్ర నిర్వహించారు. ఆప్ అభ్యర్థుల్లో అనేకమంది కోటీశ్వరులు కూడా ఉన్నారు. అయినంత మాత్రాన కాంగ్రెస్, బిజెపిల్లాగా ఆ పార్టీ కార్పొరేట్, బడా పెట్టుబడిదారీ శక్తులకు ప్రాతినిధ్యం వహించే పార్టీయే అని అప్పుడే చెప్పలేం. ప్రస్తుతం ఆ పార్టీ ఉన్నత మధ్య తరగతి, పెటీ బూర్జువా పార్టీగా ఉంది. రాబోయే కాలంలో ఈ స్వభావంలో మార్పు రాదని అనుకోలేం. కొత్త పార్టీ అయినందున ఇంకా అనేక మార్పులు రావొచ్చు. అయితే, భవిష్యత్‌లో ఎప్పటికప్పుడు దాని స్వభావంలో వస్తున్న మార్పుల గురించి అంచనా వేసుకుంటూ ఉండాలి. ఇప్పుడే దాన్ని స్థిరపడిన బూర్జువా భూస్వామ్య పార్టీగా పరిగణించడం తొందరపాటు అవుతుంది.

**రాష్ట్రంలోగాని, దేశంలోగాని ప్రాంతీయ పార్టీలు అన్నీ బూర్జువా పార్టీలే. ఎన్నికలలో బూర్జువా పార్టీలతో పొత్తులు పెట్టుకోవడం వలన మనం నష్టపోతున్నాం. మన కార్యకర్తలకు కూడా చెడు అవలక్షణాలు అంటుకొంటున్నాయి. పొత్తులు ఇక వద్దు. ఒంటరిగానే మనం ఎన్నికలకు పోదాం. ప్రత్యామ్నాయ శక్తిగా ఎదుగుదాం అని జిల్లా మహాసభలలో, రాష్ట్ర మహాసభలలో చర్చ జరుగుతున్నది. అయితే ఎన్నికలు వచ్చే సమయానికి బూర్జువా పార్టీలతో పొత్తులకోసం ప్రయత్నం జరుగుతున్నది. ఎందుకని మనం ఆ రకంగా నిర్ణయాలు మార్చుకోవలసి వస్తున్నది. వివరించగలరు.**

**రాష్ట్ర మహాసభలో రాయలసీమ జిల్లాలకు రాష్ట్ర కార్యదర్శివర్గంలో ఒకరిని మాత్రమే ఎంపిక చేశారు. ఉత్తరాంధ్ర, కోస్తా జిల్లాలకు కార్యదర్శివర్గంలో అధిక ప్రాధాన్యత ఇచ్చారు. కా॥ ఎం.ఎ. గఫూర్, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాబట్టి కార్యదర్శి వర్గంలో చోటు కల్పించినట్లుంది. రాయలసీమ జిల్లాలనుండి ఇంకొకరిని కార్యదర్శివర్గం లోకి ఎంపిక చేసి ఉంటే బాగుండేది కదా? వివరణ ఇవ్వగలరు?**

**- బి. దస్తగిరిరెడ్డి,**

కడప.

బూర్జువాపార్టీలతో సర్దుబాట్లు ఉండవు అని ఒకవైపు చెబుతూ చివరి నిమిషంలో ఆ వైఖరిని వదిలేసి పార్టీ ఎన్నికల సర్దుబాట్లకు సిద్ధమవుతుందన్న భావన ఈ ప్రశ్నలో ఇమిడి ఉంది. చివరి వరకూ ఒకమాట చెబుతూ, ఆఖరిలో మాట మార్చి వ్యవహరించడం అనేది పార్టీ ఎప్పుడూ చేయలేదు. ఎన్నికల సందర్భంలోనూ అలా వ్యవహరించలేదు. గతంలో పార్టీ మహాసభల్లో తీసుకున్న నిర్ణయాల కనుగుణంగా

పార్లమెంటు ఎన్నికల్లో, శాసనసభ ఎన్నికల్లో, స్థానిక ఎన్నికల్లోనూ ప్రాంతీయ బూర్జువా భూస్వామ్య పార్టీలతో సర్దుబాట్లు చేసుకుంటూ వచ్చాం. రాజకీయ తీర్మానాలను పరిశీలించినా, పత్రికల్లో ఇచ్చిన ప్రకటనలను చూసినా ఈ విషయం అర్థమవుతుంది.

అయితే, 2015 ఏప్రిల్ 14 నుండి 19 వరకూ జరిగే 21వ అఖిలభారత పార్టీ మహాసభల్లో చర్చించబోయే ముసాయిదా రాజకీయ తీర్మానాల్లో మాత్రం అఖిలభారత స్థాయిలో బూర్జువా పార్టీలతో ఎటువంటి రాజకీయ సంఘటన కానీ, ఎన్నికల సర్దుబాట్లు కానీ ఉండకూడదని పార్టీ కేంద్రకమిటీ ప్రతిపాదించింది. వామపక్ష ప్రజాతంత్ర సంఘటన నిర్మాణానికి పూనుకోవాలని పిలుపునిచ్చింది. ఈ రాజకీయ తీర్మానం ఇప్పుడు బహిరంగ చర్చ కోసం విడుదల చేయబడింది. సహజంగానే ఈ అంశం పార్టీలోని అన్నిస్థాయిల్లో చర్చనీయాంశంగా ఉంది. పార్టీ బయట కూడా ఈ విషయంపై సానుకూలంగా, ప్రతికూలంగా చర్చలు జరగుతున్నాయి. ఈ చర్చలన్నింటినీ పరిగణనలోకి తీసుకొని, పార్టీ మహాసభ ఏ నిర్ణయం చేస్తే ఆ నిర్ణయాన్నే చెప్పాల్సి ఉంటుంది. దానినే అమలు చేయాల్సి ఉంటుంది. అందువల్ల చివరి వరకూ ఒకటి చెప్పి, ఆఖరున మరొకటి చేస్తామని ఆందోళన పడనవసరం లేదు.

రాష్ట్రమహాసభల్లో ఎన్నికైన కార్యదర్శివర్గంలో రాయలసీమ నుండి ఇంకొకరు ఉంటే బాగుండేదని మీరు రాసిన అభిప్రాయాన్ని అర్థం చేసుకోగలను. వాస్తవంగా ప్రస్తుతం కార్యదర్శివర్గ సభ్యులుగా ఉన్నవారితో పాటు ఆ స్థాయిలో బాధ్యతలు నిర్వహించగలిగిన వారు రాష్ట్రకమిటీలో అనేకమంది ఉన్నారు. కానీ, అటువంటి వారినందరినీ పరిమిత సంఖ్యలో ఏర్పడే కార్యదర్శివర్గంలోకి ఎన్నుకోవటం సాధ్యం కాదు. వివిధ రంగాలు, కేంద్రంలో నిర్వహించాల్సిన బాధ్యతలు మొదలగు అనేక అంశాలను పరిగణనలోకి తీసుకొని రాష్ట్రకమిటీని రాష్ట్ర మహాసభ, రాష్ట్ర కార్యదర్శివర్గాన్ని రాష్ట్ర కమిటీ ఎన్నుకుంటాయి. వాటి కూర్పు గురించి భిన్నాభిప్రాయాలు ఉండవచ్చు. భవిష్యత్‌లో అవకాశం వచ్చినప్పుడు అవసరమైతే, తప్పకుండా మార్పులు చేర్పులు జరగుతాయి. అప్పటి వరకూ ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన కమిటీలు అయినందున వాటి ఆధీనంలోనే పార్టీ నడవాల్సి ఉంటుంది.

కామ్రేడ్ గఫూర్‌గారు సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాకముందు నుండి పార్టీ కేంద్ర కమిటిలోనూ, రాష్ట్ర కార్యదర్శివర్గంలోనూ ఉన్నారన్న విషయం మీ గమనంలో ఉన్నట్లు లేదు. అందువల్ల సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాబట్టి ఆయన కార్యదర్శివర్గంలో కొనసాగుతున్నారని మీలో ఉన్న అపోహ సరైంది కాదు.

**విజయవాడ సెంటర్ స్టడీసర్కిల్‌లో వచ్చిన ప్రశ్న.**

**ఎఫ్.డి.ఐ.రాక వలన వినియోగ సరుకులు, మోటారు బైకుల లాంటి వాటి ధరలు తగ్గాయని మధ్య తరగతి అంటున్నారు. ఎఫ్.డి.ఐ, ద్రవ్య పెట్టుబడుల రాకను మనం గుడ్డిగా వ్యతిరేకిస్తున్నామని మధ్యతరగతి భావిస్తున్నారు. ఎఫ్.డి.ఐ., ద్రవ్య పెట్టుబడుల ప్రవేశం వలన దుష్ఫలితాలు కనిపిస్తున్నా మధ్యతరగతి ఎందుకని అర్థం చేసుకోలేకపోతున్నారు?**

**ద్రవ్య పెట్టుబడులు అన్ని రంగాలలోకి ప్రవేశించటంతో ప్రజలు దారుణమైన దోపిడీకి గురవుతున్నారు. అయినా సామ్రాజ్యవాద దోపిడీని ఎందుకని బట్టబయలు చేయలేకపోతున్నాం?**

విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు దేశంలోకి రావడానికి వినియోగసరుకులు, మోటారు బైకుల ధరలు తగ్గడానికి ఎటువంటి సంబంధం లేదు. మధ్యతరగతి ఆ రకంగా అనుకుంటే సహజంగా వారిలో వ్యాపించే భ్రమల్లో అది ఒక భాగమే. దేశంలో సరళీకరణ విధానాలు ప్రవేశపెట్టిన తర్వాత దిగుమతులు, ఎగుమతుల మీద ఆంక్షలు తొలగించబడ్డాయి. గతంలో స్వదేశీ పరిశ్రమలను రక్షించుకోవడానికి మనదేశంలో పారిశ్రామికీకరణను ప్రోత్సహించడానికి దిగుమతుల మీద ఆంక్షలుండేవి. ఇప్పుడు లేవు. అందువల్ల విదేశాల నుండి మోటారు సైకిళ్ళు, ఇతర వినియోగ వస్తువులు పుష్కలంగా దిగుమతి అవుతున్నాయి. అలాగే స్థానిక పెట్టుబడిదారులు విదేశీ పెట్టుబడిదారులు భాగస్వాములై విడిభాగాలను దిగుమతి చేసుకొని, ఇక్కడ వస్తువులను కూర్పుచేసి అమ్ముతున్నారు. కొన్నిసందర్భాల్లో ఇక్కడే ఉత్పత్తి చేస్తున్నారు. అయితే, వీటి మూలంగా ధరలు తగ్గాయని అనుకోవడం పొరపాటు. అంతర్జాతీయంగానే శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానంలో వచ్చిన మార్పులు, దానిమూలంగా ఉత్పాదకతలో వచ్చిన అభివృద్ధి, ఆసియా దేశాల్లో, ముఖ్యంగా చైనాలో చవకైన శ్రమ తోటి ఉత్పత్తి చేయడం వంటి అంశాల మూలంగా ధరలు తగ్గాయి తప్ప విదేశీ పెట్టుబడి మూలంగా కాదు. అందులో ద్రవ్యపెట్టుబడి మాత్రమే వస్తే షేర్‌మార్కెట్లు పెరగడం, ఆస్తుల విలువలు బుడగల్లాగా పెరగడం తప్ప వాస్తవ ఆర్థికాభివృద్ధి ఉండదు. గత 25 సంవత్సరాల సంస్కరణల కాలంలో మనదేశంలో పారిశ్రామిక రంగం ఏమాత్రం పెరగలేదు. స్థూలజాతీయోత్పత్తిలో 25 శాతం దగ్గరున్న సేవారంగం మాత్రమే పెరిగింది. అందుకే మనదేశంలో 8.5 శాతం అభివృద్ధి చెందామని చెప్పుకుంటున్నా ఉపాధి సృష్టించబడలేదు. ఇప్పుడు ప్రధానమంత్రి మోడీగారు ఇచ్చిన మేక్ ఇన్ ఇండియా అన్న నినాదాన్ని చూసినా ఇప్పటి వరకూ మనదేశంలో తయారవడం తక్కువ, ఇతర దేశాల నుండి తెచ్చుకునేవే ఎక్కువ అని ఎవరికైనా అర్థమవుతుంది.

విషయాలు ఇంత స్పష్టంగా ఉన్నా ప్రజలకు, ముఖ్యంగా మధ్యతరగతి ప్రజలు ఎందుకు అర్థంచేసుకోవడం లేదో, వారిలో ఎందుకు భ్రమలు కొనసాగుతున్నాయన్నది ముఖ్యమైన అంశం. గత దశాబ్దకాలంలో మధ్యతరగతిలో కొంతభాగం సంస్కరణల మూలంగా లాభపడింది. పేదలు, దిగువ మధ్యతరగతి, చిన్న-సన్నకారు మధ్యతరగతి రైతాంగం, చేతివృత్తులవారు, ఇతర పేదలు సంస్కరణల మూలంగా నష్టపోయారు. కొద్దో గొప్పో సంస్కరణల వల్ల లాభం పొందిన తరగతులు నష్టాలను గమనించకపోవడం, కొంతమేరకు అర్థమైనా భ్రమల్లో కొనసాగడంలో ఆశ్చర్యం లేదు. ఇప్పటి వరకూ మధ్యతరగతి పరిస్థితి అదే. కానీ, 2008లో ప్రపంచ స్థాయిలోనే తీవ్ర ఆర్థికమాంద్యం ప్రారంభమైన తర్వాత ఇప్పటివరకూ ఆ మాంద్యం నుండి మనదేశంతో సహా ప్రపంచదేశాలు కోలుకోలేకపోవడం వలన మధ్యతరగతిలో, అలాగే ఇతర ప్రజల్లో సంస్కరణల పట్ల సంశయాలు ప్రారంభమయ్యాయి. రాబోయే కాలంలో ఈ పరిస్థితి ఇంకా తీవ్రమవుతుంది. ఇప్పటివరకూ మనం సంస్కరణలకు వ్యతిరేకంగా చేసిన కార్యక్రమాలకు వచ్చిన స్పందన కన్నా, భవిష్యత్‌లో ఇవే కార్యక్రమాలకు ఎక్కువ స్పందన వస్తుంది. మనం కూడా గతంలో సంస్కరణలకు వ్యతిరేకంగా కొంత కృషి చేసినా, అవసరమైనంత తీవ్రంగా, లోతుగా, నిర్దిష్టంగా చేయలేక పోయాం. సంస్కరణలకు వ్యతిరేకంగా చేసే ప్రచారాన్ని సాధారణ ప్రచారంలో భాగంగా చేస్తున్నాం. అది సరిపోదు. సంస్కరణల మూలంగా కార్మికులు, రైతుల్లో వివిధ తరగతుల్లో మధ్యతరగతి పట్టణ ప్రజలు, దళితులు, గిరిజనులు, మహిళలు, మైనార్టీలు వంటి వివిధ బలహీన వర్గాలు నిర్దిష్టంగా ఎలా నష్టపోతున్నాయో గమనించి, క్షేత్రస్థాయిలో ప్రచార ఆందోళనలు నిర్వహించాల్సి ఉంది. రాబోయే కాలంలో ఈ కృషిపై పార్టీ దృష్టిపెట్టబోతోంది. అందువల్ల సరళీకరణ విధానాలకు వ్యతిరేకంగా రాబోయే కాలంలో మరింత పటిష్టమైన పోరాటానికి అందరూ సన్నద్ధం కావాలి.

# చిర్రావూరి

(2వ పేజీతరువాయి)

సత్యాగ్రహం జరగాలని నిర్ణయించారు. ఇంతలో గాంధీజీ సత్యాగ్రహం ఉపసంహరించుకున్నారు. దీంతో ఆయనకు కాంగ్రెసుపై విశ్వాసం సన్నగిల్లింది. కమ్యూనిస్టు పార్టీతో సంబంధాలు పెట్టుకొని చిన్నచిన్న కార్యక్రమాలు నిర్వహించడం ప్రారంభించారు. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ఎక్కడా లేనివిధంగా సహచరులతో కలిసి ఖమ్మంలో పోస్టర్లు వేశారు. కొన్ని రోజుల తరువాత పోస్టర్లు వేసినందుకు ఆయనసహా 16 మందిపై పోలీసులు కేసులు పెట్టారు. ఇందుకోసం ప్రత్యేక కోర్టునే ఏర్పాటు చేశారు. స్థానికంగా ఉన్న పార్టీ కమిటీ పోస్టర్లు వేసిన కేసులో ఉన్నవారికి అండగా నిలిచింది. దీంతో పార్టీతో చిర్రావూరి సంబంధాలు మరింత పటిష్టమయ్యాయి. ఇక్కడి న్యాయవాదులు ప్రభుత్వానికి భయపడి ఈ కేసును వాదించడానికి ముందుకు రాలేదు. హైదరాబాదు నుంచి నాగులపల్లి కోదండరామారావును తీసుకు వచ్చారు. ఆయన ఆంధ్ర మహాసభ అభిమాని. కేసు రెండేళ్ళు నడించింది. 16 మందికీ రెండేళ్ళ శిక్ష పడింది. 11 నెలల తరువాత ప్రభుత్వం వారిని విడిచిపెట్టింది. అప్పటికే పార్టీ 'ప్రజా యుద్ధం' నినాదం తీసుకున్నది. నాగపూర్‌లో ఎల్ఎల్‌బి చదువుతున్న సర్వదేవభట్ల రామనాథం, ఎస్ఐగా పనిచేస్తున్న రమణయ్య, జైలు నుంచి విడుదలైన చిర్రావూరి పార్టీ శాఖగా ఏర్పడ్డారు. చిర్రావూరి పార్టీ ఖమ్మం కార్యదర్శిగానూ, రామనాథం, రమణయ్య వరంగల్‌కు కార్యదర్శులుగానూ వ్యవహరించేవారు. కొత్తగూడెంలో ట్రేడ్ యూనియన్‌నూ, వరంగల్‌లో మిల్ మజ్దూర్ యూనియన్‌నూ ఏర్పాటు చేశారు. చిర్రావూరి ఖమ్మం ప్రాంతంలో వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా ప్రచారం నిర్వహించేవారు. ఆంధ్ర మహాసభ ఉద్దేశ్యాలు ప్రచారం చేసేవారు. ఈ క్రమంలో ఎవరైనా మిలిటెంట్లు దొరికితే పార్టీ సభ్యులుగా రిక్రూట్ చేసేవారు. పార్టీ 1943లో చిర్రావూరిని 'ప్రదేశ్ కమిటీ'లోకి తీసుకున్నది. అప్పుడే ఆయనకు పుచ్చలపల్లి సుందరయ్యతో పరిచయమేర్పడింది.

ఆ తరువాత ఏడుగురితో ఖమ్మం జిల్లా కమిటీ ఏర్పడింది. ఈ జిల్లాలోని కార్మికోద్యమాన్ని రాష్ట్రంలోనే రెండో పెద్ద ట్రేడ్ యూనియన్‌గా తీర్చిదిద్దారు. 1945లో ఖమ్మంలో 12వ ఆంధ్ర మహాసభ జరిగింది. దానికి రావి నారాయణరెడ్డి అధ్యక్షత వహించగా పుచ్చలపల్లి సుందరయ్య హాజరయ్యారు. ఆ సభలో చిర్రావూరి కార్యదర్శిగా ఎన్నికయ్యారు. మహాసభకు జన సమీకరణను చూసిన ప్రభుత్వం నిర్బంధాన్ని మరింతగా పెంచింది. 1946లో చిర్రావూరి, పెండ్యాల సత్యనారాయణా 'స్టేట్ పీపుల్స్ కాన్ఫరెన్సు'కు ప్రతినిధులుగా కాశ్మీర్ వెళ్లారు. అదే సమయంలో కాశ్మీర్‌లో షేక్ అబ్దుల్లా నేతృత్వంలో పోరాటం సాగుతోంది. కాంగ్రెసు నుంచి కమ్యూనిస్టులను బహిష్కరించాలని నిర్ణయం తీసుకున్నారు. దీంతో ప్రభుత్వం తమను అరెస్టు చేస్తుందేమోనని ప్రయాణ మార్గం మార్చి రాయపూర్ మీదుగా బెజవాడ వచ్చారు. భూమికోసం, భుక్తి కోసం, బానిసత్వ విముక్తి కోసం నల్గండలో జరుగుతున్న పోరాటానికి వ్యతిరేకంగా నిర్బంధం మొదలైంది. పార్టీ భూ సమస్యపై ప్రతిఘటనకు పిలుపు ఇచ్చింది. ఆ సమయంలో చిర్రావూరిని మానుకోట ప్రాంతానికి పంపింది. తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటం ఉధృతంగా సాగుతోంది. ప్రభుత్వ నిర్బంధం పెరిగింది. పోలీసుల కాల్పులూ, ప్రజల ప్రతిఘటనా ఎక్కువయ్యాయి. మానుకోట ప్రాంతంలో భూస్వాములు ఎక్కువ. కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో భూ పంపకం జరిగింది. భూస్వాముల ధాన్యా గారాల్లోని ధాన్యాన్ని ప్రజలకు పంచిపెట్టారు. దాంతో ఉద్యమం మరింత పెరిగింది. గ్రామ కమిటీలు వేశారు. అవి గెరిల్లా దళాలకు సాయ పడుతుండేవి. కే సముద్రంలో పెద్ద పోరాటమే జరిగింది. పోలీసు స్టేషన్‌లో పోలీసులు గెరిల్లా లతో మూడు రోజులు పోరాడి చివరికి లొంగిపోయారు. స్టేషన్‌లోని ఆయుధాలను గెరిల్లాలకు అప్పగించారు. యూనియన్ మిలటరీ వచ్చి స్టేషన్‌లో కట్టివేయబడిన పోలీసులను విడిపించింది. అక్కణ్ణుంచి బయలుదేరి పార్టీ కార్యకర్తలపై దాడులకు దిగింది. కమ్యూనిస్టుల కోసం గ్రామంలో ఆచూకీ తీసింది. దీంతో చిర్రావూరి సహా పార్టీ కార్యకర్తలందరూ గ్రామస్తుల సహకారంతో తప్పించుకోగలిగారు. పార్టీ ఆదేశాల మేరకు పోలీసులపై కాల్పులు జరపరాదని ఊరుకున్నారు. ప్రాంతీయ దళాన్ని విభజించి చిన్నచిన్న గెరిల్లా దళాలుగా మార్చారు. అవి కూడా కొంతకాలం ప్రతిఘటించాయి. అయినా పోలీసులు పెద్దఎత్తున దాడులు చేశారు. చాలా దళాలు దెబ్బతిన్నాయి. ముఖ్యులు చనిపోయారు.

ఆ పరిస్థితుల్లో ట్రేడ్ యూనియన్ బాధ్యత వహించాలని పార్టీ నాయకత్వం చిర్రావూరిని వరంగల్‌కు పంపింది. అక్కడ పార్టీకి కార్యకర్తలెవరూ మిగల్లేదు. సర్వదేవభట్ల రామనాథం జైలు నుంచి విడుదల కాగానే ఆయననూ వరంగల్‌కు పంపించారు. ఇద్దరూ కలిసి అక్కడున్న పాత పరిచయాలు పెంచుకోవడానికి ప్రయత్నించారు. హైదరాబాద్‌లో ఉన్న ట్రేడ్ యూనియన్ కార్యకర్త రామమోహన్‌ను వరంగల్ కమిటీ కార్యదర్శిగా పంపారు. ఆయన జైలు నుంచి విడుదలై ఇక్కడికి వచ్చారు. జైల్లో ఉండొచ్చిన కాంగ్రెసువారు ఆయన్ను గుర్తుపట్టి పోలీసులకు పట్టించారు. తర్వాత చిర్రావూరి తదితరులను పట్టించారు. పోలీసులు చిర్రావూరిని కాల్చి చంపాలనుకొని ఆ తర్వాత నిర్ణయాన్ని మార్చుకున్నారు. తిరిగి జైలుకు తీసుకువచ్చి తన తల్లితోనూ, భార్యతోనూ చిర్రావూరిని గుర్తింపచేయించారు. భార్యను ఎనిమిది నెలలు, తల్లిని మూడు నెలలు జైల్లో పెట్టారు. ఆయన జైల్లో ఉన్నప్పుడు ఇల్లూ, ఇతర ఆస్తులూ జప్తు చేశారు. ఆయన ఇంటిని పోలీసు ఠాణాగా మార్చారు. ఆయనకు మూడేళ్ల కఠిన కారాగార శిక్ష విధించారు. కాళ్ళకూ, చేతులకూ సంకెళ్ళు వేసి క్రూరంగా వ్యవహరించారు. 1952లో సాధారణ ఎన్నికలు జరిగాయి. జైలు నిర్బంధం కొంత తగ్గింది. అప్పటికే చాలా మంది విడుదలకాగా, చిర్రావూరి, మంచికంటి రామకిషన్‌రావు, తమ్మా శేషయ్య జైల్లోనే ఉన్నారు. మే దినోత్సవరం రోజున జైలు మీద జెండా ఎగురవేసి కారాగార సూపరింటెండెంటునూ, సిఐడీనీ, పోలీసులనూ ఖంగు తినిపించారు.

వారు జైల్లో ఉండగానే మున్సిపల్ ఎన్నికలొచ్చాయి. కొంతమంది కామ్రేడ్స్ జైలుకు వచ్చి చిర్రావూరి సంతకం తీసుకుని ఎన్నికల నామినేషన్ పత్రం పూర్తి చేసి సంబంధిత అధికారికి అందించారు. ఆయన జైల్లో ఉండగానే కౌన్సిలర్‌గా ఎన్నికయ్యారు. మున్సిపాలిటీలోని మొత్తం 17వార్డులకుగాను కమ్యూనిస్టు పార్టీకి 12, ప్రజాపార్టీకి 1, ఇండిపెండెంట్లకు 4 స్థానాలొచ్చాయి. ప్రభుత్వం రెండు నెలలపాటు ఛైర్మన్ ఎన్నిక జరిపించలేదు. పైగా ప్రజాస్వామ్య విరుద్ధంగా తన మద్దతుదారులను ఏడుగురిని మున్సిపాలిటీకి నామినేట్ చేసింది. వీరుగాక ఎన్నికైన నలుగురు ఇండిపెండెంట్ కౌన్సిలర్లు, ఒక ప్రజాపార్టీ కౌన్సిలరునూ కలుపుకొంది. దీంతో ఇరుపక్షాలకూ చెరిసమానంగా 12 మంది సభ్యులున్నట్లయింది. ఛైర్మన్ ఎన్నికల సమయంలో ఒకరు కాంగ్రెసుకు వ్యతిరేకంగా ఓటు చేయడంతో చిర్రావూరి ఖమ్మం మున్సిపాలిటీ ఛైర్మనుగా ఎన్నికయ్యారు. నాటి నుంచి కొద్దికాలం మినహా ఆయన దాదాపు 30 ఏళ్లపాటు ఖమ్మం మున్సిపల్ ఛైర్మనుగా పనిచేశారు. ఇది రాష్ట్ర చరిత్రలోనే ఒక రికార్డు. చిర్రావూరి తెలతెలవారుతుండగానే తెల్లని పంచెకట్టుతో సైకిల్‌పై పట్టణ వీధుల్లో తిరుగుతూ ఛైర్మనుగా తన దినచర్యను ప్రారంభించేవారు. ఛైర్మనుగా తన సుదీర్ఘ పాలనలో ఆయన క్రమశిక్షణ, అంకితభావంతో ప్రజలకు సేవ చేశారు. కమ్యూనిస్టు పార్టీలో చీలిక అనంతరం సిపిఎం వైపుకు వచ్చిన ఆయన దీర్ఘకాలం ఖమ్మం జిల్లా కార్యదర్శిగా పనిచేశారు. రాష్ట్ర కమిటీ సభ్యులుగా, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులుగానూ బాధ్యతలు నిర్వహించారు. ఆయన వృద్ధాప్యంతో 2006లో కన్నుమూశారు.

RNI Reg. No. APTEL/2006/17554 Posted on 05-03-2015 Postal Regd. No L1/SD/407/13-15

# సిపిఐ(ఎం) 21వ అఖిలభారత మహాసభలు

## 2015, ఏప్రిల్ 14 నుండి 19 వరకు

**విశాఖపట్నం.**




**ఇంటింటి ప్రచారం**

మార్చి 1 నుండి 10 వరకు రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో మహాసభల జయప్రదం కొరకు ఇంటింటి ప్రచారం.

మార్చి 15 నుండి 20 వరకు అన్ని మున్సిపల్ పట్టణాలు, నగర పంచాయితీల్లో మహాసభల ప్రచారం.

**మార్చి 21న ఉగాది సందర్భంగా**

**జానపద ఉత్సవాలు**

**" జనం కోసం" కళాజాత**

రాష్ట్ర వ్యాప్తంగా మహాసభల ప్రచారం కోసం " జనం కోసం" కళా ప్రదర్శనలు

**సెమినార్స్**

ఉత్తరాంధ్ర అభివృద్ధిపై మార్చి 6న సెమినార్ విశాఖపట్నంలో జరుగుతుంది.

**భారీ బహిరంగ సభ**

ఏప్రిల్ – 19న భారీ బహిరంగసభ, ఆర్.కె బీచ్, విశాఖపట్నం.




## ఆహ్వానం




## వైజాగ్ ఫెస్ట్ 2015

**ఏప్రిల్ 10 - 19 వరకు**

**ఆంధ్రా యూనివర్శిటీ ఇంజనీరింగ్ కాలేజి గ్రౌండ్ విశాఖపట్నం**

**1. సాంస్కృతికోత్సవాలు :**

2వేల మంది కళాకారులు
జానపద కళలు
గిరిజన నృత్యాలు

**2. జాతీయ స్థాయి బుక్ ఎగ్జిబిషన్ :**

200 బుక్ స్టాల్స్
లక్షల కొలది పుస్తకాలు

**3. సైంటిఫిక్ ఎగ్జిబిషన్ :**

ఆలోచింపజేసే రకరకాల ప్రదర్శనలు
ఫోటో గ్రఫీ – షార్ట్ ఫిల్మ్
సినిమాటోగ్రఫీ – ఆర్ట్ గ్యాలరీ – కార్టూన్స్

**4. సాహిత్య గోష్ఠులు :**

వందలాది సాహిత్య ప్రముఖులు, కవులు, విమర్శకులు
ప్రతిరోజు సెమినార్లు, గోష్ఠులు

Marxistu, monthly organ of Communist Party of India (Marxist) A.P . State Committee.
Printer & Publisher B.V. Raghavulu. RNI Reg.No. APTEL/2006/17554. Vol.9, No.11. Published on March 1, 2015